www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
హైదరాబాద్ సిటీ*
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 148
గురువారం | 12-9-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: నవమి రా. 11.33 తదుపరి దశమి; నక్షత్రం: మూల రా. 9.53 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: శే.ఉ.7.10, రా.8.14-9.53; దుర్ముహూర్తం: ఉ.10.09-10.58, మ.3.01-3.50; అమృతఘడియలు: మ.3.20-4.58; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.16
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

70 ఏళ్లు పైబడిన వారందరికీ..
5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా

ఆదాయం, సామాజిక స్థితితో సంబంధం లేకుండా ఆయుష్మాన్ భారత్

- ప్రైవేటు ఆరోగ్య బీమా, ఈఎస్ఐ ఉన్నా వర్తింపు
- ఇతర ప్రభుత్వ బీమా పథకం ఏదైనా ఉంటే..
- ఆ స్కీంను లేదా 'ఆయుష్మాన్'ను ఎంచుకోవచ్చు
- కేంద్ర క్యాబినెట్ ఆమోదం.. మరిన్ని కీలక నిర్ణయాలు
- ఈవీల వినియోగం పెంపునకు 'పీఎం ఈ-డ్రైవ్'
- వచ్చే రెండేళ్లలో రూ.10,900 కోట్ల ఖర్చుకు నిర్ణయం
- 88,500 చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సహకారం
- జల విద్యుత్తు ప్రాజెక్టులకు రూ.12,461 కోట్లు
- 70 వేల కోట్లతో 62 వేల కిలోమీటర్ల గ్రామీణ రోడ్లు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం ఇకపై దేశంలో 70 ఏళ్లు, ఆ పైబడిన వయసు వారందరికీ వర్తించనుంది. ఆదాయంతో సంబంధం లేకుండా ఆ వయసు వారంతా అర్హులవుతారు. దీనికి బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశం ఆమోద ముద్ర వేసింది. ఆ భేటీలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు తెలిపారు. ఆయుష్మాన్ భారత్‌లో తాజా నిర్ణయంతో దాదాపు 6 కోట్ల మంది సీనియర్ సిటిజన్లకు లబ్ధి

మిగతా 2వ పేజీలో...

262 నిర్మాణాల కూల్చివేత..
111 ఎకరాల స్వాధీనం!

ఆక్రమణల తొలగింపుపై హైడ్రా నివేదిక
నవరాత్రులు ముగియగానే మళ్లీ కూల్చివేతలు!

ఆరుగురు అధికారుల వాంగ్మూలాలు నమోదు! 3

అక్రమ నిర్మాణాలకు అండగా నిలిచిన వారిని ప్రశ్నించిన పోలీసులు.. త్వరలో సీపీకి నివేదిక!
అనంతరం అధికారులపై చర్యలు!




ఎస్సైల పాసింగ్ అవుట్ పరేడ్‌లో సీఎం రేవంత్; వరద బాధితుల సహాయం కోసం సీఎంకు రూ.కోటి చెక్కు ఇస్తున్న పవన్‌కల్యాణ్

చెరువును చెరబడితే.. చెరసాలే!

ఆక్రమణదారులు స్వచ్ఛందంగా వదిలేయాలి.. లేదంటే నేలమట్టం చేస్తాం

- కోర్టుకెళ్లినా.. న్యాయపరంగా కొట్లాడి తొలగిస్తాం
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోనివి రెగ్యులరైజ్ చేయం
- మూసీ పరివాహక ప్రాంతంలో నివాసాలు ఏర్పరచుకున్న వారికి పునరావాసం కల్పిస్తాం
- పోలీస్ అంటే ఉద్యోగం కాదు.. భావోద్వేగం
- నేరస్థులకు ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండకూడదు
- డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపాలి
- హైదరాబాద్, వరంగల్‌లో పోలీసుల పిల్లలకు రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తాం: సీఎం రేవంత్
- శిక్షణ పూర్తయిన ఎస్సైల పాసింగ్ అవుట్ పరేడ్

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చెరువులను కబ్జా చేసి ఫాంహౌస్‌లు నిర్మించుకున్నవారు స్వచ్ఛందంగా వాటిని కూల్చివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. లేదంటే ఆ నిర్మాణాలను నేలమట్టం చేస్తామని, ఆక్రమణదారులను జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణల వల్లే వరదలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఆ వరదలు బస్తీల్లో ఉన్న పేదల ఇళ్లల్లోకి వెళ్తున్నాయని, వారు కష్టపడి సంపాదించుకున్నది మొత్తం కొట్టుకుపోతోందని చెప్పారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోనైనా, హైదరాబాద్‌లోనైనా, కృష్ణా నది ఒడ్డున మునిగే ప్రాంతాలైనా దుర్మార్గుల ఆక్రమణల వల్లే వరదలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఆ ఆక్రమణల్ని తొలగించేందుకే తాము హైడ్రాను ఏర్పాటు చేశామన్నారు. బుధవారం హిమాయత్‌సాగర్‌లోని

మిగతా 13వ పేజీలో...

సెప్టెంబరు 17న తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం

కొత్తగా నామకరణం చేసిన రేవంత్ సర్కారు
బీఆర్ఎస్ హయాంలో 'జాతీయ సమైక్యతా దినం'..
విమోచన దినోత్సవంగా ప్రకటించిన కేంద్రం

ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ 13

వరద సాయం కోసం నేడు అమిత్‌షాతో భేటీ
టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ కూడా ఢిల్లీకి
కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను కలవనున్న నేతలు

వరద నష్టం రూ.10 వేల కోట్లు!

ప్రభుత్వానికి విపత్తుల నిర్వహణ విభాగం నివేదిక



చెరువు నీళ్లలో ఇంజాపూర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం.. నీళ్లలో పిల్లర్ల తాలూకు ఇనుప చువ్వలు

తేలియాడే డబుల్ ఇళ్లు!

- రంగారెడ్డి జిల్లా ఇంజాపూర్‌లోని దిలావర్‌ఖాన్ చెరువు బఫర్‌జోన్‌లో..
- 10 ఎకరాల్లో 1296 కుటుంబాల కోసం జీ ప్లస్ 9తో 12 బ్లాకులు
- 6 బ్లాకులు పూర్తి.. మిగతావి వివిధ దశల్లో
- 8 ఏళ్లుగా పనులు.. అప్పటి నుంచీ నీళ్లలోనే
- తుర్కయంజాల్ మాసాబ్ చెరువు అలుగు నాలాకు అటూ ఇటూ నిర్మాణం

హయత్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూడు, గుడ్డ తర్వాత పేదలకు కావాల్సింది తమకంటూ ఓ చిన్న గూడు! అది.. డబుల్ బెడ్‌రూమ్ రూపంలో లభిస్తే వారికి అంతకన్నా ఆనందం ఏముంటుంది? మరి.. అలాంటి ఇళ్లను ఎక్కబడితే అక్కడ నిర్మించి ఇస్తే లబ్ధిదారులు తీసుకుంటారా? పేదలకు కావాల్సింది ఇళ్లే అయినప్పుడు అవి ఎక్కడ నిర్మించి ఇచ్చినా తీసుకుంటారని అనుకున్నారేమో గత ప్రభుత్వ హయాంలో ఇదిగో ఇలా చుట్టూ నీరు చేరేలా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టేశారు! నీళ్లపై తేలియాడే ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మునిసిపాలిటీ ఇంజాపూర్ గ్రామ పరిధిలోనివి! ఈ ఇళ్లు నిర్మించింది

మిగతా 3వ పేజీలో...

1,284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు
నోటిఫికేషన్

21 నుంచి అక్టోబరు 5 వరకు దరఖాస్తులు
నవంబరు 10న సీబీటీ పద్ధతిలో పరీక్ష

వైద్య విద్యార్థినిపై రోగి దాడి

మద్యం మత్తులో జూనియర్ డాక్టర్‌తో అసభ్య ప్రవర్తన.. నిందితుడి అరెస్టు

గాంధీ ఆస్పత్రిలో ఘటన

బౌద్ధనగర్, అడ్డగుట్ట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో విధి నిర్వహణలో ఉన్న వైద్య విద్యార్థిని(జూనియర్ డాక్టర్)పై చికిత్స కోసం వచ్చిన ఓ రోగి దాడి చేశాడు. చేయి, యాప్రాన్‌ను గట్టిగా లాగడంతో జూనియర్ డాక్టర్ తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన తోటి వైద్యులు, సిబ్బంది.. ఆమెను విడిపించారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ బన్సీలాల్‌పేటకు

మిగతా 14వ పేజీలో...

ధరణి స్థానంలో.. భూమాత

- రీ సర్వే చేపట్టి భూధార్ కార్డులు, టైటిల్ గ్యారెంటీ అమలుకు కార్యాచరణ
- కౌలుదారు చట్టం-2011 అమలు, కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు
- 1958కి ముందు అసైన్డ్ భూములు నిషేధిత జాబితా నుంచి తొలగింపు
- పార్ట్-బిలో ఉన్న 18 లక్షల ఎకరాల, సాదాబైనామా దరఖాస్తులకు పరిష్కారం
- ధరణి కమిటీ ముసాయిదా నివేదిక

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధరణి స్థానంలో భూమాత పోర్టల్‌ను తీసుకురావడం, భూముల రీసర్వే, ల్యాండ్ టైటిల్ అమలు, అధికారులకు నైపుణ్య శిక్షణ కోసం ప్రత్యేక అకాడమీ ఏర్పాటు, భూ వినియోగ పాలసీ, భూముల రీసర్వే చేపట్టి శాశ్వత ప్రాతిపదికన భూధార్ కార్డుల అందజేత వంటి పలు సిఫార్సులతో ధరణి కమిటీ ముసాయిదా నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రాతిపదికన ప్రభుత్వం మార్పులు తీసుకురావాలని నివేదికలో పలు సూచనలు పేర్కొంది. సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, తహసీల్దారు కార్యాలయాల్లో భూ సహాయ కేంద్రాల ఏర్పాటు, ఇప్పుడున్న అనేక భూ చట్టాలను మదింపు చేసి ఒకే చట్టం తీసుకురావడం, 1958కి ముందు ఇచ్చిన అసైన్డ్ భూములను నిషేధిత జాబితాల నుంచి తొలగించడం వంటి పలు అంశాలను ప్రస్తావించారు. ధరణి కమిటీ ప్రధానంగా ఆర్వోఆర్-2020 పేరుతో తీసుకొచ్చిన ధరణి చట్టంలో మార్పులు చేయడం, పోర్టల్‌లోని లోపాలను సవరించడం, ప్రైవేటు ఏజెన్సీ చేతిలో ఉన్న పోర్టల్ నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం చేపట్టడం, ధరణి పార్ట్-బిలో ఉన్న 18 లక్షల ఎకరాలకు సంబంధించిన కేసులు, 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేసింది. రాష్ట్రంలో ధరణి పోర్టల్ వల్ల సుమారు 22 లక్షలకుపైగా సమస్యలు తలెత్తాయని చెబుతూ వీటిని

మిగతా 13వ పేజీలో...

ప్రెస్‌వూ చత్వారం చుక్కల మందుకు
అనుమతి నిలిపివేత

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: 'చత్వారానికి దివ్యౌషధమ'ని ఎన్‌టాడ్ కంపెనీ ప్రచారం చేసుకున్న 'ప్రెస్‌వూ' చుక్కల మందుకు ఇచ్చిన అనుమతిని ఔషధ నియంత్రణ సంస్థ (డీసీజీఐ) తాత్కాలికంగా రద్దు చేసింది. 40-55 ఏళ్ల వయస్కుల్లో కొద్దిపాటి నుంచి ఓ మోస్తరు చత్వారం(ప్రెస్బియోపియా)తో బాధపడుతున్నవారు ఈ మందును కంట్లో ఒక్క చుక్క వేసుకుంటే 15 నిమిషాల్లో పనిచేయడం ప్రారంభిస్తుందని ముంబైకి చెందిన ఆ ఫార్మా సంస్థ ప్రకటించింది. చత్వారంతో బాధపడుతున్నవారికి కళ్లజోడు అవసరాన్ని తగ్గిస్తుందని చెప్పుకుంది. ఇలాంటి మందు దేశంలో ఇంత వరకు లేదని, ఇదే మొదటిదని కూడా ప్రకటించింది. ఈ ప్రచారాన్ని తీవ్రంగా పరిగణించిన డీసీజీఐ.. 'ప్రెస్‌వూ' చుక్కల మందు తయారీ, అమ్మకాలకు గత నెల 20న ఇచ్చిన అనుమతిని సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపింది. చత్వారానికి చికిత్సలో ఉపయోగించేందుకు ఈ మందుకు అనుమతి ఇచ్చామే కానీ 15 నిమిషాల్లోనే పనిచేస్తుందని, కళ్లజోడు అవసరాన్ని తగ్గిస్తుందని కాదని స్పష్టం చేసింది. ఆ కంపెనీ ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

చేయని నేరానికి పదేళ్ల జైలు..
బాధితుడికి రూ.419 కోట్ల పరిహారం!

న్యూయార్క్, సెప్టెంబరు 11: చేయని నేరానికి పదేళ్ల శిక్ష అనుభవించిన వ్యక్తికి అమెరికాలోని షికాగో కోర్టు.. ఏకంగా 50 మిలియన్ డాలర్ల (రూ.419.96 కోట్ల) పరిహారం చెల్లించాలని సంచలన తీర్పునిచ్చింది. 19 ఏళ్ల వ్యక్తిని హత్య చేశాడన్న అభియోగాలపై మార్సెల్ బ్రౌన్‌ను 2008లో పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. అతడిని దోషిగా నిర్ధారిస్తూ 35 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అయితే బ్రౌన్‌తో పోలీసులు బలవంతంగా నేరం ఒప్పించారని.. అలాగే కల్పిత సాక్ష్యాలు సృష్టించారని 2018లో అతడి న్యాయవాదులు కోర్టుకు సాక్ష్యాలు సమర్పించారు. దీంతో బ్రౌన్‌పై నమోదైన కేసును కొట్టేసిన కోర్టు.. అతడిని విడుదల చేసింది. ఈ నేపథ్యంలోనే తనకు జరిగిన అన్యాయంపై బ్రౌన్ షికాగో ఫెడరల్ కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు.. కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 'తప్పుడు కేసులో బ్రౌన్‌ను అరెస్టు చేసినందుకు 10 మిలియన్ డాలర్లు.. 10 ఏళ్ల పాటు జైలు శిక్ష అనుభవించినందుకు 40 మిలియన్ డాలర్ల పరిహారం అతడికి చెల్లించాలి' అని ఆదేశించింది.

భరణం కోసం భార్య ఖాళీగా ఉండొద్దు

భోపాల్, సెప్టెంబరు 11: ఉన్నత చదువు, ఉద్యోగ అర్హత ఉండి కూడా భార్య ఏ పని చేయకుండా కేవలం భర్త నుంచి వచ్చే భరణంపైనే ఆధారపడటం సరికాదని మధ్యప్రదేశ్ హైకోర్టు పేర్కొంది. భరణం వస్తుంది కదా అని.. జీవనోపాధి కోసం సంపాదించుకోవడం ఆపేయడం సరికాదని వ్యాఖ్యానించింది. నెలకు రూ.60 వేలు భరణంగా చెల్లించాలంటూ ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ భార్యాభర్తలిద్దరూ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. రూ.60 వేల భరణం తనకు సరిపోదంటూ విచారణ సందర్భంగా భార్య కోర్టుకు తెలిపింది. దీనిపై భర్త వాదనలు వినిపిస్తూ.. 'ఏ కారణం లేకుండానే నా భార్య విడిగా ఉంటోంది. ఆమె కూడా దుబాయ్‌లో బ్యాంకులో ఉద్యోగం చేసింది. బ్యూటీ పార్లర్‌తో ఇప్పుడు కూడా బాగానే సంపాదిస్తోంది. కాబట్టి భరణంగా ఇవ్వాల్సిన మొత్తాన్ని తగ్గించండి' అంటూ కోర్టును కోరారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు.. భరణాన్ని రూ.60 వేల నుంచి రూ.40 వేలకు తగ్గిస్తూ తీర్పు వెలువరించింది.

లోకం తీరు



రీల్స్ మోజుకు కుటుంబం బలి

- పట్టాలపై రీల్స్ చేస్తుండగా దూసుకువచ్చిన రైలు
- 3 ఏళ్ల పిల్లాడితో పాటు తల్లిదండ్రుల దుర్మరణం

లక్ష్మీపూర్ ఖేరి(యూపీ), సెప్టెంబరు 11: సరదా కోసమో, సంచలనం కోసమో రీల్స్ చేస్తూ ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజురోజుకి పెరిగిపోతోంది. తాజాగా యూపీలో ఓ కుటుంబం రీల్స్ మోజుకు బలైపోయింది. రైలు పట్టాలపై రీల్స్ చేస్తున్న ఓ వ్యక్తి నిర్లక్ష్యానికి అతని భార్య, 3 ఏళ్ల కుమారుడు దుర్మరణం పాలయ్యారు. రీల్స్ చేస్తుండగానే పట్టాలపై రైలు దూసుకు రావడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఉమారియా గ్రామ సమీపంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. మృతులను సీతాపూర్ జిల్లాకు చెందిన మహమ్మద్ అహ్మద్(26), అతని భార్య నజ్నీన్(24), వారి 3 ఏళ్ల కుమారుడు అబ్దుల్లాగా పోలీసులు గుర్తించారు.

వరదలతో తెలుగు రాష్ట్రాలకు భారీ నష్టం: శివరాజ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన వరదలతో రెండు రాష్ట్రాలకు భారీ నష్టం వాటిల్లిందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. ప్రత్యేకించి పంటపొలాలు, పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇటీవల పర్యటించిన శివరాజ్‌సింగ్.. నష్టాన్ని స్వయంగా పరిశీలించడంతోపాటు కేంద్రం నుంచి తగిన సహాయం అందేలా కృషి చేస్తానని చెప్పారు. ఈ మేరకు బుధవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిసి నివేదిక సమర్పించారు. వరదల వల్ల కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే 1.8 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లుగా అంచనా వేసినట్లు చెప్పారు. త్వరలోనే కేంద్ర బృందం రెండు రాష్ట్రాల్లో పర్యటిస్తుందని, నష్టాన్ని అంచనా వేస్తుందని శివరాజ్‌సింగ్ వెల్లడించారు.

అన్ని రైళ్లకు సీసీ కెమెరాలు: అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: దేశంలోని అన్ని రైళ్లకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఇటీవల కాలంలో దుండగులు రైలు పట్టాలపై సిమెంటు దిమ్మెలు, రాళ్లు పెడుతున్న ఘటనలు పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రతి ఇంజన్‌కు ముందు, వెనుక, గార్డు కోచ్‌కు కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. మరోవైపు, రైల్వే ట్రాక్‌ల వద్ద మిగిలిపోయిన ఇంజినీరింగ్ పరికరాలు, మెటీరియల్‌ను తక్షణమే తొలగించాలని రైల్వే బోర్డు అన్ని రైల్వే జోన్ల అధికారులను ఆదేశించింది. పట్టాలపై గ్యాస్ సిలిండర్లు, సిమెంటు బ్లాకుల వంటివి ఉంచి రైళ్లను పట్టాలు తప్పించడానికి దుండగుల ప్రయత్నాల దృష్ట్యా బోర్డు ఈ ఆదేశాలు ఇచ్చింది.

ఎయిర్ పోర్టు ఆధునీకరణకు అదానీతో ఒప్పందం వద్దు

- కెన్యా వైమానికరంగ సిబ్బంది ఉద్యమం

నైరోబీ, సెప్టెంబరు 11: కెన్యా రాజధాని నైరోబీలోని జోమో కెన్యెట్టా అంతర్జాతీయ విమానాశ్రయం ఆధునికీకరణ కాంట్రాక్టును అదానీ గ్రూపునకు అప్పగించటానికి వ్యతిరేకంగా ఆ దేశ వైమానిక రంగ ఉద్యోగులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారు. బుధవారం జోమో కెన్యెట్టా ఎయిర్‌పోర్టులో వందలాదిమంది కార్మికులు, సిబ్బంది నిరసన ప్రదర్శన నిర్వహించారు. కెన్యా వ్యాప్తంగా పలు విమాన సర్వీసులు నిలిచిపోయాయి. జోమో కెన్యెట్టా విమానాశ్రయం ఆధునికీకరణతోపాటు అదనపు రన్‌వే, టెర్మినల్ నిర్మాణం పనులను అదానీ గ్రూపునకు అప్పగించాలని కెన్యా ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. దీనికిగాను విమానాశ్రయం నిర్వహణను 30 ఏళ్ల పాటు అదానీ కంపెనీ చూసుకుంటుంది. అంటే అన్ని సంవత్సరాలపాటు ఆ ఎయిర్‌పోర్టు నుంచి వచ్చే ఆదాయం అంతా అదానీ గ్రూపు సొంతమవుతుంది. ఈ ఒప్పందాన్ని కెన్యా ఎయిర్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ కాంట్రాక్టు వల్ల అనేక మంది కార్మికులు, సిబ్బంది ఉద్యోగాలు కోల్పోతారని బుధవారం సమ్మెకు పిలుపునిచ్చింది. మరోవైపు, అదానీ ఒప్పందం అమలును స్థానిక హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేస్తూ సోమవారం తీర్పునిచ్చింది.

మైనింగ్ బకాయిలపై ధర్మాసనం ఏర్పాటు చేస్తాం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: ఖనిజాల వెలికితీతకు సంబంధించి కేంద్రం నుంచి, మైనింగ్ కంపెనీల నుంచి రాష్ట్రాలకు దక్కాల్సిన రాయల్టీ, పన్ను బకాయిల అంశంపై ఒక ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తామని సుప్రీంకోర్టు బుధవారం తెలిపింది. ఖనిజాలపై పన్ను విధించే అధికారం పార్లమెంటుకు లేదని, ఆ అధికారం రాష్ట్రాల చట్టసభలదేనని ఈ ఏడాది జూలై 25వ తేదీన సుప్రీంకోర్టు తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనం 8:1 మెజారిటీతో తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగా.. ఆగస్టు 14వ తేదీన తదుపరి ఆదేశాలు ఇస్తూ.. తాము ఇచ్చిన తీర్పు 2005 ఏప్రిల్ 1వ తేదీ నుంచి వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఝార్ఖండ్ ప్రభుత్వం.. బకాయిల వసూళ్లపై, ఆ అంశంలో తలెత్తుతున్న న్యాయపరమైన వివాదాలపై విచారణ జరపాలని సుప్రీంకోర్టును కోరింది.

మాకు మరో 20 సీట్లు వచ్చి ఉంటే వాళ్లు ఈ పాటికి జైల్లో ఉండేవారు: ఖర్గే

అనంత్‌నాగ్, సెప్టెంబరు 11: కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తమకు మరో 20 సీట్లు దక్కి ఉంటే బీజేపీలో కొందరు నేతలు ఈ పాటికి జైళ్లలో ఉండేవారని అన్నారు. జమ్మూకశ్మీర్ అనంతనాగ్‌లో ఎన్నికల ప్రచారంలో ఖర్గే మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఖర్గే ఈ సందర్భంగా ఎవరి పేర్లు ప్రస్తావించనప్పటికీ ఈ వ్యాఖ్యలు బీజేపీ ముఖ్యనేతలకు ఉద్దేశించి చేసినవేనని అర్థమవుతోంది. మరోవైపు జమ్మూకశ్మీర్ ఎన్నికలకు కాంగ్రెస్ ఐదు గ్యారెంటీలను ప్రకటించింది. మహిళలకు రూ. 5లక్షల వరకు వడ్డీలేని రుణాలు, ప్రతి కుటుంబానికి రూ. 25లక్షల ఆరోగ్య బీమాతో పాటు పలు హామీలిచ్చింది. ప్రతి కుటుంబంలో ఓ మహిళకు నెలకు రూ. 3వేలు, కుటుంబంలోని ప్రతి ఒక్కరికి 11 కేజీల ధాన్యం అలాగే మన్మోహన్ హయాంలో హామీ ఇచ్చినట్లు వలసవచ్చిన కశ్మీరి పండిట్‌లకు పునరావాసం కల్పిస్తామని ప్రకటించింది. అలాగే జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చింది.

భారత్‌లోకి చైనా చొరబాటు

4వేల చ.కి.మీ మేర చొచ్చుకు వచ్చింది.. ఢిల్లీ ఎంత ఉంటుందో అంతమేర లద్దాఖ్‌లోకి

- మోదీ ఎదుర్కోలేకపోయారు
- వాషింగ్టన్‌లో రాహుల్ వ్యాఖ్యలు
- దేశ ప్రతిష్టకు గాయం: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ/బెంగళూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటనలో ఉన్న విపక్షనేత రాహుల్ గాంధీ మోదీ ప్రభుత్వంపై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత భూభాగాన్ని చైనా 4వేల చదరపు కిలోమీటర్ల మేర ఆక్రమించిందని.. ఢిల్లీ ఎంత మేర విస్తరించి ఉందో.. అంత మేర లద్దాఖ్‌లో భారత నేలను చైనా దళాలు ఆక్రమించాయని పేర్కొన్నారు. బుధవారం వాషింగ్టన్‌లో ప్రెస్‌క్లబ్‌లో రాహుల్ మాట్లాడారు. భారత్‌లోకి చైనా చొరబాటు ఘోర ఉత్పాతం అని, చైనాను ప్రధాని మోదీ సరిగా ఎదుర్కోలేకపోయారని ఆరోపించారు. తమ భూభాగాన్ని 4వేల చ.కి.మీ పొరుగుదేశం ఆక్రమిస్తే అమెరికా ఏ రకంగా స్పందిస్తుంది? తాను అంతా బాగానే చేశానని ఏ అమెరికా అధ్యక్షుడైనా చెప్పి తప్పించుకోగలరా? అని ప్రశ్నించారు. కాగా దేశం మంచి స్థితికి చేరుకున్న తర్వాత రిజర్వేషన్ల రద్దును పరిశీలిస్తామని మంగళవారం చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగడంతో రాహుల్ వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని.. తాను రిజర్వేషన్లను సమర్థిస్తానని.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రిజర్వేషన్ల పరిమితిని 50శాతానికి పైగా తీసుకెళ్తామని చెప్పారు. కాగా చైనా దురాక్రమణ అంటూ రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ అగ్రనేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ప్రకటనలతో జనాన్ని రాహుల్ తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆయన మాటల్లో వాస్తవం లేదని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ విమర్శించారు. మొహబ్బత్ (ప్రేమ) దుకాణాన్ని నడుపుతున్నానని ఇంతవరకూ చెప్పిన రాహుల్ అబద్ధాల దుకాణాలను తెరిచినట్లుందన్నారు.



విదేశీ పర్యటనలో రాహుల్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని, ఆయన వ్యాఖ్యలు దేశ ప్రతిష్టను గాయపరిచాయని మండిపడ్డారు. దేశ వ్యతిరేక ప్రకటనలు చేస్తున్న రాహుల్ దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులతో చేతులు కలిపారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా విమర్శించారు. జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ దేశ వ్యతిరేక, రిజర్వేషన్ వ్యతిరేక ఎజెండాను సమర్థించడం, విదేశీ వేదికల్లో భారత వ్యతిరేక ప్రకటనలు చేయడం ద్వారా దేశ భద్రత, ప్రజల మనోభావాలకు రాహుల్ వ్యాఖ్యలు ముప్పు అని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పడం ద్వారా కాంగ్రెస్ రిజర్వేషన్ వ్యతిరేక వైఖరి బయటపడిందని అన్నారు. బీజేపీ ఉన్నంతవరకూ రిజర్వేషన్లను రద్దు చేయడం కానీ, దేశ భద్రతతో ఎవరైనా చెలగాటమాడటాన్ని కానీ అనుమతించదని పేర్కొన్నారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ రాహుల్‌ను భారత వ్యతిరేక వేర్పాటువాదిగా అభివర్ణించారు. దేశ సమైక్యత, సమగ్రత, సామాజిక సామరస్యాన్ని ధ్వంసం చేసేందుకు, దేశాన్ని అంతర్యుద్ధం దిశగా నడిపించేందుకు ఆయన కంకణం కట్టుకున్నారని యోగి విమర్శించారు. ఇదిలా ఉండగా, కర్ణాటక సీఎం సిద్దరామయ్య ముడా వివాదంలో చిక్కుకుని.. సీఎం మార్పుపై చర్చ నడుస్తున్న నేపథ్యంలో.. రాహుల్‌గాంధీని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వాషింగ్టన్‌లో కలిశారు. దీనిపై రాజకీయంగా చర్చలు సాగుతున్నాయి. శివకుమార్ అమెరికా వెళ్లేముందు ఖర్గేకు లేఖ రాశారు. వ్యక్తిగత కారణాలతోనే అమెరికా వెళ్తున్నట్లు అందులో పేర్కొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలు ఖలిస్థాన్‌కు సమర్థనే



భారత్‌లో సిక్కుల మతస్వేచ్ఛ గురించి రాహుల్ చేసిన వ్యాఖ్యలను నిషేధిత ఉగ్రవాద సంస్థ సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) సమర్థించింది. రాహుల్ వ్యాఖ్యలు ప్రత్యేక ఖలిస్థాన్ డిమాండ్‌ను సమర్థిస్తున్నాయని ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ అన్నారు. వర్జీనియాలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో రాహుల్ మాట్లాడుతూ 'సిక్కులు తలపాగాలు, కడియాలు ధరించవచ్చా, వారు గురుద్వారాకు వెళ్లగలుగుతున్నారా అనే దాని పైనే భారత్‌లో పోరాటం జరుగుతోంది' అని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై పన్నూన్ సోషల్ మీడియాలో స్పందించారు. 'భారత్‌లో సిక్కుల అస్తిత్వానికి ముప్పు గురించి రాహుల్ చేసిన వ్యాఖ్యలు సాహసోపేతమైనవి, మార్గదర్శమైనవి మాత్రమే కాదు. ఇది ఖలిస్థాన్ స్థాపనకు పంజాబ్ ఇండిపెండెన్స్ రెఫరెండంను సమర్థించడంపై ఎస్ఎఫ్‌జే వైఖరిని కూడా ధ్రువీకరిస్తుంది' అని పన్నూన్ తెలిపారు.

సోనియా నివాసం వద్ద నిరసన ప్రదర్శన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: భారత్‌లో మతస్వేచ్ఛపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ మద్దతు ఉన్న సిక్కుల గ్రూప్ ఢిల్లీలోని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ నివాసం ఎదుట నిరసన చేపట్టింది. కాంగ్రెస్ పాలనలో కంటే బీజేపీ ప్రభుత్వంలో తాము సురక్షితంగా ఉన్నామని, తన వ్యాఖ్యలకు రాహుల్ క్షమాపణలు చెప్పాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. మరోవైపు, రాహుల్ గాంధీపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్, ఢిల్లీ పోలీసు కమిషనర్‌కు సుప్రీం కోర్టు న్యాయవాది వినీత్ జిందాల్ బుధవారం ఫిర్యాదు చేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం తన వ్యాఖ్యలతో సిక్కులను రెచ్చగొట్టేందుకు రాహుల్ ప్రయత్నించారని ఆ ఫిర్యాదులో జిందాల్ ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రకటనలు చేసినందుకు ఆయనపై కేసు నమోదు చేయాలని, ఆయన పాస్‌పోర్టును రద్దు చేయాలని ఫిర్యాదులో కోరానని జిందాల్ తెలిపారు.

వినేశ్‌పై పోటీకి రెజ్లర్‌ను దింపిన ఆప్

జులానా, సెప్టెంబరు 11: రానున్న హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ బుధవారం 20 మంది అభ్యర్థులతో తన రెండో జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో 'జులానా' నియోజకవర్గం నుంచి మాజీ రెజ్లర్ కవితా దలాల్‌ను బరిలోకి దింపనున్నట్లు ప్రకటించింది. ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఆమెపై బీజేపీ తరఫున కెప్టెన్ యోగేశ్ బైరాగీ పోటీ చేస్తుండగా, ఆప్ కవితా దలాల్‌ను రంగంలోకి దింపింది. కవితా దలాల్ భారతదేశం తరఫున డబ్ల్యూడబ్ల్యూఈలో పాల్గొన్న మొదటి మహిళా రెజ్లర్‌గా గుర్తింపు పొందారు. హరియాణాలో ఆప్ కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేస్తుందని ఊహించినప్పటికీ ఒంటరిగా బరిలోకి దిగింది.

రైళ్లలో ఆహారం సరఫరాకు
క్లౌడ్ కిచెన్లు

ముంబై, సెప్టెంబరు 11: రైళ్లలో అందించే ఆహార నాణ్యతపై తరచూ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో రైల్వే ప్రయాణికులకు క్లౌడ్ కిచెన్ల ద్వారా ఆహారాన్ని సరఫరా చేయాలని ఐఆర్‌సీటీసీ నిర్ణయించింది. ప్రస్తుతం రైళ్లలో ఆహార సరఫరా కోసం పెద్ద పెద్ద రైల్వే స్టేషన్ల దగ్గర బేస్ కిచెన్లు ఉన్నాయి. వీటిల్లో వేలాది మంది కోసం ఆహారాన్ని వండి, ప్యాకింగ్ చేసి రైళ్లలో అందజేస్తున్నారు. వీటిని ఐఆర్‌సీటీసీ నిర్వహిస్తోంది. అయితే, బేస్ స్టేషన్లలో పరిశుభ్రత పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. దీంతో, ఐఆర్‌సీటీసీ క్లౌడ్ కిచెన్లపై దృష్టి సారించింది. ఇవి ప్రైవేటు ఆపరేటర్ల నియంత్రణలో ఒప్పందం ప్రకారం నడుస్తాయి. సాధారణంగా ఈ ఒప్పందం ఏడేళ్ల పాటు ఉంటుంది. ప్రైవేటు క్యాటరింగ్ సంస్థలు ఆహారాన్ని వండి రైళ్లలో అందజేయాల్సి ఉంటుంది. క్లౌడ్ కిచెన్ల పరిమాణాలు వేర్వేరుగా ఉంటాయి. సైజును బట్టి కొన్నింటిలో వందల మందికి, మరికొన్నింటిలో మూడు నుంచి నాలుగు వేల మందికి ఆహార పదార్థాలను వండుతారు. క్లౌడ్ కిచెన్ వంటశాలల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి అధికారులు ఎప్పటికప్పుడు పరిశుభ్రతను పర్యవేక్షిస్తారు. పరిశుభ్రత పాటించకపోతే జరిమానా విధిస్తారు. కాంట్రాక్టును రద్దు చేసే అధికారం కూడా రైల్వే అధికారులకు ఉంటుంది. ముంబైలో ఇప్పటికే క్లౌడ్ కిచెన్ సేవలు ప్రారంభమైనట్లు ఐఆర్‌సీటీసీ తెలిపింది. "ముంబైలో 90 క్లౌడ్ కిచెన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇప్పటికే 50 కిచెన్లను అందుబాటులోకి తెచ్చాం" అని ఐఆర్‌సీటీసీ అధికారి ఒకరు వివరించారు. ముంబైలో క్లౌడ్ కిచెన్ సేవలు అందుబాటులోకి వచ్చాక, ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు తగ్గాయని తెలిపారు. పశ్చిమ జోన్‌లోని మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో దాదాపు 200క్లౌడ్ కిచెన్ల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇవి రెండు, మూడు నెలల్లో అందుబాటులోకి రానున్నాయి.

70 ఏళ్లు పైబడిన వారందరికీ..
5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా

(మొదటి పేజీ తరువాయి)

కలుగుతుందన్నారు. వారి సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ఏడాదిలో రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సౌకర్యం పొందవచ్చన్నారు. ఇప్పటికే ఈ పథకం వర్తిస్తున్న కుటుంబాల్లోని 70 ఏళ్లు, ఆ పైబడిన వారుంటే... వారికి అదనంగా ఏడాదికి రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తారు. ఒకవేళ ఇతర ప్రభుత్వ బీమా పథకాల్లో (సీజీహెచ్ఎస్, ఈసీహెచ్ఎస్, సీఏపీఎఫ్) ఏవైనా వర్తిస్తుంటే.. దాన్ని లేదా ఆయుష్మాన్ భారత్‌ను ఎంచుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రైవేటు ఆరోగ్య బీమా పాలసీలు ఉన్నా లేదా కార్మిక రాజ్య బీమా (ఈఎస్ఐ) పథకం వర్తిస్తున్న వారు ఆయుష్మాన్ భారత్‌లో కూడా లబ్ధి పొందవచ్చు. ఈ పథకంలో అర్హులైన సీనియర్ సిటిజన్లకు ప్రత్యేకంగా కొత్త కార్డు జారీ చేస్తారు. ప్రస్తుతం ఈ పథకంలో 12.34 కోట్ల కుటుంబాలకు చెందిన 55 కోట్ల మందికి ఆరోగ్య బీమా సౌకర్యం ఉంది. పరిమితి ఏడాదికి రూ.5 లక్షలు. ఈ పథకంలో ప్రజలు ఇప్పటిదాకా లక్ష కోట్ల రూపాయల లబ్ధి పొందారని, లబ్ధిదారుల్లో 49 శాతం మహిళలని కేంద్రం పేర్కొంది. ప్రపంచంలో ప్రభుత్వాలు అమలుచేసే ఆరోగ్య బీమా పథకాల్లో అతి పెద్దదిగా ఆయుష్మాన్ భారత్‌కు పేరుంది. ఈ పథకాన్ని 70 ఏళ్లు, ఆ పైబడిన వారి కోసం విస్తరిస్తామని ప్రధాని మోదీ ఏప్రిల్‌లో ప్రకటించారు. కాగా, కేంద్ర క్యాబినెట్ మరికొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకుంది. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన నాలుగో దశ అమలుకు పచ్చజెండా ఊపింది. రూ.70,125 కోట్లతో 62,500 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులను నిర్మించనున్నట్లు పేర్కొంది. ఈ మొత్తంలో కేంద్రం వాటా రూ.49,087 కోట్లు కాగా.. రాష్ట్రాలది రూ.21,037 కోట్లు. ఈ రహదారుల నిర్మాణంలో 25 వేల నివాస ప్రాంతాలు అనుసంధానం అవుతాయని తెలిపింది. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు ఉద్దేశించిన 'పీఎం ఈ-డ్రైవ్' పథకానికి ఆమోదం తెలిపింది. దీనికి రెండేళ్లలో రూ.10,900 కోట్లు ఖర్చు చేయనుంది. దేశవ్యాప్తంగా 88,500 చార్జింగ్ స్టేషన్లకు కేంద్రం తోడ్పాటు అందించనుంది. 31,350 మెగావాట్ల జల విద్యుత్ ప్రాజెక్టుల కోసం రూ. 12,461 కోట్ల కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వచ్చే ఎనిమిదేళ్లలో ఆయా ప్రాజెక్టుల అభివృద్ధికి ఈ నిధులు ఖర్చు చేస్తారు. వాతావరణ హెచ్చరిక వ్యవస్థ సామర్థ్యం పెంచేందుకు, ప్రకృతి విపత్తులను తట్టుకునేందుకు ఉద్దేశించిన 'మిషన్ మౌసమ్'కు కూడా క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ పథకానికి వచ్చే రెండేళ్లలో రూ.2 వేల కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించింది.


సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నివాసంలో బుధవారం నిర్వహించిన గణపతి పూజలో పాల్గొన్న ప్రధాని మోదీ

ఇక ఉత్పత్తిదారులు చెప్పిన ధరే!

- హోల్‌సేల్ ధరల ఇండెక్స్ స్థానంలో 'పీపీఐ'ని తెచ్చే యోచన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: దేశవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే వస్తువులు, పదార్థాల ధరలను టోకుగా(హోల్‌సేల్) నిర్ణయించే విధానాన్ని మార్పు చేయాలని కేంద్రం నిర్ణయించింది. 1970ల నుంచి అనుసరిస్తున్న హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్(డబ్ల్యూపీఐ) స్థానంలో ఉత్పత్తిదారుడు సూచించిన ధర.. ప్రొడ్యూసర్ ప్రైస్ ఇండెక్స్(పీపీఐ)ను విధానాన్ని తీసుకురానుంది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో ప్రస్తుతం పీపీఐ విధానం అమలవుతోంది. ఈ నేపథ్యంలో దేశంలోనూ దీనిని అమలులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. డబ్ల్యూపీఐ విధానంలో ప్రాథమిక అవసరాలకు సంబంధించిన 117 వస్తువులు, చమురు, విద్యుత్‌కు సంబంధించిన 16, తయారీ రంగానికి సంబంధించి 564 ఉత్పత్తులకు ధరలను నిర్ణయిస్తున్నారు.

జీఎస్టీ పరిధిలోకి పెట్రోల్, డీజిల్

- సాధ్యాసాధ్యాలపై వివరణ ఇవ్వండి: మద్రాస్ హైకోర్టు

చెన్నై, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలన్న అభ్యర్థనపై ఏం చెబుతారని కేంద్రప్రభుత్వాన్ని మద్రాస్ హైకోర్టు ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో సాధ్యాసాధ్యాలపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. పెట్రోల్, డీజిల్‌ను కూడా జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చి, దేశవ్యాప్తంగా ఒకే రకమైన ధరకు విక్రయించేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ సీనియర్ న్యాయవాది కనకరాజ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

వాడివేడిగా ప్రెసిడెన్షియల్ డిబేట్..
అదరగొట్టిన కమలా హ్యారిస్

- ప్రత్యర్థి డోనాల్డ్ ట్రంప్‌పై స్పష్టమైన ఆధిక్యం
- కమలను మార్క్సిస్ట్‌గా అభివర్ణించిన ట్రంప్
- ట్రంప్ నియంతలను ఆరాధిస్తారన్న కమల

వాషింగ్టన్, సెప్టెంబరు 11: అమెరికా అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న డోనాల్డ్ ట్రంప్, కమలా హ్యారిస్ మధ్య తొలి డిబేట్ వాడివేడిగా జరిగింది. ట్రంప్ కమలను మార్క్సిస్ట్‌గా అభివర్ణిస్తే.. కమల ట్రంప్‌ను నియంతలను ఆరాధించే వ్యక్తి అన్నారు! రష్యా-ఉక్రెయిన్ యుద్ధం అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు ట్రంప్ కమలను 'అసమర్థ సంధానకర్త (బ్యాడ్ నెగోషియేటర్)' అంటే.. 'పుతిన్ నిన్ను లంచ్‌లో నంచుకుతినేస్తాడు' అంటూ కమల తిప్పికొట్టారు. ఈ సంవాదంలో ట్రంప్‌పై స్పష్టమైన ఆధిక్యం సాధించారు. కాపిటోల్‌హిల్‌పై దాడి గురించి, ట్రంప్ పాత పాపాల గురించి అడిగి ఇరుకునపెట్టారు. కమల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ట్రంప్ ఒక దశలో ఆత్మరక్షణ ధోరణిలో పడిపోయారు. డిబేట్ మొదట్లోనే... ట్రంప్‌పై ఉన్న కేసుల గురించి కమలా హ్యారిస్ గట్టిగా ప్రస్తావించారు. పోర్న్‌స్టార్‌తో హష్ మనీ కేసులో సివిల్ కోర్టు శిక్ష విధించిన విషయాన్ని



గుర్తుచేశారు. చట్టపరమైన చిక్కుల్లో ఉన్న వ్యక్తి అమెరికా అధ్యక్ష పదవికి ఎంత మాత్రం అర్హుడు కారని వాదించారు. ఈ డిబేట్‌లో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చిన విధానపరమైన అంశాలు.. ఆర్థిక వ్యవస్థ, గర్భవిచ్ఛిత్తి హక్కులు, వలస విధానాలు, ఆరోగ్య సంరక్షణ. బైడెన్ పాలనలో అమెరికా ఆర్థిక వ్యవస్థ కుదేలైందని, యంత్రాంగం సరిగ్గా పనిచేయలేదని ట్రంప్ విమర్శించగా.. ట్రంప్ పాలనలో ధ్వంసమైన ఆర్థికవ్యవస్థ తమ చేతికి వచ్చిందని కమల తిప్పికొట్టారు. దేశంలో అక్రమ వలసదారుల సంఖ్య పెరిగిపోవడానికి కారణం కమలా హ్యారిసేనని.. అలా వస్తున్న వలసదారులు తినడానికి తిండి లేక ప్రజల పెంపుడుకుక్కల్ని తింటున్నారంటూ ఆన్‌లైన్‌లో వచ్చే వదంతులను ట్రంప్ ప్రస్తావించారు. ట్రంప్ పాలనలో ఇమిగ్రేషన్, విదేశీ విధానాలు, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో లోపాలను కమల ఎత్తిచూపారు. అబార్షన్ల హక్కుపైనా ట్రంప్‌ను నిలదీశారు. ఆయన అధ్యక్షుడైతే అబార్షన్ల నిషేధ చట్టంపై సంతకం చేస్తారన్నారు. అబార్షన్ల నిషేధానికి తాను అనుకూలం కాదని ట్రంప్ పేర్కొన్నారు.

యుద్ధాలపైనా..

ఇజ్రాయెల్-హమాస్, ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర, అఫ్గానిస్థాన్ నుంచి అమెరికా సేనల ఉపసంహరణ అంశాలపై ట్రంప్, హ్యారిస్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కమలాహ్యారిస్‌ను అసమర్థ సంధానకర్తగా అభివర్ణించిన ట్రంప్.. తాను గెలిస్తే అధ్యక్షుడిగా (2025 జనవరిలో) పగ్గాలు చేపట్టే సమయానికే ఈ యుద్ధాన్ని ఒక కొలిక్కి తెస్తానని చెప్పారు. అయితే.. ఈ యుద్ధం మొదలైనప్పుడు ట్రంప్ అధ్యక్షుడిగా ఉండి ఉంటే.. ఈ పాటికే పుతిన్ ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో తిష్టవేసి యూరప్‌పై దృష్టి సారించి ఉండేవారని కమల ఆందోళన వ్యక్తం చేశారు. కమల గెలిస్తే ఇజ్రాయెల్ ఉనికి లేకుండా చేస్తారని, ఆమె ఇజ్రాయెల్ ద్వేషి అని ట్రంప్ వ్యాఖ్యానించగా.. ఇజ్రాయెల్‌కు తనను తాను రక్షించుకునే హక్కుందని, అయితే ఈ యుద్ధం ముగియాలని తాము కోరుకుంటున్నామని కమల చెప్పారు. ట్రంప్ చైనాకు అమ్ముడుపోయారని, ఆయన నియంతలను ఆరాధిస్తారని, ఉత్తర కొరియా నియంత కిమ్‌జోంగ్ ఉన్‌కు ప్రేమలేఖలు రాశారని కమల అంటే.. చైనా, రష్యా, ఉత్తరకొరియా తనకు భయపడ్డాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ సంవాదంలో కమల అదరగొట్టారని అమెరికా మీడియా కితాబివ్వడం గమనార్హం! డిబేట్ 105 నిమిషాలపాటు జరిగింది. కాగా.. కమలకు, రిపబ్లికన్ల ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ భార్య ఉషకు.. ఇద్దరికీ భారతీయ మూలాలున్నా ఈ డిబేట్‌లో ఎక్కడా భారత్ గురించి ప్రస్తావన రాకపోవడం గమనార్హం.

హ్యావ్ ఫన్.. ట్రంప్ వ్యంగ్యం

డిబేట్ మొదలుపెట్టడానికి ముందు కమలాహ్యారిస్ ట్రంప్‌తో కరచాలనం చేశారు. ఆ సమయంలో ఆమె తన పేరు చెప్పగా.. 'నైస్ టు సీ యూ.. హ్యావ్ ఫన్' అంటూ ట్రంప్ వ్యంగ్యంగా బదులిచ్చారు. 2016 తర్వాత ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో అధ్యక్ష అభ్యర్థులు షేక్‌హ్యాండ్ ఇచ్చుకోవడం ఇదే మొదటిసారి అని అమెరికన్ మీడియా తెలిపింది.

శభాష్ కమలా..

డిబేట్ తర్వాత అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్ స్పందించారు. కమలా హ్యారిస్ అమెరికాకు అధ్యక్షురాలు కావడం తథ్యమని వారు అభిప్రాయపడ్డారు. డిబేట్‌లో ఆమె అద్భుతంగా మాట్లాడారని కితాబిచ్చారు. కమల తన విజన్‌ను స్పష్టంగా చెప్పగలిగారని కొనియాడారు. జోబైడెన్ కూడా.. అమెరికాకు కమలా హ్యారిస్ ఒక గొప్ప అవకాశమంటూ ట్వీట్ చేశారు. పాప్ స్టార్ టేలర్ స్విఫ్ట్ కూడా కమలకు మద్దతు ప్రకటించారు.

చెవి పోగులేనా?

ఈ డిబేట్‌లో కమలా హ్యారిస్ ధరించిన చెవి పోగులపై సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. డిబేట్ ముగిసిన అనంతరం.. అచ్చం ఆమె ధరించిన చెవి పోగుల్లాంటి ఇయర్‌ఫోన్లనే ఒక టెక్ ఆర్టికల్‌లో చూశానంటూ 'ఎక్స్'లో ఒక వ్యక్తి ట్వీట్ చేశాడు. అది వైరల్ అయ్యింది. మరికొందరు కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

1,284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు నోటిఫికేషన్

» 21 నుంచి అక్టోబరు 5 వరకు దరఖాస్తులు
» నవంబరు 10న సీబీటీ పద్ధతిలో పరీక్ష
» కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వారికి వెయిటేజ్
» ప్రజారోగ్య సంచాలకుల విభాగంలో అత్యధికంగా 1,088 పోస్టులు

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సర్కారు ఇటీవల ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో భాగంగా తొలి నోటిఫికేషన్ వెలువడింది. వైద్యాశాఖలో వివిధ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న 1,284 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 21 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని.. అక్టోబరు 5న సాయంత్రం 5 గంటలతో గడువు ముగుస్తుందని బోర్డు కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి వెల్లడించారు. దరఖాస్తుల్లో ఏమైనా పొరపాట్లు ఉంటే అక్టోబరు 5 నుంచి 7వ తేదీ మధ్య ఎడిట్ చేసుకోవచ్చన్నారు. నవంబరు 10న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఇంగ్లిషులోనే పేపర్ ఉంటుందని.. అభ్యర్థులు ఎక్కువగా ఉంటే రెండు, మూడు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వారికి వెయిటేజ్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిజేసే వారికి వెయిటేజ్ మార్కులు కల్పించినట్లు నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. ఇందుకు సర్కారీ దవాఖానాల్లో పనిచేసిన అనుభవమున్నట్లు ధ్రువ పత్రాన్ని జత చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే అభ్యర్థులు తెలంగాణ పారామెడికల్ బోర్డులో తమ విద్యార్హత ధ్రువపత్రాలను రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి. ఇక అభ్యర్థులు ఈ ఏడాది జూలై 1 నాటికి 46 ఏళ్లకు మించి ఉండకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు.. దివ్యాంగులకు పదేళ్ల వయోపరిమితి సడలింపునిచ్చారు. పోస్టుల్లో 95 శాతం స్థానికులకేనని.. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు తెలంగాణలో చదివిన వారే స్థానికులని వివరించారు. ఒకవేళ ఒకటి నుంచి ఏడు వరకు ఇక్కడ చదవకుంటే... తెలంగాణ స్థానికతపై ప్రభుత్వం జారీ చేసే ధృవపత్రాలను అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు www.mhsrb.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

విభాగాలు, జోన్ల వారీగా పోస్టులు..

మొత్తం 1,284 పోస్టుల్లో 1,088 ప్రజారోగ్య సంచాలకుల విభాగంలో, 183 తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో, మరో 13 హైదరాబాద్ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో ఉన్నాయి. జోన్-1లో 218, జోన్-2లో 135, మూడులో 173, నాలుగులో 191, ఐదులో 149, ఆరులో 220, ఏడో జోన్‌లో 185 పోస్టులున్నాయని మెడికల్ బోర్డు తెలిపింది.

ఆరుగురు అధికారుల వాంగ్మూలాల నమోదు

» హైడ్రా కమిషనర్ ఫిర్యాదుతో అక్రమార్కులకు కొమ్ముకాసిన వారిని విచారించిన పోలీసులు
» త్వరలో సైబరాబాద్ సీపీకి విచారణ నివేదిక
» ఆపై ఆ అధికారులపై న్యాయపరమైన చర్యలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చిన అధికారులపై చర్యలకు ఉన్నతాధికారులు సిద్ధమైనట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన బిల్డర్లు, అక్రమార్కులకు కొమ్ముకాసిన రెవెన్యూ, మునిసిపల్, హెచ్‌ఎండీఏ అధికారులపై న్యాయపరమైన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ఇటీవల హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు అక్రమార్కుల చిట్టా బయటకు తీస్తున్నారు. వారిని విచారించి సమగ్ర సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. నిజాంపేట మునిసిపల్ కమిషనర్ రామకృష్ణ, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుధాన్ష్, బాచుపల్లి ఎమ్మార్వో పూల్‌సింగ్, ల్యాండ్స్ అండ్ రికార్డ్స్ అసిస్టెంట్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సుధీర్‌కుమార్, సిటీ ప్లానింగ్ ఆఫీసర్ రాజ్‌కుమార్‌లపై సైబరాబాద్ పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి ఆదేశాలతో ఈవోడబ్ల్యూ డీసీపీ ప్రసాద్ పర్యవేక్షణలో రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు.. ఆయా శాఖల అధికారులను విచారించి, వాంగ్మూలాలు నమోదు చేసినట్లు తెలిసింది. ఒక్కో అధికారిని విడతలవారీగా విచారించారు. అక్రమార్కులతో వారికున్న సంబంధాలు, వారిచ్చిన అక్రమ అనుమతులపై విచారించి, సమగ్ర వివరాలు రాబట్టినట్లు సమాచారం. రెవెన్యూ, ఇరిగేషన్, మునిసిపల్, హెచ్‌ఎండీఏ అధికారుల అక్రమాలు, అందుకు ప్రోత్సహించిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరు? తదితర అంశాలతో త్వరలోనే సీపీకి పూర్తిస్థాయి నివేదికను అందజేయడానికి ఈవోడబ్ల్యూ పోలీసులు కసరత్తు చేస్తున్నారు. నివేదిక అందిన తర్వాత.. అక్రమాలకు పాల్పడిన అధికారులపై న్యాయపరంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది.

262 నిర్మాణాల కూల్చివేత

111 ఎకరాల స్వాధీనం!.. ఆక్రమణల తొలగింపుపై ప్రభుత్వానికి హైడ్రా నివేదిక

» అమీన్‌పూర్ పెద్దచెరువులో అత్యధికంగా 51.78 ఎకరాలు స్వాధీనం
» వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆక్రమణల తొలగింపు
» సున్నం చెరువులో 10 ఎకరాల్లోని 42 నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం(ఫైల్)

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చెరువులను చెరబట్టిన వారిపై 'హైదరాబాద్ విపత్తుల నిర్వహణ, ఆస్తుల రక్షణ సంస్థ (హైడ్రా)' ప్రత్యేకంగా దృష్టి సారించింది. చెరువులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో దూకుడుగా వ్యవహరిస్తోంది. ఆక్రమణల తొలగింపు, స్థలాల స్వాధీనమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. రెండున్నర నెలల వ్యవధిలో పలు ప్రాంతాల్లోని చెరువులు, పార్కుల్లో 262 నిర్మాణాలను నేలమట్టం చేసింది. 111.72 ఎకరాల స్థలం స్వాధీనం చేసుకుంది. ఈ మేరకు హైడ్రా బుధవారం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. జూన్ 27 నుంచి సెప్టెంబరు 8 వరకు చెరువులు, పార్కులు, రోడ్లపై ఆక్రమణలను తొలగించారు. తాజాగా అమీన్‌పూర్‌లోని పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న ఏపీలోని పాణ్యం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి చెందిన ఆక్రమణలను తొలగించివేశారు. 51.78 ఎకరాల స్థలంలో లే అవుట్ అభివృద్ధి, చిన్న గదులు, ఇతరత్రా 24 నిర్మాణాలను 24 కూల్చివేశారు. సున్నం చెరువులో 40 షెడ్లు, రెండు ఆర్‌సీసీ నిర్మాణాలు, గ్రౌండ్ ప్లస్ నాలుగంతస్తుల భవనం 1, గ్రౌండ్ ప్లస్ మూడంతస్తుల భవనాలు రెండింటిని నేలమట్టం చేశారు. ఆయా నిర్మాణాలు 10 ఎకరాల స్థలంలో విస్తరించి ఉన్నాయి. మల్లంపేటలోని కత్వ చెరువులో 2.50 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన 13 విల్లాలు కూల్చారు. మరో ఐదు నిర్మాణాల కూల్చివేతపై ఉన్నత స్థాయిలో అధికారులు చర్చలు జరుపుతున్నారు. అంతకుముందు రాజేంద్రనగర్ అప్పా చెరువులో 14 భారీ షెడ్లను నేలమట్టం చేసి 3.2 ఎకరాల స్థలం స్వాధీనం చేసుకున్నారు. తుమ్మిడికుంటలో సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను గత నెలలో కూల్చిన విషయం తెలిసిందే. గండిపేట, రాజేంద్రనగర్ బుమ్‌రుఖ్ దౌల, ఈర్ల, ఎర్రకుంట, చింతల్ చెరువు తదితర ప్రాంతాల్లోనూ ఆక్రమణలు తొలగించారు. అత్యధికంగా చింతల్ చెరువులో 54, బుమ్‌రుఖ్ దౌల చెరువులో 45 అక్రమ నిర్మాణాలు నేలమట్టం చేశారు. గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణలు తొలగించినట్టు హైడ్రా పేర్కొంది.

ఎత్తు పరిశీలించి.. ఆక్రమణలు గుర్తించి..

చెరువుల్లో ఆక్రమణల గుర్తింపునకు భిన్న అంశాలను హైడ్రా పరిశీలిస్తోంది. శాటిలైట్ చిత్రాల ద్వారా చెరువుల కబ్జాలను ప్రాథమికంగా గుర్తిస్తున్న సంస్థ.. అవి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయా? లేదా? అన్నది తెలుసుకునే ప్రయత్నం చేస్తోంది. ఇందుకోసం బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్.. షాద్‌నగర్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్ఏ)కి వెళ్లారు. 20 ఏళ్ల క్రితం చెరువు, పరిసర ప్రాంతాలు ఎంత ఎత్తులో ఉండేవి? ప్రస్తుతం ఎంత ఎత్తు ఉందన్నది తెలిసేలా వివరాలు ఇవ్వాలని కోరారు. చాలా ప్రాంతాల్లో చెరువుల్లో మట్టి పోసి చదును చేస్తున్న కబ్జాదారులు అనంతరం నిర్మాణాలు చేపడుతున్నారు. గండిపేట, ఎర్రకుంట, ఈర్ల చెరువుల్లో నిర్మాణాల విషయంలో అదే జరిగింది. సాధారణం కంటే ఎనిమిది నుంచి 15 అడుగుల మేర ఎత్తు పెంచి నిర్మాణాలు చేపట్టారు. ఎక్కువ ఎత్తులో ఉన్నందున ఆ నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి రావన్నది వారి వాదన. ఇలాంటి వారికి చెక్ పెట్టేలా చెరువుల అడుగు భాగం ఎంత ఎత్తులో ఉండేది? ఇప్పుడు ఎంత ఉందన్నది తెలుసుకోనున్నారు. దీని ద్వారా చెరువుల్లో పూడికతీసి, విపత్తుల నిర్వహణ చర్యలూ చేపట్టవచ్చని రంగనాథ్ తెలిపారు.

గణపతి నవరాత్రుల నేపథ్యంలో..

మరో దఫా కూల్చివేతలకు హైడ్రా రంగం సిద్ధం చేసింది. పలు చెరువుల్లో ఆక్రమణలపై నిర్ధారణకు వచ్చినా గణేశ్ నవరాత్రుల నేపథ్యంలో కాస్త స్పీడు తగ్గించారు. పోలీసులు బందోబస్తులో ఉన్నందున అవసరమైన మేర సిబ్బంది అందుబాటులో ఉంటారా? లేదా? అన్నది తెలుసుకుంటున్నారు. ఈ విషయంపై పోలీస్ అధికారులతో మాట్లాడుతున్నట్లు హైడ్రా వర్గాలు తెలిపాయి. సిబ్బంది అందుబాటులో ఉంటే వారాంతంలో కూల్చివేతలు ఉండే అవకాశం ఉంది. లేకపోతే నిమజ్జనాలు ముగిసిన తర్వాత ఆక్రమణలను తొలగించనున్నారు.

తేలియాడే డబుల్ ఇళ్లు!

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా బఫర్‌జోన్‌లో! తుర్కయంజాల్ మాసబ్ చెరువు అలుగు పోస్తే.. ఆ ప్రవాహం 30 ఫీట్ల వెడల్పు గల నాలా గుండా ఇంజాపూర్‌లోని దిలావర్ ఖాన్ చెరువులోకి వస్తుంది. ఆ నాలాకు అటూ ఇటూ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టారు. పిల్లర్లు, స్లాబులు, గోడలతో కొన్ని బ్లాకులు 70శాతం మేర పూర్తయితే.. ఇంకొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. 2016-2017లో పనులు మొదలైతే ప్రతి వర్షాకాలంలోనూ ఇలా బ్లాకుల చుట్టూ నీళ్లు చేరుతున్నాయి. ఇంజాపూర్‌లోని దిలావర్‌ఖాన్ చెరువు బఫర్‌జోన్ సర్వేనంబరు 126లో దాదాపు 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.100 కోట్ల అంచనా వ్యయంతో జీ ప్లస్ 9తో 1296 కుటుంబాలు ఉండేందుకు 12 బ్లాకులు నిర్మించడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటి వరకు 6 బ్లాకుల నిర్మాణాలు పూర్తి చేశారు. వీటికి ప్లాస్టరింగు జరగాల్సి ఉంది. అవి కాకుండా మరో రెండు బ్లాకుల నిర్మాణ పనులు సగం వరకు చేరుకున్నాయి.


డబల్ బెడ్ రూమ్ సెల్లార్లలో నిలిచిన నీరు

మరో 4 బ్లాకులు సెల్లార్ల దశకే పరిమితమయ్యాయి. భారీ వర్షాలకు మాసబ్ చెరువు నిండి అలుగు పోయడంతో ఆ ప్రవాహానికి దిలావర్‌ఖాన్ చెరువు నిండి బ్యాక్ వాటర్ మొత్తం డబల్ బెడ్ రూమ్ ఇళ్లలోకి చేరుకుంది. ఇళ్ల నిర్మాణ సమయంలో పక్క నుంచి కాలువ తీశారు. అయినా భారీగా వచ్చే అలుగు నీటితో డబల్ బెడ్ రూమ్ ఇళ్లు వరదతో మునిగిపోయాయి. పిల్లర్ పునాదులకు వేసిన ఇనుప చువ్వలు ఎనిమిదేళ్లుగా నీళ్లలోనే ఉన్నాయి. నిర్మాణ దశ నుంచి కాంట్రాక్టర్ మోటర్ల ద్వారా నీటిని బయటకు తోడి పనులు చేశారు. ఎంత తోడినా మళ్లీ మళ్లీ వరద వస్తుండటంతో ఆ కాంట్రాక్టర్ తుదకు చేతులెత్తేశాడు. ఏడాది క్రితమే పనులు నిలిపివేశాడు. ఎనిమిదేళ్లుగా నీళ్లు చేరి ఉండటంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది.

ఇరిగేషన్ ఎన్‌వోసీ లేకుండానే...

ఇంజాపూర్ దిలావర్‌ఖాన్ చెరువు పరీవాహక ప్రాంతంలో నిర్మించిన డబల్ బెడ్ రూం ఇళ్లకు ఏలాంటి ఎన్‌వోసీ తీసుకోకుండానే ఆగమేఘాలపై పనులు ప్రారంభించారు. చెరువు పరీవాహక ప్రాంతంలో నిర్మిస్తున్న డబల్ బెడ్ రూం ఇళ్లకు ఇరిగేషన్ శాఖ నుంచి ఎన్‌వోసీ ఉందా? అని ఇంజాపూర్ గ్రామానికి చెందిన బొక్క వంశీధర్‌రెడ్డి 2021లో ఇబ్రహీంపట్నం ఇరిగేషన్ డీఈఈని సమాచార హక్కు చట్టం కింద ప్రశ్నించారు. దీనికి డీఈఈ... తాము ఏలాంటి ఎన్‌వోసీ ఇవ్వలేదని, తమను ఎవరూ సంప్రదించలేదని లిఖితపూర్వకంగా ఇచ్చారు.

హైకోర్టునే తేల్చనివ్వండి

» నందగిరి హిల్స్‌లో అక్రమ నిర్మాణంపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి వ్యాఖ్య

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నందగిరి హిల్స్‌లో నెట్ నెట్ వెంచర్స్ అక్రమంగా చేపట్టిన నిర్మాణంపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి విచారణ చేపట్టారు. కమిషనర్ కార్యాలయంలో బుధవారం జరిగిన విచారణలో ఈ విషయాన్ని హైకోర్టునే తేల్చనిద్దామని ఆమె వ్యాఖ్యానించారు. 'అక్రమ హర్మ్యం' పేరుతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం కథనం ప్రచురితమైంది. నెట్ నెట్ వెంచర్స్ సంస్థ.. నందగిరి హిల్స్‌లో 865.42 గజాల జూబ్లీహిల్స్ సొసైటీ స్థలాన్ని కొనుగోలు చేసింది. జూబ్లీహిల్స్ సొసైటీ భూమిని సాకుగా చూపుతూ ఏకంగా 20 అంతస్థులకు అనుమతి తెచ్చుకొని 2,09,000 చదరపు అడుగుల కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. విచారించిన అధికారులు.. జీహెచ్‌ఎంసీ అధికారులపై చర్య తీసుకోవాలని, బిల్డర్‌పై క్రిమినల్ కేసు పెట్టాలని సిఫారసు చేశారు. ఈ నివేదికను అమలు చేయాలంటూ నందగిరి హిల్స్ సొసైటీ హైకోర్టుకు వెళ్లింది. ఈ నేపథ్యంలో బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ వద్ద వాదనలు జరగ్గా.. ఈ విషయాన్ని హైకోర్టునే తేల్చనిద్దామని ఆమ్రపాలి అన్నారు.


శంకర్, రుక్మింబాయి(ఫైల్)


అనమయ్య, సుందరమ్మ(ఫైల్)

మృత్యువులోనూ వీడని బంధం

» భార్య మరణ వార్త విని ఆగిన భర్త గుండె
» తమ్ముడి మరణాన్ని తట్టుకోలేక అక్క మృతి

లింగాలఘణపురం, బోనకల్, సెప్టెంబరు 11 : డెబ్బై ఏళ్ల వైవాహిక బంధం ఒకరిది.. 56 ఏళ్ల రక్తసంబంధం మరొకరిది.. మృత్యువు కూడా వాళ్ల బంధాన్ని విడదీయలేకపోయింది. భార్య మరణవార్త విని భర్త గుండె ఆగిపోగా... మరో ఘటనలో తమ్ముడి మృతిని తట్టుకోలేక అతని అక్క గుండె పగిలిపోయింది. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం ఈ విషాదకర ఘటనలు జరిగాయి. ఖమ్మం జిల్లా బోనకల్‌కు చెందిన నందమూరి అనమయ్య(90), సుందరమ్మ(84)కు 70 ఏళ్ల క్రితం వివాహమైంది. వ్యవసాయంపై ఆధారపడిన ఈ దంపతులు తమ కుమారుడు, ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసి బాధ్యతలు తీర్చుకున్నారు. ఇటీవల అస్వస్థతకు గురైన ఈ దంపతులు కొద్ది రోజులుగా ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో సుందరమ్మ బుధవారం ఉదయం మరణించారు. కొన్ని గంటల తర్వాత తల్లి మరణవార్తను కుమార్తె తన తండ్రి అనమయ్యకు చెప్పింది. ఈ వార్త వినగానే అనమయ్య గుండె ఆగి మరణించారు. గంటల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోవడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. మరో ఘటనలో... జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్లకు చెందిన గాడిపెల్లి శంకర్(56) నాలుగేళ్ల క్రితం పక్షవాతానికి గురవ్వగా ఆరోగ్యం క్రమంగా క్షీణించి బుధవారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న శంకర్ అక్క, అదేగ్రామానికి చెందిన కుడికాల రుక్మింబాయి (58) సోదరుడి ఇంటికి చేరుకుంది. శంకర్ మృతదేహంపై బోరున విలపిస్తూ అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబసభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణం విడిచింది. ఒకరి తర్వాత మరొకరుగా అక్కాతమ్ముళ్లు మరణించడంతో ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. శంకర్‌కు భార్య లలిత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇక రుక్మింబాయి భర్త పదేళ్ల క్రితం మృతిచెందగా ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు.

యాచారంలో భూ సమస్యలపై పైలట్ ప్రాజెక్టు

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో పైలట్ ప్రాజెక్టును చేపట్టిన లీఫ్స్ స్వచ్ఛంద సంస్థ.. నివేదికను రెవెన్యూ అధికారులకు సమర్పించింది. మండలంలోని 10 గ్రామాల్లో ఆ సంస్థ ప్రతినిధులు సర్వే చేశారు. 2,114 మందికి సంబంధించిన 4,465 సర్వే సబ్ డివిజన్లలో భూ సమస్యలను గుర్తించారు. తొలి దశలో ప్రతి గ్రామంలో భూ న్యాయ శిబిరాలు నిర్వహించి, రెండో దశలో సమస్యలున్న వ్యక్తి దగ్గర ఉన్న పత్రాలు, రెవెన్యూ రికార్డులను పరిశీలించి.. పూర్తి స్థాయి నివేదికను రూపొందించారు. సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలు, అవలంబించిన విధానాలతో రూపొందించిన నివేదికను బుధవారం ఆ సంస్థ అందజేసింది.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

సముచిత నిర్ణయం

తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయానికి చిట్యాల (చాకలి) ఐలమ్మ పేరు పెట్టాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం స్వాగతించదగింది. దొరల అరాచకాలకు ఎదురొడ్డి నిలచిన ఈ వీర వనిత పోరాటస్ఫూర్తి భవిష్యత్ తరాలకు గుర్తుండేలా హైదరాబాద్ కోఠీలోని విశ్వవిద్యాలయానికి ఆమె పేరు పెడుతున్నామని రేవంత్ ప్రకటించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేదలకు భూహక్కులు కల్పించడం, పీవీ నరసింహారావు చేపట్టిన భూ సంస్కరణలు లక్షలాదిమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, నిరుపేదలకు మేలు చేకూర్చాయని, ఆ నిర్ణయాల వెనుక ఐలమ్మ భూ పోరాటం స్ఫూర్తి ఉన్నదని అన్నారు రేవంత్. విశ్వవిద్యాలయానికి ఐలమ్మ పేరుపెట్టడంతోపాటు, ఆమె మనుమరాలు శ్వేతను రాష్ట్ర మహిళాకమిషన్ సభ్యురాలిగా నియమిస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. బడుగులకు, వృత్తి కులాలకు గుర్తింపునూ, గౌరవాన్ని కల్పించే సముచిత నిర్ణయాలివి.

రవీంద్రభారతిలో ఐలమ్మ 39వ వర్ధంతి కార్యక్రమంలో అప్పటికప్పుడు చేసిన ప్రకటనగా కనిపించినప్పటికీ, మహిళా యూనివర్సిటీకీ ఈ వీరవనిత పేరుపెట్టాలన్న నిర్ణయం వెనుక పాలకుల మదిలో ఏదో వ్యూహం, వెనుక మేధోమథనం ఉండకపోదు. ప్రొఫెసర్ కంచ ఐలయ్య ఈ పేరును సూచించారంటూ రేవంత్ చెప్పడం ఉదాత్తంగా ఉంది. అధికారంలోకి రాగానే ప్రజా భవన్‌కు జ్యోతీబా పూలే పేరుపెట్టడాన్ని రేవంత్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ పేరుపెట్టడం వరకూ తన ప్రభుత్వం తెలంగాణ కోసం పోరాడిన మహనీయులను ఏ విధంగా స్మరించుకుంటున్నదో కూడా ఆయన వివరించారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణకు ఏర్పడిన హైడ్రా దూకుడుగా తనపనిచేసుకుపోతున్న నేపథ్యంలో, భూముల ఆక్రమణలను అడ్డుకోవడంలోనూ ఐలమ్మ తమకు స్ఫూర్తిగా నిలిచిందని ముఖ్యమంత్రి చెప్పుకున్నారు. ఇటీవల దివంగతులైన వడ్డేపల్లి కృష్ణ ఐలమ్మమీద రచించిన నృత్యరూపకాన్ని ఈ సందర్భంగా తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు అలేఖ్య పుంజాల బృందం ప్రదర్శించడం సముచితంగా, శోభస్కరంగా ఉంది.

ఐలమ్మ వర్ధంతి సందర్భంగా తీసుకున్న నిర్ణయమే అయినప్పటికీ, తెలంగాణ సాయుధపోరాట వారోత్సవాల నేపథ్యంలోనూ ఇది మరింత సరైన నిర్ణయం. దొరల అరాచకాలకు ఎదురొడ్డి నిలిచిన ఐలమ్మ తెలంగాణ సాయుధపోరాటానికి ఆది, పునాది. భూమికోసం, భుక్తికోసం, వెట్టినుంచి విముక్తికోసం సాగిన ఆ సుదీర్ఘ పోరాటానికి ఆమె భూసమస్యే వేదికైంది. విస్నూర్ దేశ్‌ముఖ్ మీద ఆమె తిరుగుబాటు, దొర గూండాలు, రజాకార్లతో నిత్య ఘర్షణలు ఒక నిరంతర స్ఫూర్తి. ఒక చిన్న తిరుగుబాటుగా మొదలై, రైతాంగపోరాటంగా మారి నిరుపేదలకు పదిలక్షల ఎకరాల భూపంపిణీకి వీలుకల్పించింది, సమాజంలో అట్టడుగువర్గాలకు, అంటరాని కులాలకు పీడననుంచి విముక్తి దక్కింది. ఆధిపత్యపెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా ఆమె చేసిన ఆత్మగౌరవపోరాటం బడుగులకు కొండంత శక్తినిచ్చింది. దొర అకృత్యాలకు తన కుటుంబం చిన్నాభిన్నమైపోయినా, ఆత్మవిశ్వాసమే ఆయుధంగా భూపోరాటాలకు దారిచూపింది ఆమె. ప్రజాపోరాటాలకు స్ఫూర్తిగా, మహిళాశక్తికీ, చైతన్యానికీ ప్రతీకగా నిలిచిన ఆ యోధురాలి పేరును మహిళావిశ్వవిద్యాలయానికి పెట్టడం సముచితంగా ఉంటుందని ప్రభుత్వం భావించింది. ఆమె ధైర్యం, తెగువ, ప్రతిఘటనాతత్వం మహిళలు, విద్యార్థినులకు ఎల్లవేళలా స్ఫూర్తినివ్వాలన్నది పాలకుల అభీష్టం కావచ్చు. తెలంగాణకు సంబంధించిన చిహ్నాలు, గుర్తింపుల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఒక పోటీ నడుస్తోంది. పాటలు, స్థలాలు, విగ్రహాలు ఇత్యాది అంశాల్లో ఇరుపక్షాల మధ్యా సాగుతున్నదేమిటో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. గత బీఆర్ఎస్ పాలనలో వెనుకపట్టుపట్టిన లేదా గుర్తింపునకు నోచుకోని అంశాలను ముందుకు తీసుకురావడం, తన ప్రత్యేకతను నిలబెట్టుకోవడం లక్ష్యంగా రేవంత్ అడుగులు, నిర్ణయాలు ఉన్నాయి.

అవధులు లేని అసమానతలు

దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆర్థిక అసమానతలు, అంతరాలు పెరుగుతున్నాయి. కార్పొరేట్ సంస్థల యజమానులు వేల కోట్ల రూపాయల ఖర్చుతో వివాహాది శుభకార్యాలు, సంబరాలు విదేశాల్లో నిర్వహిస్తున్నారు. దేశంలో ప్రతి సంవత్సరం బిలియనీర్ల, కుబేరుల సంఖ్య శరవేగంగా పెరుగుతున్నది.

మన ఆర్థిక వ్యవస్థను సంపూర్ణంగా కార్పొరేటీకరణ చేయడమే ప్రధాన లక్ష్యంగా అభివృద్ధి సాగుతున్నదనేది నిర్వివాదాంశం. కేంద్ర ప్రభుత్వం కార్మికుల వేతనాల నియంత్రణ, కుదింపు, పని గంటల పెంపునకు సహకరిస్తూ, కార్పొరేట్ సంస్థల లాభాలపై పన్ను శాతం తగ్గిస్తూ ప్రతి సంవత్సరం వారి లాభాలను పెంచుతున్నది. లాభాల వెల్లువను, పెట్టుబడులను, ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యవస్థను సంపూర్ణంగా కార్పొరేటీకరించడం జరుగుతోంది.

కేంద్ర ప్రభుత్వ సంస్థలలో 30 లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ కాకుండా ఉన్నాయి. దేశంలో ఒక పక్క పెచ్చరిల్లుతున్న నిరుద్యోగ సమస్య, మరో పక్క నిరంతరం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను గమనిస్తే ఆర్థిక వ్యవస్థలో పరస్పర వైరుధ్యాలు కలిగిన పరిస్థితులు ఎంతగా ఉన్నాయో అర్థమవుతుంది. ఆర్థిక వృద్ధిరేటు ఆరు శాతం, ఉపాధి–ఉద్యోగిత రేటు కేవలం రెండు శాతం మాత్రమే నమోదు అవుతున్న ఆర్థిక విధానంలో, దాదాపు ఉపాధి లేని అభివృద్ధి జరుగుతున్నదని ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ ఆర్థికవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఈ తిరోగమన ఆర్థిక విధానాల పుణ్యమా అని మధ్య, దిగువ స్థాయి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతున్న విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పెట్రోల్, డీజిల్ పన్నులు, జీఎస్టీ పన్నుల భారం మధ్య, దిగువ తరగతి ప్రజలపై అధికంగా విధించడం వల్ల సగటు వినియోగదారుని నికర ఆదాయం కుదించుకుపోతోంది. నిత్యం పెరుగుతున్న ధరలతో అసంఘటిత, అనియత రంగంలోని ఉద్యోగుల, కార్మికుల వాస్తవ వేతనాలు రోజురోజుకూ కరిగిపోతున్నాయి.

ఎదుగుతున్న కోట్లాది విద్యావంతులైన యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించే ప్రయత్నంలో జి–20 దేశాలలో భారత్ వెనుకబడి ఉందని ఇటీవల ప్రపంచ బ్యాంకు అధికారి గోపీనాథ్ గుర్తుచేశారు. పేదలకు, ధనవంతులకు మధ్య సాపేక్ష పేదరికం మరింత పెరుగుతున్నది. డెబ్బై ఏడు సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా 80 కోట్ల మంది ప్రజలకు ఉచిత బియ్యం పంపిణీ జరుగుతున్నది. ఆర్థికాభివృద్ధి ఫలితాలు కార్పొరేట్ సంస్థలకు, పేద వర్గాలకు ఉచితాలు పంపిణీ చేసి పాలకులు చేతులు దులుపుకుంటున్నారు.

51 కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ రూ.100 నుండి రూ.150 దినసరి ఆదాయంతో బతుకుతున్నారు. నివాసయోగ్యమైన గృహ సదుపాయం లేక ఆదివాసులు, గిరిజనులు, ఇతర పేదలు కోట్లాదిగా నిరాశ, నిస్పృహలకు గురి అవుతున్నారు. విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ రంగాల ద్వారా ప్రజల సమగ్ర అభివృద్ధికి కావలసిన ఆర్థిక విధానాలు అమలు చేయాలి. దేశ సంపదలో ప్రజలందరికీ భాగస్వామ్యం లభించాలి.

18వ లోక్‌సభలో 400 సీట్లు ఇవ్వండని అడిగినా, ప్రజలు కేవలం 240 సీట్లు ఇచ్చి కేంద్ర ప్రభుత్వ దూకుడుకు కళ్లెం వేశారు. ఇకనైనా ప్రజల ఎజెండాను పాలకులు గుర్తించడం ఎంతైనా అవసరం. మెజారిటీ ప్రజలకు అవసరమైన ఆర్థిక, సామాజిక అభివృద్ధి విధానాలను రూపొందించాలి. పెడివాదపు ఆర్థిక విధానాలను విడనాడి ప్రజలకు ఉపాధి, ఉద్యోగ, ఆదాయాలను కల్పించి నిరుద్యోగిత, ద్రవ్యోల్బణం నుండి రక్షించవలసిన అవసరాన్ని గుర్తించాలి. యువతలో పెరుగుతున్న అశాంతి, అభద్రతాభావాన్ని తొలగించాలి. వెనిజులా, శ్రీలంక, బంగ్లాదేశ్ మొదలైన దేశాలలో యువతలో పెల్లుబికిన అశాంతి, జరిగిన పరిణామాలు రాజకీయ వ్యవస్థలనే సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. మన దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న నిరుద్యోగ సమస్య, సాపేక్ష పేదరికం, ఆర్థిక అసమానతల అంతరాలను తగ్గించడానికి తగిన ఆర్థిక, రాజకీయ, సామాజిక సంస్కరణలు ఆదాయ పంపిణీ విధానాలను ప్రవేశపెట్టి అభివృద్ధిలో అన్ని వర్గాల ప్రజలకు తగిన భాగస్వామ్యం కల్పించినప్పుడే ప్రజాస్వామ్యం అర్థవంతమవుతుందని భావించాలి.

– ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

వీళ్లు నీతులు మాట్లాడినప్పుడు నవ్వులే నవ్వులు!



ఎవరికీ అక్కరలేని ఒక ప్రజాస్వామిక, రాజ్యాంగ విలువ కోసం న్యాయస్థానం చొరవ చూపింది. తక్షణ రాజకీయ ప్రయోజనం కోసం ఆ చొరవను శ్లాఘించేవారే తప్ప, దాన్ని మనసా వాచా ఇష్టపడేవారు లేరు. నువ్వు అధికారంలో ఉన్న కాలంలో ఏమిచేశావు అని ఎదురు ప్రశ్నించడమే తప్ప, కాంగ్రెస్ పార్టీ వద్ద మరో సమాధానం లేదు. పైగా, కోర్టు తీర్పులో దాగిన ఒక ప్రజాస్వామిక సూత్రం మీద కనీస గౌరవం కూడా ఆ పార్టీ చూపించలేదు. చూపించి ఉంటే, కోర్టు నిర్ణయం చెప్పిన రోజునే, పీఏసీ చైర్మన్‌గా ఒక ఫిరాయింపు శాసనసభ్యుడిని నియమిస్తుందా? పైకి, ఇది ప్రతిపక్ష పార్టీకి విసిరిన సవాల్‌గా కనిపిస్తుంది కానీ, వాస్తవంలో అది ఒకరకమైన కోర్టు ధిక్కారమే కదా?

నిజమో కాదో కానీ, శ్రీనాథుడికి ఆపాదించి చెబుతారీ కథ. ఒక రాజుని కలవడానికి వెళ్లినప్పుడు, అసూయపడిన ఆస్థానపండితులు అతన్ని దెబ్బతీయాలని ఒక సమస్య ఇచ్చి పద్యంలో పూరించమన్నారట. "అందఱు నందఱే మఱియు నందఱు నందఱె యంద ఱందఱే" అన్నది సమస్య, ఆ సభికుల మీదనే పద్యం చెప్పాలి. అప్పుడా కవిగారు "కొందఱు భైరవాశ్వములు, కొందఱు పార్థుని తేరి టెక్కెముల్, కొందఱు ప్రాక్కిటీశ్వరులు, కొందఱు కాలుని యెక్కిరింతలున్, కొందఱు కృష్ణ జన్మమునం గూసిన ధన్యులు నీ సదస్సులో నందరు నందరే మరియు..." అని పద్యం చెప్పారట. దానితో చిన్నబుచ్చాలనుకున్నవారే చిన్నబోయారట. ఇంతకీ, అందరూ అందరే అయిన ఆ సభికులను ఏమని వర్ణించాడు శ్రీనాథుడు? "కొందరు కుక్కలు, కొందరు కోతులు, కొందరు పందులు, కొందరు దున్నపోతులు, కొందరు గాడిదలు, ఎవరు మాత్రం తక్కువ? అందరూ అందరే, అందరందరే.." అని పద్యం కట్టాడు. కాకపోతే, ఆ జంతుజాలం పేర్లను పచ్చిగా కాకుండా, వాటి వాటి పౌరాణిక పాత్రలను, అందమైన మాటల పొట్లంలో చుట్టి చెప్పాడు. స్తుతినింద అన్నమాట.

మంచి అయినా, చెడు అయినా, ఎక్కువా తక్కువా కాకుండా, గుంపులోని అందరికీ; ఒకే రకమైన లక్షణాలుంటే అప్పుడు "అందరూ అందరే" అంటాం. మంచితనం కలిగిన అనేకమందిని ఒకేచోట చూడగలిగే అవకాశాలు అతి తక్కువ. ప్రస్తుత రాజకీయ రంగస్థలాన్ని చూసినప్పుడు మాత్రం, అందరూ అందరే అనిపిస్తే అందుకు బాధ్యత మనది కాదు. శ్రీనాథుడిలాగా కష్టపడి, మభ్యపెట్టే అవసరం కూడా లేదు. అట్లాగని, నేరుగా పోలిస్తే, భైరవుడి గుర్రాలకు, యమధర్మరాజు వాహనాలకు మనోభావాలు దెబ్బతింటాయి.

చిట్టచివరకు పిల్లి మెడలో న్యాయరంగం గంట కట్టింది. పిల్లి ఎవరు అన్న విచికిత్స మంచిది కాదు కానీ, ఫిరాయింపుల చెలామణీకి, అధికార పార్టీలకు అందుతున్న సహకారానికి ఇప్పుడు ఇబ్బంది ఏర్పడింది. రాజ్యాంగ విహిత కర్తవ్యాలను నెరవేర్చడానికి అన్ని రాజ్యాంగ వ్యవస్థలు లోబడి ఉండాలని, సభాపతులు ఫిరాయింపుల ఫిర్యాదుల మీద నిర్ణయం తీసుకోవడానికి నిరవధికమైన గడువు ఉండకూడదని తెలంగాణ హైకోర్టు అభిప్రాయపడింది. ఈ కీలకమయిన తీర్పు ఇవ్వడానికి ముందు మునుపు సుప్రీంకోర్టు రెండు సందర్భాలలో చెప్పిన తీర్పులు నేపథ్యంగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ముగ్గురు ప్రతిపక్ష సభ్యుల ఫిరాయింపు ఈ వ్యాజ్యానికి సందర్భం.

ఈ తీర్పు చాలా కీలకమైనది. సభాపతికి ఉన్న ప్రత్యేక ప్రతిపత్తి, నియమాలలో ఉన్న కొంత అస్పష్టత కారణంగా ఫిరాయింపులకు ఏర్పడుతున్న సానుకూలతను తొలగించే న్యాయనిర్ణయం ఇది. ఫిరాయింపుల చట్టానికి ప్రాతిపదికలుగా ఉన్న రాజ్యాంగ, ప్రజాస్వామిక విలువలను బలపరచే తీర్పు ఇది. అయితే, ఒక కీలకమైన ప్రశ్న!

ఎవరికి కావాలి ఈ తీర్పు? ఫిరాయింపులకు శాశ్వతంగా నిరోధం ఏర్పడాలని ఎవరు కోరుకుంటున్నారు? ప్రజాస్వామ్యం మీద అంతటి ప్రేమ ఎవరికి వెల్లువెత్తుతున్నది?

ప్రస్తుత కేసులో అయితే కాంగ్రెస్ పార్టీయే ముద్దాయి. ఈ కేసులో నిర్ణయం ఆ పార్టీకి వ్యతిరేకంగా వచ్చిందనే భావించాలి. పిటిషన్‌దారులు బీఆర్ఎస్‌కు చెందినవారు. ఆ పార్టీ ఈ వ్యాజ్యంలో బాధితురాలు. ప్రస్తుత తీర్పు ఆ పార్టీకి విజయం. ఈ రాజకీయ జయాపజయాలు, ఇప్పటికి, ఈ సందర్భానికి మాత్రమే పరిమితం. నిన్న లేవు. రేపు ఉండవు.

తాము ఫిరాయింపులను ఆహ్వానించకుంటే, ప్రతిపక్షమే తమ నుంచి సభ్యులను లాగికొని, ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రమాదం ఉన్నదని కాంగ్రెస్ చెబుతుంది. తన ప్రభుత్వాన్ని, విధానాలను స్థిరపరచుకోవడానికి తనకు నాలుగు అదనపు సీట్లు దొరికితే బాగుంటుందని ఆ పార్టీ అనుకుంటుంది. కాంగ్రెస్ కారణాలతో తెలంగాణ సమాజానికి ఏమి నిమిత్తం? రాజ్యాంగ వ్యవస్థల దృష్టిలో ఆ కారణాలకేమి విలువ ఉంది? కాంగ్రెస్‌కు తెలంగాణ సమాజం 64 సీట్లే ఇచ్చింది. ఆ సీట్లతోనే తనకు అధికారమూ వచ్చింది. అది బొటాబొటి మెజారిటీ కదా అంటే, ప్రజలు అంతవరకే ప్రసాదించారు. బీఆర్ఎస్‌కు 38 సీట్లు ఇచ్చి ప్రతిపక్షంగా వ్యవహరించమన్నారు. ప్రతిపక్షబాధ్యత నిర్వహించవలసిన శాసన సభ్యులు అధికారపక్షానికి మారడం కానీ, అధికారపక్షం దాన్ని ప్రోత్సహించడం కానీ, ప్రజాస్వామ్యం రూల్‌బుక్‌లో లేవు. బీజేపీ తాను ఫిరాయింపులకు వ్యతిరేకమని, రాజీనామాలు చేసి రావాలని చెబుతుంది కానీ, సాంకేతికమైన నియమాలను పాటించి, సారాంశంలో పెద్ద అభ్యంతరం లేనట్టే వ్యవహరిస్తుంది. అనధికార పార్టీ సభ్యులుగా ఎందరినో చేర్చుకున్న ఉదంతాలున్నాయి.



■ కె. శ్రీనివాస్

సందర్భం

సభాపతుల సహకారం అధికారపార్టీలకు విశ్వాసపరీక్షల వంటి కీలకసమయాల్లో మాత్రమే అవసరం ఉండేది. గత రెండు దశాబ్దాలుగా, ఫిరాయింపుల నిర్వహణలో కూడా వారి చేదోడు కావలసివస్తోంది. ఫిరాయింపు ఫిర్యాదుల మీద కానీ, ఫిరాయింపు సభ్యుడి రాజీనామా మీద నిర్ణయం తీసుకోవడానికి గానీ ఇదమిత్థమైన గడువు అంటూ ఏదీ లేకపోవడం వల్ల, సభాకాలమంతా ఫిరాయింపుదారుడు సభ్యుడిగా కొనసాగే అవకాశం ఏర్పడుతున్నది. ఆ అవకాశాన్ని వినియోగించుకోని అధికారపార్టీ లేదు. ఇప్పుడు ఈ కేసులో కోర్టుకు వెళ్లిన బీఆర్ఎస్ కూడా ఈ ఫిరాయింపు శాస్త్రంలో పిహెచ్‌డి చేసింది.

తెలంగాణ హైకోర్టు తీర్పు మీద బీఆర్ఎస్ చేస్తున్న హంగామా, విలువల ఉద్ఘాటనలు చూస్తుంటే, 'ఔరా, కలి కాలము!' అనిపిస్తుంది. వేదాలు, దెయ్యాలు వంటి పోలికలన్నీ పాతపడిపోయాయి కానీ, నైతికధనార్జన గురించి అదానీ, నిరాడంబరత గురించి అంబానీ మాట్లాడినట్టు ఉంటోంది. ఫిరాయింపు సభ్యుడిని మంత్రిని చేసి, సభాకాలం ముగిసేదాకా నడిపించిన చరిత్ర కదా బీఆర్ఎస్‌ది! నిజానికి, కేసీఆర్‌ని, ఆయన పార్టీని రాజకీయ నైతికత విషయంలో తప్పుపట్టవలసింది ఇటీవలి పదవీకాలంలో చేసిన పనుల గురించి కాదు! తెలంగాణ ఉద్యమంలో నిబద్ధత లేని వృత్తిరాజకీయవాదులకు ప్రవేశం కల్పించినందుకు ఆయనను, ఆయన పార్టీని చరిత్ర బోనులో నిలబెట్టాలి! ఎంతో చిత్తశుద్ధి, త్యాగసాహసాలు అవసరమైన ఒక ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించే రాజకీయ పార్టీ తన సభ్యులను నిప్పులా నిలుపుకోవాలి! రాజశేఖర రెడ్డి ఫిరాయింపు యాగం మొదలుపెట్టగానే వంగిపోయి అమ్ముడుపోయినవారు నాటి కొందరు టీఆర్ఎస్ శాసన సభ్యులు! చేర్చుకోవడంలోనూ నీతికి ఏ మాత్రం ప్రాధాన్యం ఇవ్వనిది కేసీఆరే! ఒకవైపున నిలువునా కాల్చుకుని, ప్రాణాలు ఇచ్చిన ఉద్యమకారులు సాధించిన తెలంగాణను, ఏ అగ్నిపరీక్షలూ లేకుండా అవకాశవాదులకు అందుబాటులోకి తెచ్చారు! అమ్ముడుపోయే, కొనుక్కోగలిగే సరుకును తెలంగాణ రాజకీయ సమాజంలో ప్రోత్సహించిన వారికి, ఇప్పుడు తమ మందలో నుంచి దొంగిలిస్తున్నారని ఆక్రోశించే హక్కు ఉన్నదా?

సభాపతులు సకాలంలో నిర్ణయం తీసుకోవాలని తీర్పు చెబుతున్నది కదా? అంటే, స్పీకర్లు రాజకీయ అనుబంధాలను పక్కనబెట్టి న్యాయనిర్ణయం చేయాలన్న సూచనా ఉన్నట్టే కదా? అంటే సభాపతులు తమ వెన్నెముకలను సవరించుకోవలసిన అవసరం వచ్చింది కదా? కొత్త లోక్‌సభ సభ్యుల ప్రమాణాల సందర్భంగా, కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ స్పీకర్ ఓంబిర్లాను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలేమిటి? నరేంద్రమోదీ ప్రమాణం చేసిన తరువాత, తనను కలిసినప్పుడు ఓంబిర్లా ఆయన ఎదుట తలవంచారని కదా, రాహుల్ అన్నది? లోక్‌సభ సభాపతి ఎవరి ఎదుట అయినా నిటారుగా ఉండవలసిందేనని కదా ఆయన అభిప్రాయం? మరి తాము పాలించే రాష్ట్రాలలో స్పీకర్లు, ముఖ్యమంత్రుల ఎదుట అమిత విధేయతతో వ్యవహరించకుండా రాహుల్ కానీ, ఆయన పార్టీ కానీ ఏమైనా సూచనలు చేశారా? ఫిరాయింపులతో సహా ఏ వివాదంలో అయినా పార్టీ రహితంగా స్వతంత్రంగా వ్యవహరించాలని కాంగ్రెస్ ఒక విలువగా ప్రచారం చేసి, అమలుచేస్తోందా? ఈ ప్రశ్నలు అవసరమైనవి. వీటికి అవును అన్న సమాధానం వస్తే, ఫిరాయింపుల విషయంలో తెలంగాణ స్పీకర్ మరో రకంగా నిర్ణయం తీసుకుంటారన్న ఊహకే ఆస్కారం ఉండేది కాదు. కానీ, దురదృష్టవశాత్తూ, కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో చెబుతున్న సిద్ధాంతాలకు, విలువలకు, క్షేత్రస్థాయి దాకా పాటింపు జరగడం లేదు. జరగాలన్న పట్టింపూ ఆ పార్టీకి ఉండడం లేదు. అదేమంటే, పెద్ద ప్రత్యర్థిని ఎదుర్కొంటున్న అత్యవసర కాలంలో, "చిన్నచిన్న" విషయాలకు మినహాయింపు ఇవ్వాలి కాబట్టి!

ఒకవైపున నిలువునా కాల్చుకుని, ప్రాణాలు ఇచ్చిన ఉద్యమకారులు సాధించిన తెలంగాణను, ఏ అగ్నిపరీక్షలూ లేకుండా అవకాశవాదులకు అందుబాటులోకి తెచ్చారు! అమ్ముడుపోయే, కొనుక్కోగలిగే సరుకును తెలంగాణ రాజకీయ సమాజంలో ప్రోత్సహించిన వారికి, ఇప్పుడు తమ మందలో నుంచి దొంగిలిస్తున్నారని ఆక్రోశించే హక్కు ఉన్నదా?

ఎవరికీ అక్కరలేని ఒక ప్రజాస్వామిక, రాజ్యాంగ విలువ కోసం న్యాయస్థానం చొరవ చూపింది. తక్షణ రాజకీయ ప్రయోజనం కోసం ఆ చొరవను శ్లాఘించేవారే తప్ప, దాన్ని మనసా వాచా ఇష్టపడేవారు లేరు. నువ్వు అధికారంలో ఉన్న కాలంలో ఏమిచేశావు అని ఎదురు ప్రశ్నించడమే తప్ప, కాంగ్రెస్ పార్టీ వద్ద మరో సమాధానం లేదు. పైగా, కోర్టు తీర్పులో దాగిన ఒక ప్రజాస్వామిక సూత్రం మీద కనీస గౌరవం కూడా ఆ పార్టీ చూపించలేదు. చూపించి ఉంటే, కోర్టు నిర్ణయం చెప్పిన రోజునే, పీఏసీ చైర్మన్‌గా ఒక ఫిరాయింపు శాసన సభ్యుడిని నియమిస్తుందా? పైకి, ఇది ప్రతిపక్ష పార్టీకి విసిరిన సవాల్‌గా కనిపిస్తుంది కానీ, వాస్తవంలో అది ఒకరకమైన కోర్టు ధిక్కారమే కదా? ఫిరాయింపు ఎమ్మెల్యేకు తన పార్టీ ఎంపీ టికెట్ ఇచ్చి నిలబెట్టినప్పుడు చూపిన బోరవిరుపునే కాంగ్రెస్ ఇప్పుడూ చూపింది!

వాళ్లూ కాని, వీళ్లూ కాని తెలంగాణ పౌరసమాజం అంటూ ఒకటి ఉంటే, అది ఫిరాయింపుల మీద మాట్లాడాలి. ప్రజలు మాట్లాడితే, నిజానికి, ఏ కోర్టూ నిర్దేశించనక్కరలేదు, రాజకీయంగా నష్టంజరిగే అవకాశం ఉంటే, ఏ పార్టీ కూడా ప్రజాకాంక్షను అతిక్రమించదు. బాధాకరమేమిటంటే, ప్రజలు కూడా అత్యధికులు రాజకీయ పాక్షికులుగా మారిపోయారు. విలువల ఆధారంగా కాక, ఇతర ప్రాతిపదికల మీద రాజకీయపార్టీల వెనుక సమీకృతులవుతున్నారు. వెధవాయను నేను నీకంటె పెద్ద వెధవాయను నేను, అంటూ నాయకులు పోటీపడి అల్పత్వాన్ని ప్రకటించుకుంటుంటే, చప్పట్లు కొడుతూ వినోదం చూస్తున్నారు. మంచీచెడూ తెలిసినవారు, ఏ గొంగట్లో తింటే ఏమిటి అంటూ నిర్లిప్తంగా ఉంటున్నారు.

ఇంకా తెలవారదేమి? ఈ స్థితి గతి మారదేమి?

'మంచి మిత్రులు' సినిమాలో 'ఇంకా తెలవారదేమి?' అనే పాట ఉంది. విశ్వవిద్యాలయాల వీసీల నియామకాల గురించి ఆలోచిస్తుంటే ఆ పాట నాకు జ్ఞాపకమొచ్చింది.

ఏళ్ల తరబడి విశ్వవిద్యాలయాలలో వీసీలను నియమించకుండా కొనసాగించడం ప్రభుత్వాలకు ఒక అలవాటైపోయింది. అసలు విద్యకే ఒక మంచి మంత్రిని నియమించడం కూడా చాలా అరుదైపోయింది. విద్యంటేనే చిన్నచూపు ఏర్పడింది. అందువల్ల విద్యారంగంలో సంస్కరణలు తెస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడపాదడపా మాట్లాడినా అవి కార్యరూపం దాల్చడం లేదు. గతంలో కొఠారి కమిషన్ ఎన్నో మంచి ప్రతిపాదనలు చేసినా, వాటిలో కొన్నింటిని కూడా ప్రభుత్వాలు సీరియస్‌గా పట్టించుకోలేదు. ఈ మధ్య రాష్ట్ర ప్రభుత్వం ఒక 'ఎడ్యుకేషన్ కమిషన్' వేస్తే "రాజ్యాంగబద్ధమైన కమిషన్‌ల రిపోర్టులనే పట్టించుకునేవారు లేరు, ఇక జీఓ ద్వారా ఏర్పరచిన కమిషన్ సూచనలను ఎవరు పట్టించుకుంటారు" అని ఒక పత్రిక రాసింది.

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఎన్నోసార్లు వీసీల నియామకాలు 'ఇదిగో వచ్చె, అదిగో వచ్చె' అన్నారు. మరి ఏవీ అవి? విశ్వవిద్యాలయాలకు వీసీలను నియమించకపోవడం వల్ల వాటిలో ఎన్నో అవకతవకలు జరుగుతున్నాయి. ఉదాహరణకు 'బాసర' లాంటి ప్రాంతంలో ఒక విశ్వవిద్యాలయంలో ఏళ్ల తరబడి అస్థిర పరిస్థితి కొనసాగుతోంది. అది ఇంకా ఒక ఇన్‌చార్జ్ వీసీకే కాని రెగ్యులర్ వీసీకి నోచుకోలేదు. ఇక ఇతర విశ్వవిద్యాలయాల మాట చెప్పేదేముంది? తెలుగు అకాడమీ లాంటి విశ్వవిద్యాలయాలతో ఎంతో సన్నిహిత సంబంధమున్న ఒక మంచి సంస్థను కూడా పదేళ్లుగా పర్మినెంట్ సంచాలకుడిని వేయకపోవడం అందరికీ తెలిసిందే. ఇలాగైతే విద్యావ్యవస్థ ఎలా బాగుపడుతుంది? ఈ వ్యవస్థే బాగుపడకపోతే ఇతర రంగాలు ఎలా బాగుపడతాయి? క్రమశిక్షణ, లా అండ్ ఆర్డర్ ఎలా బాగుంటుంది?

విద్యా వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల నిరుద్యోగ సమస్య ప్రబలి, యువత విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నందునే కదా ప్రతిరోజూ ఎన్నో వినకూడని, కనకూడని అరాచకాలు, అసభ్య ప్రవర్తన తటస్థిస్తున్నాయి. ఎన్నో ఆత్మహత్యలు, అనాగరికపు చేష్టలు, ఆకతాయి పోకడలు సంభవిస్తున్నాయి. వీటన్నింటికీ కారణం విద్యలో విలువలు క్షీణించడమే. విద్యా వ్యవస్థను పాడుచేసుకొని, తద్వారా లా అండ్ ఆర్డర్ సమస్యలను సృష్టించుకొని... ప్రభుత్వాలు ఎలా సుస్థిరంగా సాగుతాయి? రక్షణ– సంరక్షణ, క్షేమ–సంక్షేమ పరిస్థితులను ఎలా నెలకొల్పుతాయి? విద్యాప్రమాణాలు దిగజారిపోతున్నందువల్లనే కదా అవినీతి కూడా అంతకంతకూ పెరిగిపోతోంది. దానిని ఎలా అరికడతారు? వీసీల నియామకాలలో కుల, మత, ప్రాంత ప్రాతినిధ్యాలను ఇవ్వక తప్పదు. అది రాజకీయంగా వీలుపడదు. కానీ ప్రతి కులంలో, మతంలో, ప్రాంతంలో ఎంతో కొంతమంది మంచివాళ్లు, యోగ్యులు ఉంటారు. వారిని నియమిస్తున్నారా లేక రాజకీయపరంగా కానివారిని నియమిస్తున్నారా అన్నదే ప్రశ్న.

విద్యామంత్రి తప్పనిసరిగా ఉండాలి. ఎందుకంటే, విద్యకు మించిన శాఖ మరొకటి లేదు. ఆ శాఖ అన్ని శాఖలకు మానవ వనరులను సమకూరుస్తుంది. ఈ శాఖను ముఖ్యమంత్రే చేబట్టాలి. అప్పుడే ఆ శాఖకు సరిపోయే వనరులు లభిస్తాయి, సరిపోయినంత స్వేచ్ఛ లభిస్తుంది. లేకపోతే విద్య కుంటుకుంటూ, గెంటుకుంటూ నడుస్తుంది. ముఖ్యమంత్రి మూడు వేర్వేరు శాఖలు నిర్వహించడం కన్నా, ఒక్క విద్యాశాఖను నిర్వహిస్తే అన్ని శాఖలకు మేలు చేసినవారవుతారు. మిగిలిన శాఖలకు మంచివారిని, యోగ్యులను సరఫరా చేయగలుగుతారు. ఇప్పుడు కావలసింది అదే!

– డా. కొండలరావు వెల్చాల
పూర్వ సంచాలకులు, తెలుగు అకాడమీ

నిధుల బదిలీలో రాష్ట్రాలకు అన్యాయం

కేంద్రం వద్ద అపారమైన ఆర్థిక వనరులను సమకూర్చుకునే అవకాశాలు ఉండగా, రాష్ట్రాలకు అత్యధికంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అందుకు ప్రధాన కారణం, కేంద్రం తన ఆదాయాన్ని పన్నుయేతర మార్గాల ద్వారా పెంచుకుంటూ, వాటిల్లో రాష్ట్రాలకు వాటా లేకుండా చేయడమే.

ఆర్థిక వనరుల సమీకరణలో మొదటి నుంచీ కేంద్ర ప్రభుత్వానికి అపారమైన అవకాశాలు లభిస్తూ ఉండగా, రాష్ట్రాలకు మాత్రం అపరిమిత బాధ్యతలు సంక్రమిస్తున్నాయి. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, ఆర్థిక వనరులను పొందికగా వినియోగిస్తూ మెరుగైన ఫలితాలు సాధిస్తున్న రాష్ట్రాలు ఈ సందర్భంగా ఓ విధమైన వివక్షకు, అన్యాయానికీ గురవుతున్నాయి. 'సహకార ఫెడరలిజం' పేరుతో రాష్ట్రాలకు పన్నులలో వాటాలను 41 శాతానికి పెంచామని కేంద్రం గర్వంగా చెప్పుకుంటున్నది గానీ ఆచరణలో అందుకు భిన్నంగా జరుగుతోంది.

అంతర్జాతీయంగా పేరొందిన ఆర్థికవేత్త, నీతి ఆయోగ్ మొదటి వైస్ చైర్మన్ డా. అరవింద్ పనగరియా అధ్యక్షతన ఏర్పడిన 16వ ఆర్థిక సంఘం ఈ విషయంలో నెలకొన్న అసమతుల్యతలను సరిదిద్దుతుందనీ, ఆరోగ్యవంతమైన ఆర్థిక వనరుల పంపిణీ జరిగేట్లు నిర్దుష్టమైన సిఫార్సులు చేయగలదనీ ఆశిద్దాం. తెలంగాణ రాష్ట్రాన్ని మొదటి పదేళ్లలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రాల చెంత నిలబెట్టి, దేశంలోనే జీడీపీలో అగ్రగామి రాష్ట్రంగా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుంది. ఆగస్టు, 2021లో నీతి ఆయోగ్ స్వయంగా, "రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వృద్ధి, సగటు వార్షిక రేటు కంటే ఎక్కువ నమోదైంది. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పటి నుండి 9 శాతం, ఇది అంతకు ముందు సాధించిన వృద్ధి రేటు కంటే గణనీయంగా ఎక్కువ" అని ప్రశంసించడం గమనార్హం.

కేంద్రం వద్ద అపారమైన ఆర్థిక వనరులను సమకూర్చుకునే అవకాశాలు ఉండగా, రాష్ట్రాలకు అత్యధికంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అందుకు ప్రధాన కారణం, కేంద్రం తన ఆదాయాన్ని పన్నుయేతర మార్గాల ద్వారా పెంచుకుంటూ, వాటిల్లో రాష్ట్రాలకు వాటా లేకుండా చేయడమే. కేంద్రం సెస్, సర్‌చార్జీల ద్వారా తన ఆదాయం మరింత పెంచుకుంటున్నది. ఈ మొత్తాలను తగ్గించాలని ఆర్థిక సంఘం సిఫార్సు చేసినప్పటికీ 2020–21లో మొత్తం పన్నుల ఆదాయంలో ఈ మొత్తం 20శాతం మేరకు ఉండటం గమనార్హం.

2015–16లో పన్నుల వాటాగా రాష్ట్రాలకు బదిలీ చేసిన రూ.84,579 కోట్లకు రెట్టింపుకు పైగా రూ.1,75,736 కోట్లను కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల ద్వారా బదిలీ చేశారు. అదేవిధంగా, 2024–25లో ఆర్థిక సంఘం నిధులు రూ.1,32,378 కోట్లు మాత్రమే కాగా, కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల ద్వారా రూ.4,79,605 కోట్లను బదిలీ చేశారు. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలు చాలా వరకు రాష్ట్రాల పరిధిలోని అంశాలకు సంబంధించినవే కావడంతో రాష్ట్రాల ఆర్థిక స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా ఈ నిధుల బదిలీ ఉంటోంది.

ప్రతి ఐదేళ్లకు ఒకసారి, ఆర్థిక సంఘం కాల వ్యవధిలో కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలను సమీక్షించాలని నిర్ణయించినా, దాన్నింకా అమలు జరపడం లేదు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సభ్యునిగా ఉన్న ఈ అంశపు మంత్రుల ఉపసంఘం కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలను ఐచ్ఛికం చేయాలని సిఫార్సు చేసినా దాన్నింకా అమలుపరచడం లేదు. ఇప్పుడు రాష్ట్రాలు ఎదుర్కొంటున్న వనరుల కొరత దృష్ట్యా పన్నులలో రాష్ట్రాల వాటాను 41 శాతం నుండి 50 శాతానికి పెంచాల్సి ఉంది. 20 శాతంగా ఉన్న పన్నేతర ఆదాయాన్ని ఈ పరిధిలోకి తీసుకురాగలిగితే, ఇలా చేయడం ఓ సమస్య కాబోదు.

1960–61లో రూ.175 కోట్లు మాత్రమే ఉన్న ఈ పన్నేతర ఆదాయం 2022–23 నాటికి రూ.2.85 లక్షల కోట్లకు, 2024–25 నాటికి రూ.5.47 లక్షల కోట్లకు పెరగడం గమనార్హం. అంటే, క్రమంగా కేంద్రం రాష్ట్రాలకు పన్నులలో వాటాను ఎగ్గొట్టే విధంగా ఈ ఆదాయాలను పెంచుకుంటూ పోతోంది. నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేస్తూ కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన తీర్మానంలో, రాష్ట్రాలు తమ ఆర్థిక వనరులకు కేంద్రంపై ఆధారపడే అవసరం లేకుండా, స్వతంత్రంగా–నిర్ణయాత్మకంగా వ్యవహరించాలనే లక్ష్యాన్ని ప్రస్తావించడాన్ని ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకోవాలి.

నిధుల పంపిణీలో క్రమంగా అసమానతలు పెరుగుతున్నాయి. తక్కువ తలసరి ఆదాయం గల రాష్ట్రాలకు ఎక్కువ నిధులు సమకూర్చుతున్నారు. వెనుకబడిన రాష్ట్రాల అవసరాలను కేంద్రం పరిగణలోకి తీసుకోవాలనటంలో ఎవరికీ అభ్యంతరాలుండవు. అందుకోసం ఆయా రాష్ట్రాలలో మౌలిక సదుపాయాలను



పెంపొందించడం పట్ల ఎక్కువగా దృష్టి సారించాలి. ప్రస్తుతం కేంద్రం, ఆదాయ–కార్పొరేట్ పన్నులలో రూ.1.40 లక్షల కోట్ల మేరకు సర్‌చార్జీలను ఎటువంటి నిర్దిష్ట ప్రయోజనం పేర్కొనకుండా వసూలు చేస్తున్నది. ఈ మొత్తం భారత కన్సాలిడేషన్ నిధిలో చేరుతున్నది. ఈ మొత్తాన్ని వెనుకబడిన రాష్ట్రాల మౌలిక సదుపాయాల నిధికి కేటాయిస్తే, అభివృద్ధి చెందిన రాష్ట్రాలను నిరుత్సాహపరచకుండానే వెనుకబడిన రాష్ట్రాల అభివృద్ధికి దోహద పడ్డట్టవుతుంది.

రాష్ట్రాల ఆదాయంలో 80శాతం వరకు పన్నుల ద్వారానే సమకూరుతోంది. ప్రస్తుతం పన్నుల వసూళ్లల్లో నిబద్ధతను పాటించే రాష్ట్రాలకు 2.5 శాతంగా మాత్రమే ఇస్తున్న వెయిటేజీని 10శాతానికి పెంచాలి. గతంలో ఆర్థిక కమిషన్, జనాభా నియంత్రణకు కేటాయించిన 12.5 శాతం వెయిటేజీని 16వ ఆర్థిక సంఘం కూడా కొనసాగించాలి. 2026లో నియోజకవర్గాల పునర్విభజన–పరిణామాల కారణంగా జనాభా నియంత్రణలో మెరుగైన పనితీరు కనబరచిన రాష్ట్రాల ప్రయోజనాలు భంగపడే ప్రమాదముంది. పన్నుల పంపిణీలో తెలంగాణ వాటా 2014–15లో 2.437 శాతంగా ఉంటే, 14వ ఆర్థిక సంఘం (2015–16 నుంచి 2019–20) నాటికి 2.133 శాతానికి తగ్గింది. 15వ ఆర్థిక సంఘం (2021–25) నాటికి అది మరింత తగ్గి 2.102 శాతంగా మారుతోంది.

స్థానిక సంస్థలకు నిధులను 50 శాతానికి పెంచడంతో పాటు, వాటిని 80 శాతం జనాభా, 20 శాతం విస్తీర్ణం నిష్పత్తి ప్రాతిపదికన ఇవ్వాలి. గత ఆర్థిక సంఘం 90 శాతం జనాభాను ప్రాతిపదికగా తీసుకోవడంతో గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ నిధులు లభించాయి. 40 శాతం వరకు పట్టణ ప్రాంతాలున్న తెలంగాణ వంటి రాష్ట్రాలకు తక్కువ నిధులు సమకూరాయి.

రాష్ట్రాల విపత్తు నిధిని 15వ ఆర్థిక సంఘం 100 శాతం పెంచింది. ప్రస్తుతం కనీసం 60శాతం పెంచాలి. విపత్తు నిధిలో రాష్ట్రాలు 10శాతం మాత్రమే చెల్లించాలని, మిగిలిన 90 శాతం కేంద్రం సమకూర్చాలని 14వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసినప్పటికీ కేంద్రం అమలు చేయలేదు. అదేవిధంగా, తీవ్రమైన ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు 100 శాతం విపత్తు నిధులను ఉపయోగించుకొనే నిబంధనలను తొలగించి, గతంలో మాదిరిగా 50శాతానికి పరిమితం చేయాలి. మరోవైపు పేరుకుపోయిన డిస్కమ్‌ల అప్పులు, కరోనా సమయంలో (2020–21, 2021–22) కేంద్ర సూచనలపై రాష్ట్రాలు చేసిన అప్పులు రాష్ట్రాలపై పెనుభారమౌతున్నాయి. అందుకనే కరోనా సంబంధిత రుణాలను కేంద్రానికే బదిలీ చేయాలి.

తెలంగాణాలో ప్రధాన నదులైన కృష్ణా, గోదావరి సముద్రానికి 70–150 అడుగుల ఎత్తులో ప్రవహిస్తున్నాయి. అందుచేత బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్మించిన ఎత్తిపోతల పథకాలతో తెలంగాణలో ఇప్పుడు దేశంలోనే అత్యధికంగా వరి ఉత్పత్తి అవుతోంది. ఎత్తిపోతల పథకాల నిర్వహణ కోసం తెలంగాణకు ప్రత్యేకంగా రూ.40,000 కోట్ల నిధులను ఆర్థిక సంఘం కేటాయించాలి. 'పాలమూరు–రంగారెడ్డి' ఎత్తిపోతల పథకాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి దీని నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టాలి.


ఇంటింటికి పంపుల ద్వారా త్రాగు నీరిచ్చే పథకాన్ని కేంద్రం ప్రారంభించడానికి ముందే తెలంగాణ 'మిషన్ భగీరథ'ను పూర్తి చేసింది. ఈ పథకం నిర్వహణకు ప్రత్యేకంగా రూ.20,000 కోట్ల నిధులను ఆర్థిక సంఘం సిఫార్సు చేయాలి.

14వ ఆర్థిక సంఘం వరకు కూడా, అవి చేసిన సిఫార్సులను కేంద్రం పూర్తిగా ఆమోదించి, అమలు చేస్తూ ఉండేది. కానీ 15వ ఆర్థిక సంఘం నుంచి కేంద్రం ధోరణి మారింది. 2019–20, 2020–21లలో నిధుల పంపిణీ తగ్గుదలను గుర్తించి, 2020–21లో ప్రత్యేకంగా రూ.723కోట్లు కేటాయించాలని 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసినా కేంద్రం పట్టించుకోలేదు. 2021–22 నుండి 2025–28 వరకు 15వ ఆర్థిక సంఘం నిర్దిష్ట రంగాలకు రూ.3,024 కోట్లు, నిర్దిష్ట రాష్ట్రాలకు రూ.2,350 కోట్లను బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. కానీ ఈ గ్రాంట్లను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది.

డా. అరవింద్ పనగరియా నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా ఉన్న సమయంలో జూలై, 2016లో మిషన్ భగీరథకు రూ.19,205 కోట్లు, మిషన్ కాకతీయకు రూ.5,000 కోట్లు నిధులు ఇవ్వాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చేసిన సిఫార్సును సహితం కేంద్రం పట్టించుకోలేదు. నిధుల బదిలీల్లో కేంద్రం అనుసరిస్తున్న అవాంఛనీయ ధోరణులను కట్టడి చేసేలా 16వ ఆర్థిక సంఘం నిర్దుష్టమైన సిఫార్సులు చేయడంతో పాటు, రాజ్యాంగబద్ధమైన ఈ సంఘం సిఫార్సులను కేంద్రం అమలుపరిచేలా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



■ టి. హరీశ్‌రావు
ఎమ్మెల్యే, మాజీ మంత్రి





కంప్యూటర్ విద్య.. మిథ్యేనా?

సర్కారు స్కూళ్లలో అటకెక్కిన వ్యవస్థ

- కంప్యూటర్లు పాడై, బోధకులు లేకపోవడంతో విద్యార్థుల ఇబ్బందులు
- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిపోయిన వైనం
- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కొన్ని పాఠశాలల్లోనే నిర్వహణ
- సమగ్రశిక్షా అరకొరగానే..
- జిల్లాలో పూర్తిస్థాయి కోఆర్డినేటర్ల కరువు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంప్యూటర్ విద్య కరువైంది. నిర్వహణను పట్టించుకునే వారు లేకపోవడంతో నిరుపేద విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరం అవుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దుతామని చెబుతున్నా, క్షేత్రస్థాయి పరిస్థితులు విరుద్ధంగా ఉన్నాయి. జిల్లా విద్యాశాఖ పరిధిలో కొనసాగుతున్న సమగ్రశిక్ష అభియాన్ నిర్వహణ కూడా అధ్వానంగా మారింది.

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వబడుల్లో కంప్యూటర్ విద్యపై నిర్లక్ష్యం కనిపిస్తోంది. 2000 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం దీన్ని ప్రారంభించింది. 8 ,9, 10వ తరగతి పిల్లలు ఇంటర్, డిగ్రీ కోర్సుల్లోకి వెళ్లేముందే పాఠశాల స్థాయిలోనే కంప్యూటర్‌పై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో క్లాసులకు అంకురార్పణ చేసింది. ఆరంభంలో నిర్వహణను పట్టించుకున్న ఉపాధ్యాయులు, అధికారులు కాలక్రమేణా వదిలివేశారు ఎంపీ లాడ్స్, ఇతర నిధులతో పాఠశాలలో ప్రత్యేక గదిని, కంప్యూటర్లను ఏర్పాటు చేసి కొన్నేళ్ల నుంచి నిర్వహణను గాలికి వదిలేశారు.

పాడైపోయిన కంప్యూటర్లు

జిల్లాలో 690 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, మొదటి దశలో దాదాపు 80 స్కూళ్లలో కంప్యూటర్ విద్యను ప్రారంభించారు. పాఠశాలకు ఒకరు చొప్పున టీచర్‌ను ఎంపిక చేసి వారికి ప్రాథమిక శిక్షణ ఇచ్చారు. ఆయా చోట్ల ఒక్కో తరగతికి వారానికి ఒకటి చొప్పున క్లాసులను నిర్వహించారు. 2000 నుంచి 2010 సంవత్సరం వరకు కంప్యూటర్ క్లాసులు బాగానే జరిగాయి. తర్వాత నుంచి క్రమక్రమంగా నిర్లక్ష్యం ఆవహించింది. పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతతో సాంకేతిక విద్యను గాలికొదిలేశారు. దీంతో స్కూళ్లలో ఏర్పాటు చేసిన కంప్యూటర్లు పాడైపోయాయి. పలు చోట్ల చోరీకి గురైనట్లు తెలిసింది.

స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో..

గత ప్రభుత్వం కంప్యూటర్ విద్యను పట్టించుకోకపోయినప్పటికీ, పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి నిర్వహిస్తున్నాయి. ఈ మేరకు 181 హైస్కూళ్లలో 50 చోట్ల కంప్యూటర్లు కొనుగోలు చేసి అందించాయి. ప్రత్యేకంగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించి వారానికి రెండుసార్లు విద్యార్థులకు కంప్యూటర్ తరగతులు నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం 50 పాఠశాలల్లో 8,9వ తరగతి విద్యార్థులు కలిపి దాదాపు 380 మందికి శిక్షణ అందిస్తున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. కంప్యూటర్ క్లాసులను జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించాలన్న డిమాండ్ పెరుగుతున్నది. కాంగ్రెస్ సర్కారు ప్రత్యేక చొరవచూపితే జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ క్లాసులు తిరిగి ప్రారంభం అవుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

గాడితప్పిన పాలన

జిల్లా విద్యాశాఖ పరిధిలో కొనసాగుతున్న సమగ్రశిక్షా అభియాన్ నిర్వహణకు శాశ్వత కోఆర్డినేటర్లు లేకపోవడంతో పాలన గాడితప్పింది. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల బోధనలు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమాచారం ఉన్నతాధికారులకు సరిగ్గా అందకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సర్కారు స్కూళ్లలో చదువుతున్న పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు బోధనల్లో కనీస ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకునేందుకు కొన్నేళ్ల క్రితం సమగ్రశిక్ష పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇతర ఉద్యోగులతోపాటు వివిధ విభాగాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా కోఆర్డినేటర్లను నియమించారు. మెరిట్ సాధించిన వారు కోఆర్డినేటర్లుగా బాధ్యతలు నిర్వర్తించేందుకు ఆసక్తి చూపించకపోవడంతో ఆయా పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. కీలకమైన ప్లానింగ్ కోఆర్డినేటర్ పోస్టు ఇప్పటికీ ఖాళీగానే ఉంది. దీంతో వేరే విభాగానికి చెందిన కోఆర్డినేటర్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. కాగా, పాఠశాల విద్యను మరింతగా మెరుగుపరిచేందుకు ఏర్పాటు చేసిన సమగ్రశిక్షలో రెగ్యులర్ కోఆర్డినేటర్లను నియమించాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.



సమీక్షా సమావేశంలో సీపీ సీవీ ఆనంద్, సిబ్బంది

బందోబస్తు వ్యూహాత్మకంగా ఉండాలి

- గణేష్, మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలపై సీపీ సమీక్ష

హైదరాబాద్ సిటీ/కార్వాన్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): గణేష్, మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సిబ్బందిని ఆదేశించారు. సౌత్‌వెస్ట్ జోన్ పోలీస్ అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సౌత్ జోన్, సౌత్ వెస్ట్ జోన్‌లు సిటీలో చాలా కీలకమైనవని, బందోబస్తు విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించాలని సూచించారు.

భక్తులకు ఇబ్బంది కలగొద్దు..!

- శోభాయాత్ర మార్గంలో అదనపు వీధిదీపాలు
- నేడు స్టాండింగ్ కమిటీలో చర్చ



గణపతి నిమజ్జనం జరిగే ప్రాంతాలు, శోభాయాత్ర జరిగే మార్గంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. అదనపు, జోనల్ కమిషనర్లతో ఆమె బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మండపాలు, శోభాయాత్ర సాగే రహదారులపై చెత్త వెంటనే తొలగించేలా పారిశుధ్య కార్మికులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. శోభాయాత్ర జరిగే మార్గాల్లో 15,500 అదనపు వీధిదీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు రూ.2.98 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. నేడు జరిగే స్టాండింగ్ కమిటీ ఎజెండాలో ఈ ప్రతిపాదనపై చర్చించనున్నారు.

కాఫీ.. ఒక అనుభవం

- రేపటి నుంచి ఇండియన్ కాఫీ ఫెస్టివల్



హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): విభిన్న రకాల కాఫీలను రుచి చూపించేందుకు నో స్ట్రింగ్స్ హైదరాబాద్ సంస్థ నగరంలో తొలిసారిగా ఇండియన్ కాఫీ ఫెస్టివల్ నిర్వహిస్తోంది. జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్ వద్ద సెప్టెంబర్ 13 నుంచి 15 వరకు మూడు రోజుల పాటు ఈ ఫెస్టివల్ కొనసాగనుంది. కాఫీ.. కేవలం పానీయం కాదు.. ఇది ఒక అనుభవం అంటున్నారు నిర్వాహకులు. ఆసియాలో మొట్టమొదటి కాఫీ కప్పర్‌గా గుర్తింపు పొందిన సునాలినీ మీనన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కాఫీ ఫెస్టివల్‌లో జంతు ప్రేమికుల కోసం పిల్లులు, పెంపుడు జంతువుల సంరక్షణ కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కథా కాఫీ, కరాపా కాఫీ, ట్రూ బ్లాక్ కాఫీ, బిగ్ స్టార్ కేఫ్, కరాబీ కాఫీ, అరకు కాఫీ, ఎంఎస్పీ హిల్ రోస్టర్స్, ఫస్ట్ క్రాక్ రోస్టర్స్, ఒడిస్సీ కాఫీలతో సహా భారతదేశంలోని కొన్ని అత్యుత్తమ కాఫీ బ్రాండ్‌లు పాల్గొనబోతున్నాయని 'నో స్ట్రింగ్స్' వ్యవస్థాపకుడు శ్రీహరి చావా అన్నారు.

- ఇప్పటి వరకు గ్రేటర్ జోన్‌లో 1500 అపార్ట్‌మెంట్లను గుర్తించిన విద్యుత్ అధికారులు
- ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు
- గచ్చిబౌలి, గోపన్‌పల్లి, మేడ్చల్‌లో కొనసాగుతున్న సర్వే

20 కిలోవాట్ల లోడ్ దాటిన అపార్ట్‌మెంట్లకు నోటీసులు జారీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో 20 కిలోవాట్ల విద్యుత్ లోడ్ మించిన అపార్ట్‌మెంట్లను గుర్తించి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నోటీసులు జారీ చేస్తోంది. శివారు ప్రాంతాల్లో పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల (పీడీటీఆర్)పై ఓవర్‌లోడ్ పడి రోజుకు నాలుగైదు సార్లు సరఫరాలో అంతరాయాలు ఏర్పడడంతో దిద్దుబాటు చర్యలు చేపడుతోంది. పబ్లిక్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి 20 కిలోవాట్ల లోడ్‌కు మించి విద్యుత్‌ను వినియోగిస్తున్న 1500కు పైగా అపార్ట్‌మెంట్లను గుర్తించారు. వాటికి నోటీసులు జారీ చేస్తున్నారు. మణికొండ, అల్లాపూర్ ప్రాంతాల్లో ఇప్పటికే 200 అపార్ట్‌మెంట్లకు నోటీసులు అందించారు. గచ్చిబౌలి, గోపన్‌పల్లి, మేడ్చల్, కేపీహెచ్‌బీ, రాయదుర్గం, కొండాపూర్, హఫీజ్‌పేట ప్రాంతాల్లో సర్వే కొనసాగుతోంది.





ఖైరతాబాద్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాల ఐదో రోజున వినాయక విగ్రహాలు పెద్ద ఎత్తున నిమజ్జనానికి తరలివచ్చాయి. యువత బ్యాండ్‌మేళాలతో ట్యాంక్‌బండ్‌కు తరలివచ్చింది. అయితే, ఎన్.టీ.ఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్ పైన క్రేన్‌లను ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు నిరాశకు గురయ్యారు. పీవీ నర్సింహారావు మార్గంలో దాదాపు 10 క్రేన్లు ఏర్పాటు చేసి నిమజ్జనం కోసం వచ్చే విగ్రహాలను అధికారులు అక్కడికి పంపించారు.

రైళ్లు ఖాళీలేవమ్మా..!!
- దసరా, దీపావళి ప్రయాణాలకు సీట్లు, బెర్తులు ఫుల్
- ప్రధాన రైళ్లలో ఏసీ తరగతులకు 'నోరూమ్'
8

ప్రత్యామ్నాయం చూపకుండా కూల్చివేతలా?

- హైడ్రా చర్యలపై సున్నం చెరువు బాధితులు
- జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లను కూల్చివేయడం రాజ్యాంగం ఇచ్చిన జీవించే హక్కును ఉల్లంఘించినట్లేనని సున్నం చెరువు బాధితులు వాపోతున్నారు. మాదాపూర్‌లో హైడ్రా చేపట్టిన కూల్చివేతలపై బాధితులు ఢిల్లీలోని జాతీయ మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. మాదాపూర్ సరోజినినాయుడు నగర్‌లో దాదాపు 200 మంది పేదలు 15 ఏళ్లుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. గుడిసెల్లో నివసించేవారు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం నగరానికి వచ్చినవారే. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా హైడ్రా అధికారులు సెప్టెంబర్ 8న ఆదివారం పోలీసులతో కలిసి కూల్చివేతలు చేపట్టారు. విధులకు అడ్డంకులు కల్పిస్తున్నారని కొంతమంది బాధితులపై కేసులు నమోదు చేశారు. కూల్చివేతల సమయంలో గుడిసెల్లో ఉన్న సామాన్లు, నిత్యావసరాలు, చివరికి పిల్లల పుస్తకాలు తీసుకునే సమయం కూడా హైడ్రా అధికారులు ఇవ్వలేదని ఆరోపించారు. కూల్చివేతల్లో నష్టపోయిన పేదలకు పరిహారం అందించాలని, పునరావాసం కోసం ఏర్పాట్లు చేయాలని, పోలీసులు పెట్టిన కేసులు ఎత్తివేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు

టీఎన్జీఓ కాలనీలో రేవ్‌పార్టీ

- పోలీసుల అదుపులో 18 మంది



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, గంజాయి

రాయదుర్గం, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి టీఎన్జీఓ కాలనీలో రేవ్‌పార్టీ సంచలనం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో టీఎన్‌జీవో కాలనీ అలయ్‌బలయ్ చౌరస్తా పక్కన ఉన్న ఓ ఇంట్లో యువతీ యువకులు పెద్ద శబ్దాలతో మ్యూజిక్ పెట్టుకుని డ్యాన్స్ చేస్తున్నారు. గమనించిన ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గచ్చిబౌలి పోలీసులు కాలనీలోని ప్లాట్ నెంబర్ 93లోని ఇంటిపై దాడి చేశారు. రేవ్‌పార్టీలో పాల్గొన్న కె. ఆదిత్య, పిన్నింటి రామకృష్ణ, పెద్దిరెడ్డి గారి చరణ్, గొర్తి సాయి ప్రవీణ్, వీరపనేని వరుణ్, శివశంకర్‌రెడ్డి, వీర శివారెడ్డి, మద్దినేని హరికృష్ణ, కాటేపల్లి రమేష్, మండపూడి కోటేశ్వరరావు, అనపర్తి విజయ్ కుమార్, కోట్ల అజయ్, డి. సంధ్య, కూకటి ఆశ, కూకటి రీతు, షేక్ సమ సుల్తానా,

మిగతా 8 వ పేజీలో..

11 గంటలు.. 102 సీసీ కెమెరాలు



సీసీ కెమెరాలో సెల్‌ఫోన్ చోరీ చేసిన నిందితుడి చిత్రం

- బాలిక ఆచూకీ తెలుసుకునేందుకు జల్లెడ పట్టిన కానిస్టేబుల్
- మరో కేసులో సెల్ ఫోన్ దొంగల అరెస్ట్

బంజారాహిల్స్ సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి):

'నేను ఇల్లు వదిలి వెళ్తున్నా. నా కోసం వెతకకండి' అంటూ ఓ బాలిక లేఖ రాసి వెళ్లిపోయింది.

బ్యాచిలర్స్ నిద్రిస్తున్న సమయంలో గది కిటికీలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు రెండు ఖరీదైన సెల్‌ఫోన్లు చోరీ చేసి పారిపోయారు. ఈ రెండు కేసుల్లో పోలీస్ కానిస్టేబుళ్లు తక్షణం స్పందించారు. రెండు బృందాలుగా విడిపోయి, సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంటూ ఆ కేసులను 11 గంటల్లో ఛేదించారు. పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణానగర్‌కు చెందిన బాలిక (16) పదవ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు ఊరు వెళ్లడంతో సోదరుడితో కలిసి ఉంటోంది. ఈనెల పదో తేదీన ఉదయం ఇంట్లో పని విషయంలో సోదరుడు బాలికను మందలించాడు. అనంతరం అతను స్నానం చేసి వచ్చేలోపు బాలిక లేఖ రాసి ఇల్లు వదిలి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం సోదరుడు వెదికి చివరకు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. కానిస్టేబుల్ నాగేశ్వరరావు కృష్ణానగర్‌లో సీసీ కెమెరాలను పరిశీలించాడు. బాలిక యూసుఫ్ గూడ వైపు వెళ్లి అక్కడి నుంచి మెట్రోరైలు ఎక్కినట్టు గుర్తించారు. పోలీసులు నాగోల్ వెళ్లి అక్కడి కెమెరాలు పరిశీలించగా మెట్రో దిగినట్లు ఆనవాలు లభించలేదు. మెట్రో సిబ్బంది ద్వారా బాలిక సికింద్రాబాద్‌లో దిగినట్టు నిర్ధారించారు. వెంటనే బాలిక సోదరుడితో కలిసి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో వెతకడం మొదలు పెట్టారు. సీసీ కెమెరాలను పరిశీలించి స్టేషన్‌లోని ఏసీ వెయిటింగ్ హాల్‌లో ఉన్నట్టు గుర్తించి పట్టుకున్నారు. దాదాపు 11 గంటల పాటు శ్రమించి, సుమారు 102 సీసీ కెమెరాలు పరిశీలించి బాలిక ఆచూకీ తెలుసుకొన్నారు. తల్లిదండ్రులకు అప్పగించి శభాష్ అనిపించుకున్నారు. వేగంగా

మిగతా 6వ పేజీలో..



నిమ్స్‌లో ఏఐతో వైద్యసేవలు

● క్యూ పద్ధతికి ఇకపై స్వస్తి ● కియోస్క్‌ల ద్వారా టోకెన్ల జారీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రిలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ని ప్రవేశపెట్టేందుకు కసరత్తు జరుగుతోంది. ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో వైద్య సేవలు పూర్తిగా మారనున్నాయి. కేవలం వైద్యసేవలే కాకుండా ఏడాది సర్టిఫికెట్ కోర్సును కూడా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నారు. అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ సేవలతో పాటు, వైద్య విద్యా బోధనలో ఏఐ సేవలను వినియోగించడానికి ఆస్పత్రి పాలకవర్గం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు ఒక ఐటీ సెల్‌ను ఏర్పాటు చేసి చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ కంప్యూటర్ సైన్స్ నిపుణుడిని నియమించినట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు.

ఓపీలో క్యూ లేకుండా..

నిమ్స్ ఓపీకి వస్తే గంటల కొద్దీ క్యూలో నిలబడి ఎదురుచూడాల్సి వస్తోంది. ఏఐ సేవలు అందుబాటులోకి వస్తే క్యూపద్ధతి ఉండదు. రోగులకు టోకెన్ ఇస్తారు. వారి నంబర్ వచ్చినప్పుడు వైద్యుల వద్దకు నేరుగా వెళ్లే సదుపాయం ఉంటుంది. కియోస్క్ విధానంలో రోగులు ఎవరికి వారే తమ పేర్లను నమోదు చేసుకొని టోకెన్ తీసుకోవచ్చు. అలాగే ఓపీని ప్రత్యేక కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తారు. దీంతో ఓపీలో ఎంత మంది ఉన్నారనేది కెమెరాల ద్వారా అంచనా వేయవచ్చు. ఓపీ సంఖ్యను కూడా కెమెరాలే చెబుతాయి. దీని వల్ల వెంటనే ఓపీ రద్దీని సరిచేయడానికి అవకాశముంటుంది.

ఏడాది కోర్సు

ఏఐ వైద్యసేవలపై నిమ్స్‌లో సర్టిఫికెట్ కోర్సు ప్రవేశపెట్టనున్నారు. ఏడాది కోర్సును 'సాఫ్ట్‌వేర్ సిస్టమ్ ఇన్ మెడికల్ సిస్టమ్' పేరుతో అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులకు ఏఐ సేవలపై శిక్షణ ఇస్తారు. రోగి లైఫ్‌సైకిల్, ఆ ఆస్పత్రిలో చేరిన నాటి నుంచి వెళ్లిపోయేంత వరకు ఆయనకు సంబంధించిన అన్ని అంశాలు అందులో నిక్షిప్తం చేస్తారు.

11 గంటలు.. 102 సీసీ కెమెరాలు

(5వ పేజీ తరువాయి)

స్పందించిన నాగేశ్వరరావును ఉన్నతాధికారులు అభినందించారు.

చోరుల కోసం..

వెంకటగిరికి చెందిన ముజాహర్ ఈనెల 10వ తేదీన ఉదయం గదిలోని కిటికీ వద్ద చార్జింగ్ పెట్టిన ఐఫోన్15 మాక్స్ ప్రో, వన్‌ప్లస్ ఫోన్లు కనిపించలేదు. వాకబు చేయడంతో గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేసినట్టు తెలిసింది. వెంటనే జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. క్రైంకానిస్టేబుల్ శంకర్ రంగంలోకి దిగి, కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, ఎస్‌పీఆర్‌హిల్స్ వరకు సుమారు 34 కెమెరాలను పరిశీలించి, ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. ఎస్‌పీఆర్‌హిల్స్‌కు చెందిన డెలివరీబాయ్ అబ్దుల్‌నదీమ్, ఆటో డ్రైవర్ రఫీని అరెస్టుచేసి సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. శంకర్ పనితీరును ఉన్నతాధికారులు, బాధితులు అభినందించారు.

నేటి నుంచి జోగులాంబ స్టేషన్‌లో ఆ రైళ్లు ఆగవు

హైదరాబాద్ సిటీ: గద్వాల జిల్లాలోని శ్రీబాల బ్రహ్మేశ్వర జోగులాంబ స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల మరమ్మతుల కారణంగా వివిధ మార్గాల్లో నడిచే 10 రైళ్లకు హాల్ట్‌ను నిలిపివేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు జోగులాంబ స్టేషన్‌లో హాల్ట్ నిలిపివేస్తున్నట్లు సీపీఆర్‌ఓ శ్రీధర్ బుధవారం తెలిపారు.

మొత్తం 53 రైళ్ల రద్దు..


విజయవాడ: వరంగల్-హసన్‌పర్తి-కాజీపేట(ఎఫ్) సెక్షన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనులరీత్యా మొత్తం 53 రైళ్లను సెప్టెంబర్ 25వ తేదీ వరకు రద్దుచేశారు. అలాగే 13 రైళ్లను డైవర్షన్ చేశారు. మరో 12 రైళ్లను రూటు మార్చారు. ప్రధానంగా విజయవాడ-సికింద్రాబాద్ (12713), సికింద్రాబాద్ -విజయవాడ(12714), డోర్నకల్- విజయవాడ (07755), విజయవాడ-డోర్నకల్(07756), విజయవాడ-గుంటూరు(07464), గుంటూరు-విజయవాడ(07465) రైళ్లు పూర్తిగా రద్దు అయ్యాయి.















వరద బాధితులను ఆదుకోవడానికి మేమూ సిద్ధం

● రాజేంద్రనగర్ తాలుకా ఉద్యోగ జేఏసీ

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు తెలంగాణలో వరదలకు పలు ప్రాంతాల్లో పంటనష్టం జరిగింది. ఇళ్లు కూలిపోయాయని ఇంతటి విపత్తు జరగడం బాధాకరమని రాజేంద్రనగర్ తాలుకా ఉద్యోగ జేఏసీ పేర్కొంది. వరద బాధితులను ఆదుకోవడానికి ఒక రోజు వేతనం ఇవ్వడానికి మేమూ సిద్ధంగా ఉన్నామని జేఏసీ నాయకులు ఎం.ఏ నయీమ్, ఎం. శ్రీనివాస్ యాదవ్. ఎస్. యాదయ్య ముదిరాజ్, జి. అంజయ్య గౌడ్ తెలిపారు. బుధవారం భోజన విరామ సమయంలో రాజేంద్రనగర్ తాలుకా పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులు, విశ్వవిద్యాలయాల ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు సమావేశమయ్యారు. వరద బాధితులకు ఒకరోజు వేతనం ఇవ్వడానికి తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ సంఘాల నాయకులు తీసుకున్న నిర్ణయాయనికి తమ మద్దతు ఉంటుందని జేఏసీ నాయకులు ప్రకటించారు.

'టెలీమెడిసిన్' సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● పేట్లబురుజు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజినీరెడ్డి

చార్మినార్ సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): పేట్లబురుజు ప్రసూతి ఆస్పత్రిలో టెలీమెడిసన్ కాన్ఫరెన్స్ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ రజినీరెడ్డి చెప్పారు. త్వరలో ఆస్పత్రిలో టెలీమెడిసన్ కాన్ఫరెన్స్ కేంద్రాన్ని ప్రారంభించున్నామని ఆమె తెలిపారు. బుధవారం ఆస్పత్రిలో సూపరింటెండెంట్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ప్రసూతి ఆస్పత్రులలో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నదన్నారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తామని అన్నారు. బార్కస్, జంగం మెట్, సూరజ్‌బాన్, డబీల్‌పురా, మలక్‌పేట్, పాణిపురా పరిధిలోని మహిళలు, గర్భిణులు టెలీమెడిసన్ కాన్ఫరెన్స్ ద్వారా మహిళలు ఇంటి వద్ద ఉండే డాక్టర్లతో మాట్లాడి వైద్య సేవలు పొందవచ్చని పేర్కొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాల సంఘాల జేఏసీ నాయకులు

ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించొద్దు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్లను ఏ.బీ.సీ, డీలుగా వర్గీకరించొద్దని మాల సంఘాల జేఏసీ కోరింది. ఎస్సీ వర్గీకరణపై తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేయడానికి అనుమతి ఇవ్వాలని మాల సంఘాల జేఏసీ నాయకులు బుధవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ బి.రాములును కలసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణలో ఉన్న 50 లక్షల మాలల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించడానికి కుట్రలు జరుగుతున్నాయని, వాటిని ఎట్టి పరిస్థితిలో ఒప్పుకునేది లేదన్నారు. ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలనుకుంటే ఎస్సీ కులగణన చేసిన తర్వాతే చేపట్టాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్లను 15శాతం నుంచి 20శాతానికి పెంచాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాల సంఘాల జేఏసీ నాయకులు మంత్రి చంద్రశేఖర్, గొడుగు సంజీవ, కె. అనంతరామ్, పి. రాజు, ఎస్. పెంటయ్య, పి. నర్సింహ ఉన్నారు.


శివరాంపల్లి న్యూవీకర్ సెక్షన్ కాలనీలో ప్రభుత్వ స్థలం చూట్టూ నిర్మించిన ప్రహరీ, ఏర్పాటు చేసిన గేటు

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని, ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేస్తున్నా పట్టించుకోరా అని స్థానికులు అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శివరాంపల్లి వీకర్‌సెక్షన్ కాలనీలోని 600 గజాల ప్రభుత్వ స్థలాన్ని వార్డు కమిటీ మాజీ సభ్యుడు ఆక్రమించి, భూమిని చదును చేసి నిర్మాణం చేస్తున్నాడని మండిపడుతున్నారు. ఇదే విషయమై కార్పొరేటర్ అర్చనాజయప్రకాశ్, ఎం. ప్రభాకర్‌రెడ్డి బుధవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ బి. రాములుకు ఫిర్యాదు చేశారు. రోడ్డును కూడా కబ్జా చేశాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కబ్జా చేస్తున్న వ్యక్తి తన కుటుంబ సభ్యుల పేరుతో జీవో నంబర్ 59 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, అది కాకుండా పక్కనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలానికి కూడా అవే పత్రాలను చూపుతూ చుట్టూ గోడ నిర్మించి గేటు పెడుతున్నాడన్నాడని తహసీల్దార్‌కు వివరించారు. నిర్మాణం చేస్తున్న స్థలం, కబ్జా చేసిన వ్యక్తి వద్ద ఉన్న పత్రాలు, స్థలం హద్దులు ఒక్కటేనా అని పరిశీలించాల్సిన అవసరం ఉంది ఆని దీనిపై తహసీల్దార్ స్పందించకపోతే రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.


మురళీధర్ రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న పటేల్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కన్నయ్య, గిరీష్, మధు.

సినారె అవార్డు గ్రహీత మురళీధర్‌రెడ్డికి సత్కారం

అఫ్జల్‌గంజ్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజకవర్గంలో ఎద ప్రజలకు ఆపన్నహస్తంగా ఉంటూ.. ధార్మిక, ఆధ్యాత్మిక సేవాకార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న పద్మశ్రీ డాక్టర్ సి.నారాయణ రెడ్డి (సినారె) అవార్డు గ్రహీత, కాంగ్రెస్ నాయకులు కె.మురళీధర్ రెడ్డి సేవలు మరువలేనివని పటేల్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కన్నయ్య, గిరీష్, మధులు పేర్కొన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో మురళీధర్‌రెడ్డిని కలిసి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... కరోనా విపత్కర పరిస్థితుల్లో మురళీధర్‌రెడ్డి పేదలకు అన్ని విధాల నిత్యావసర సరుకులు, వైద్యం అందించారన్నారు. కార్యక్రమంలో జాంబాగ్ డివిజన్‌లోని పటేల్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మధు, ఉదయ్, చంటి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల రాష్ట్ర సదస్సు పోస్టర్ విడుదల

నార్సింగ్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు జీవిత భద్రత కల్పించాలంటూ ఈ నెల 25వ తేదీన హలో మత్స్యకార - ఛలో ఇబ్రహీంపట్నం సదస్సును నిర్వహించనున్నట్లు రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ బుధవారం విడుదల చేశారు. మత్స్యకారుల అభ్యున్నతికి ఎల్లప్పుడు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యసహకార సంఘం సభ్యులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నమూనా గార్డెన్‌లో డ్రైనేజీ పనుల పరిశీలన

నార్సింగ్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ మున్సిపాలిటీలోని 6వ వార్డు నమూనాగార్డెన్ కాలనీలో డ్రైనేజీ పనులను పూర్తి చేశారు. బుధవారం ఆ పనులను కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు పరిశీలించారు. ఇక నుంచి నమూనా గార్డెన్ కాలనీలో డ్రైనేజీ సమస్య ఉండదని పేర్కొన్నారు. రూ.50 లక్షలతో పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోకాపేట్ కొత్త చెరువు పరిశీలన

నార్సింగ్ సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోకాపేట్ కొత్త చెరువును చైర్మన్ ఖైలారం నాగపూర్ణా శ్రీనివాస్, కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి నిమజ్జనం పాటయింట్‌ను బుధవారం పరిశీలించారు. చుట్టుపక్కల చెత్తాచెదారం పడవేయకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. చెరువులో శానిటేషన్ పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఈఈ నరసింహరాజు ఏఈ శ్రీనివాస్, వార్డు అధికారులు మహ్మద్, మాణిక్యం, శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మైలార్‌దేవుపల్లిలో గణనాథుని దర్శించుకుంటున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్


పత్తికుంట వద్ద నిమజ్జన ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ కమిషనర్ రవికుమార్


పురానాపూల్ కార్వాన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, సదానందం గుప్తా తదితరులు


పత్తికుంట లో వినాయకులను నిమజ్జనం చేస్తున్న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్ వై.శ్రీధర్

ఐదో రోజు జోరుగా నిమజ్జనాలు

● మైలార్‌దేవుపల్లిలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ● బాలాపూర్‌లో పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి పూజలు

రాజేంద్రనగర్/చాంద్రాయణగుట్ట/పహాడిషరీఫ్ / అఫ్జల్‌గంజ్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదో రోజు రాజేంద్రనగర్ పత్తికుంటలో భక్తులు జోరుగా గణేశుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం భాగ్యనగర్ గణేశ్‌నగర్ ఉత్సవ సమితి కన్వీనర్ వై.శ్రీధర్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. పత్తికుంటచెరువు వద్ద రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందిని అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేయాలని సూచించారు. రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మైలార్‌దేవుపల్లి డివిజన్‌లో ప్రతిష్ఠించిన గణనాథులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి వేర్వేరుగా దర్శించుకుని పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.

● బాలాపూర్ గణేశుడిని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి దర్శించుకున్నారు. గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు, స్థానిక నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. పూజా కార్యక్రమం అనంతరం వేదపండితులు కార్తీక్‌రెడ్డికి తీర్థప్రసాదం అందజేశారు. వినాయకుడు అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలకు శుభాలు చేకూరాలని ప్రార్థించానని కార్తీక్‌రెడ్డి తెలిపారు.

● గోషామహల్ నియోజకవర్గంలోని బేగంబజార్ ఫిల్‌ఖానాలో ఏర్పాటు చేసిన భారీ వినాయక మండపంలో తెలంగాణ రాష్ట్ర ఫిషరీష్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ పూజలు చేశారు. జాంబాగ్‌లో భజన్‌సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో విఘ్నేశ్వరునికి గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆశీష్ కుమార్ యాదవ్ పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం చేశారు.

● పాతబస్తీ ఉప్పుగూడ అంబికానగర్‌కు చెందిన వీరబ్రహ్మేంద్ర గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులు చంద్రకాంత్ ఆధ్వర్యంలో ఆరడుగుల పేపర్ గణేశుడిని సుమారు 4 కిలోల బరువుగల విగ్రహాన్ని తయారు చేయడానికి రెండు రోజులు పట్టిందని తెలిపారు.


రైడర్ గణేశ్‌ను పూజిస్తున్న హైదరాబాద్ బైకర్స్ క్లబ్ ప్రతినిధులు

రైడర్ రూపంలో వినాయకుడు

బజ్‌రంగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ బన్సీలాల్‌నగర్‌లో రైడర్ గణేశ్ అకారంలో వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. హైదరాబాద్ బైకర్స్ క్లబ్‌లో సభ్యుడైన కిషోర్ ఆధ్వర్యంలో వినాయకుడికి రైనెక్స్ జాకెట్, పాయింట్ ధరింపచేశారు. చేతిలో హెల్మెట్‌ను పట్టుకుని ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించేలా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నిమజ్జనం రోజున వినాయకుడి చేతిలోని హెల్మెట్‌ను వేలం వేస్తామని వారు చెప్పారు.

● పురానాపూల్ కార్వాన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాడిశెట్టి సదానందం గుప్తా తదితరులు పూజలు చేశారు.

● అలియాబాద్ కాల్వగడ్డలో బంబ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి గణపతిని ప్రతిష్ఠించారు. గణపతి కేక్ కట్ చేస్తున్నట్లు, గణపతి వాహనం (ఎలుక) చప్పట్లు కొడుతూ సంబరాలు జరుపుకుంటున్నట్లు మట్టి గణపతిని ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు, బీజేపీ యువమోర్చా భాగ్యనగర్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ జైన్ గత 17 సంవత్సరాలుగా వినూత్నంగా గణేశ్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నానన్నారు.


ఉప్పుగూడలో ఏర్పాటు చేసిన పేపర్ వినాయకుడు


ఫీల్‌ఖానాలో వినాయక మండపంలో పూజలు చేస్తున్న మెట్టు సాయి కుమార్ తదితరులు

గణేష్ మండపం వద్ద రక్తదానం

మంగళ్‌హాట్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని జైఫ్రెండ్స్ అండ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, ప్రతినిధులు రాములు అన్నారు. బుధవారం గోషామహల్ నియోజకవర్గం గుఫానగర్‌లోని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ గత 23 ఏళ్లుగా గణేశుడి మండపం వద్ద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నెల 13న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శ్రీనివాస్ యాదవ్, మల్లేష్, కనకరాజు, లక్ష్మణ్, గణేష్, అసోసియేషన్ సభ్యులు, స్థానిక యువత పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు

దైవ సేవకులు, విశ్వాసులు సమస్త మానవాళి కోసం ప్రార్థనలు చేయాలి

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): దైవసేవకులు, విశ్వాసులు సమస్త మానవాళి కోసం అనుదినం ప్రార్థనలు చేయాలని రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెల్లోషిప్ కోశాధికారి, అత్తాపూర్ క్రిస్టియన్ ఫెయిత్ సెంటర్ పాస్టర్ జాలిగం పరమేశ్వర్ పాల్ సూచించారు. కాటేదాన్ ఆనంద్‌నగర్‌లోని షాలేమ్ ప్రేయర్ హౌస్‌లో పాస్టర్స్ ఫెల్లోషిప్ కార్యవర్గ సభ్యుడు పాస్టర్ పాల్ దేవరాజ్ అధ్యక్షతన ప్రార్థనయోధుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పరమేశ్వర్ పాల్ బైబిల్ సందేశాలను అందజేశారు. బైబిల్ గ్రంథంలో యోబు తన స్నేహితుల కోసం ప్రార్థన చేయగా, దేవుడైన యెహోవా.. యోబుకు రెండింతల ఆశీర్వాదాలు అనుగ్రహించాడన్నారు. కన్నీటి ప్రార్థన చేసినప్పుడు ఆయన పాపాలను క్షమిస్తాడని, దైవసేవకులు, విశ్వాసులైన వారు రోజూ ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు దేశం, దేశంలోని ప్రజల కోసం, పాలకుల కోసం ప్రార్థన చేయాలన్నారు. ఇతరుల కోసం ప్రార్థన చేసినప్పుడే వారికి దేవుడి ఆశీర్వాదాలు లభిస్తాయన్నారు. దేవుడు చేసిన గొప్ప కార్యాలను పాస్టర్ సామ్యూల్‌రాజు, పాస్టర్ జాన్ భైరోస్, పాస్టర్ డి.ఆనంద్ పాల్, పాస్టర్ శ్యాంసన్, బ్రదర్ డానియేల్, పాస్టర్ క్రిస్టోఫర్ వివరించారు. ఈ సందర్భంగా బైబిల్ సందేశాలను అందజేసిన పాస్టర్ జాలిగం పరమేశ్వర్ పాల్‌ను, రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, పాస్టర్ పాల్ దేవరాజ్, బ్రదర్ డానియేల్‌ను షాలేమ్ ప్రేయర్ హౌస్ పాస్టర్లు, రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ సన్మానించారు.


బైబిల్ సందేశాలను అందజేస్తున్న పాస్టర్ పరమేశ్వర్

'అక్కినేని' శతజయంతి వేడుకలు ప్రారంభం

రవీంద్రభారతి, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ చరిత్రలో మరువలేని పేరు అక్కినేని నాగేశ్వరరావు అని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ అన్నారు. సాంస్కృతికబంధు సారిపల్లి కొండలరావు సారథ్యంలో తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సహకారంతో యువకళావాహిని సంస్థ ఆధ్వర్యంలో డా.అక్కినేని నాగేశ్వరరరావు శతజయంతి వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డా.అక్కినేని నాగేశ్వరరావు నాటక కళా పరిషత్ 30వ తెలుగు రాష్ట్రస్థాయి నాటిక పోటీలు నిర్వహించారు. అక్కినేని శతజయంతి వేడుకలను సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అక్కినేని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నటుడిగానే కాకుండా వ్యక్తిత్వంలోనూ అక్కినేని నాగేశ్వరావు జీవితం ఆదర్శప్రాయమన్నారు. ఆయన ఏ పాత్ర పోషించినా దానికి న్యాయం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సారిపల్లి కొండలరావు, రచయిత్రి కె.వి.కృష్ణకుమారి, నాట్యగురు ప్రసన్నరాణి, లంక లక్ష్మీనారాయణ తదిరతులు పాల్గొన్నారు. నాటిక పోటీల్లో భాగంగా తొలిరోజు శ్రీషిరిడీ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారిచే మలిసంధ్య నాటిక, సిరిమువ్వ కల్చరల్స్ వారిచే హక్కు నాటిక, కెజెఆర్. కల్చరల్ అసోసియేషన్ వారిచే సాహితీసూక్తం నాటికలను ప్రదర్శించారు. చక్కటి నటనతో కళాకారులు ఆకట్టుకున్నారు.


అక్కినేని నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ అహ్మద్ కసది

అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలి

పహాడిషరీఫ్ సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని కౌన్సిలర్ అహ్మద్ కసది కాంట్రాక్టర్‌కు సూచించారు. రాయల్ కాలనీ బాలా గార్డెన్ నుంచి గుర్రం చెరువు వరకు రూ. 1.25 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను బుధవారం కౌన్సిలర్ ప్రారంభించారు. బాలాపూర్ గణేశుడిని నిమజ్జనం సందర్భంగా ఈ మార్గంలో ఊరేగింపుగా వెళ్లనుండడంతో రోడ్డు పనులను ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో సాయిద్ ఖాన్, అబ్దుల్ వాజీద్, ముసద్ కసది తదితరులు పాల్గొన్నారు

మీర్జాగూడ పంచాయతీ నార్సింగ్ పరిధిలోకి

● రికార్డులను స్వాధీనం చేసుకున్న మున్సిపల్ అధికారులు

చేవెళ్ల, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండల పరిధిలోని మీర్జాగూడ గ్రామపంచాయతీని నర్సింగి మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి మీర్జాగూడ గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. మీర్జాగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంపై పేరును తొలగించి పురపాలక కార్యాలయం నార్సింగి అని పేయింట్‌తో రాయించారు. ఇక నుంచి మీర్జాగూడ గ్రామపంచాయతీ కాదని.. నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలోకి వస్తుందన్నారు. నార్సింగి మున్సిపల్ కార్యాలయం అధికారులు పర్యవేక్షిస్తారని కమిషనర్ స్పష్టం చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖైరతాబాద్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ సురేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పబ్లిక్‌గార్డెన్ వద్ద బుధవారం ఉదయం ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. వారు వెళ్లి చూడగా వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. ఆచూకీ తెలియకపోవడంతో మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. వయస్సు 45 నుంచి 50 సంవత్సరాలు ఉంటుందని, యాష్ కలర్ టీషర్ట్, నీలి రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

నేడు అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూలు

● హుసేనిఆలం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో

మదీన, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): హుసేనిఆలం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ అపియ చిన్నమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఎకానమిక్స్ (ఉర్దూ మీడియం)-1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఇంగ్లిష్ మీడియం)-1, బయోటెక్నాలజీ (ఇంగ్లిష్ మీడియం)-1, కంప్యూటర్‌సైన్స్ అండ్ అప్లికేషన్స్ (ఇంగ్లిష్ మీడియం)-3, జువాలజీ (ఇంగ్లిష్ మీడియం)-2 పోస్టులు ఖాళీలున్నాయని తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులు, ఎస్సీ ఎస్టీలకు 50శాతం మార్కులు ఉండాలని తెలిపారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగినవారికి, బోధనానుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు.

పార్క్ చేసిన వాహనాలే లక్ష్యంగా చోరీలు

● మూడు కమిషనరేట్ల పరిధిలో 59 వాహనాలు దొంగతనం

● నిందితుడితో పాటు ఇద్దరు రిసీవర్ల అరెస్ట్

బేగంపేట, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్, బస్టాండ్, మెట్రో పార్కింగ్ ప్రాంతాలలో పార్క్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న కరుడుగట్టిన దొంగ రాయుడు చైతన్యసాయికుమార్(33), ఇద్దరు రిసీవర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 59 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో నార్త్‌జోన్ డీసీపీ ఎస్.రష్మీ పెరుమాళ్ వివరాలు వెల్లడించారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని పాల్వంచకు చెందిన రాయుడు చైతన్యసాయికుమార్ పాలిటెక్నిక్ చదువుతూ మధ్యలోనే ఆపేశాడు. ఉపాధికోసం నగరానికి వచ్చి పలు ప్రైవేట్ సంస్థల్లో పనిచేశాడు. విలాసాలకు అలవాటు పడిన సాయికుమార్ సక్రమంగా విధులకు రాకపోవడంతో తొలగించారు. సులవుగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో వాహనాల చోరీలు ప్రారంభించాడు. మెట్రో, రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో పార్క్ చేసిన ద్విచక్రవాహనాల హ్యాండిల్ విరగొట్టి, తన వద్ద ఉన్న మరో తాళంతో తీసి చోరీ చేస్తున్నాడు. దొంగిలించిన వాహనాల వివరాలను రిసీవర్లకు పంపేవాడు. గతంలో నగరంలోని ఉప్పల్, మాదాపూర్, చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 27 వాహనాలను చోరీ చేసిన కేసులో ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ఇటీవల జైలు నుంచి విడుదలైన సాయికుమార్ మళ్లీ చోరీల బాటపట్టాడు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 17, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 18, రాచకొండ పరిధిలో 19 ద్విచక్రవాహనాలను చోరీ చేశాడు. ఓ చోరీ కేసులో బేగంపేట పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తుండగా పార్కింగ్ ప్రాంతంలో వాహనాన్ని చోరీ చేస్తూ సాయికుమార్ కనిపించాడు. దీంతో సాయికుమార్‌పై నిఘా పెట్టి పట్టుకున్నారు. సాయికుమార్‌తోపాటు ఇతడి వద్ద వాహనాలను కొనుగోలు చేస్తున్న కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గుండుగులపల్లికి చెందిన ఎం.జగదీష్(28), ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కందుకూరు గ్రామానికి చెందిన కుంచాల హరికృష్ణ(25)ను అరెస్టు చేశారు. దొంగలను పట్టుకోవడంతోపాటు 59 ద్విచక్రవాహనాలను రికవరీ చేసిన బేగంపేట పోలీసులకు డీసీపీ రష్మీ పెరుమాళ్ నగదు పారితోషకాన్ని ఇవ్వడంతో పాటు అభినందించారు.

'డెంగీ ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి'

పహాడీషరీఫ్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): జ్వరంతో ఇద్దరు చిన్నారులు మృతిచెందినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో కూడా బస్తీలో పలువురు డెంగీతో మృతి చెందారని వారు ఆందోళన చెందుతున్నారు. వైద్య మున్సిపాలిటీ అధికారులు చొరవ తీసుకొని డెంగీ ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కర్నాటక బీదర్ ప్రాంతానికి చెందిన యూసుఫ్ షా పదేళ్ల క్రితం కుటుంబంతో కలిసి నగరానికి వచ్చి జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని వాదీ-ఏ-ముస్తాఫా బస్తీలో నివాసం ఉంటున్నాడు. అతడి కుమార్తె షాజియా షా, కుమారుడు అజాన్‌షా స్థానికంగా ప్రైవేట్ స్కూల్‌లో చదువుకుంటున్నారు. పది రోజులుగా ఇద్దరు జ్వరంతో బాధపడుతున్నారు. ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో సోమవారం కుమార్తె మృతిచెందింది. బీదర్ తీసుకెళ్లి బాలికకు అంత్యక్రియలు పూర్తిచేశారు. మంగళవారం కుమారుడు అజాన్‌షాకు తీవ్రంగా జ్వరం రావడంతో అక్కడి అస్పత్రికి తీసుకెళ్తుండగా మృతిచెందాడు. తల్లిదండ్రులు జర్వంతో అక్కడ ఆస్పత్రిలో చేరారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చార్మినార్ సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనది. నయాపూల్ వద్ద ఓ వృద్ధుడు మృతిచెంది ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. చార్మినార్ ఎస్ఐ చంద్రశేఖర్ నయాపూల్ సర్గం ఫుట్‌వేర్ వద్దకు వెళ్లి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చ్యురీకి తరలించారు. మృతుడి సంబంధికులు చార్మినార్ పోలీసులను సంప్రదించాలన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ. 5,100 జరిమానా విధిస్తూ పదమూడో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం. వాణి తీర్పునిచ్చారు. పీపీ మంజుల కథనం ప్రకారం.. డీఆర్‌డీఓలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఋషిశర్మ రాజేంద్రనగర్‌లో ఉంటున్న ఓ మహిళ పరిచయం కావడంతో తరచూ వాళ్ల ఇంటికి వచ్చి వెళ్తుండేవాడు. ఒక రోజు మహిళ ఇంట్లో లేని సమయంలో ఆమె కుమార్తెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆ యువతి గర్భం దాల్చింది. దీంతో ఆ యువతి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సాక్ష్యాధారాలతో నిందితుడిని కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ. 5,100లు జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

బైక్ ఢీకొని స్వీపర్‌కు గాయాలు

కార్వాన్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో స్వీపర్‌కు గాయాలయ్యాయి. గోల్కొండ మున్సిపల్ కార్యాలయంలో తోకటి యాదయ్య స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం లక్ష్మీనగర్ వద్ద విధులు నిర్వహిస్తుండగా మైనర్ బాలుడు ద్విచక్ర వాహనంతోవచ్చి ఢీకొట్టాడు. గమనించిన స్థానికులు గాయపడిన యాదయ్యను ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న గుడిమల్కాపూర్ పోలీసులు మైనర్ బాలుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిల్లర్ జాకెట్ మీదపడడంతో మహిళ మృతి

నార్సింగ్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి మిల్లర్ జాకెట్(ఇనుప బకెట్) జారి పడిన ఘటన మహిళ మృతిచెందింది. పోలీసులు కథనం ప్రకారం.. శివలక్ష్మి(51)జీహెచ్ఎంసీలో మున్సిపల్ వర్కర్‌గా పనిచేస్తుంది. బుధవారం ఆమె ఇంటి పక్కన నిలిచి ఉండగా, ఇంటిపక్కన నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి మిల్లర్ జాకెట్ ప్రమాదవశాత్తు జారిపడింది. దీంతో ఆమె తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నార్సింగ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో నేడు

- తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సాయంత్రం 6 గంటలకు డా.అక్కినేని నాగేశ్వరావు నాటక కళాపరిషత్ 30వ తెలుగురాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం
- భాగ్యనగర గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం

గవర్నర్‌తో భారత ఏరోనాటికల్ సొసైటీ అధ్యక్షుడి భేటీ



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో భారత ఏరోనాటికల్ సొసైటీ అధ్యక్షుడు, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి భేటీ అయ్యారు. రాజ్‌భవన్‌లో బుధవారం గవర్నర్‌ను కలిసిన సతీష్‌రెడ్డి ఏరోనాటిక్స్, తెలంగాణలో స్పేస్ అండ్ డిఫెన్స్ టెక్నాలజీ అభివృద్ధితో పాటు ఇతర కీలక అంశాలపై చర్చించారు.

ఫ్లైఓవర్ అలైన్‌మెంట్‌పై 'మెట్రో'తో సమన్వయం చేసుకోవాలి



కమిషనర్ ఆమ్రపాలికి ఫ్లైఓవర్ల ప్రతిపాదనలను వివరిస్తున్న సీఈ (ప్రాజెక్ట్స్) దేవానంద్

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): ఫ్లైఓవర్ అలైన్‌మెంట్‌కు సంబంధించి హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి సూచించారు. ఎల్‌బీనగర్ జోన్‌లో హెచ్-సిటీలో భాగంగా చేపట్టనున్న పనుల ప్రతిపాదనలను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అల్కాపురి జంక్షన్ ఫ్లైఓవర్, టీకేఆర్ జంక్షన్ నుంచి గాయత్రీనగర్, మందమల్లమ్మ జంక్షన్ వరకు చేపట్టనున్న ఫ్లైఓవర్ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను జీహెచ్‌ఎంసీ (ప్రాజెక్ట్స్) సీఈ దేవానంద్ కమిషనర్‌కు వివరించారు. అనంతరం ఎల్‌బీనగర్ జంక్షన్‌ను సందర్శించి ఫ్రీ లెఫ్ట్‌కు అవసరమైన భూసేకరణ చేసేందుకు టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్ అధికారులు సమన్వయంతో తగుచర్యలు తీసుకోవాలని ఇంజనీర్లను కమిషనర్ ఆదేశించారు. బైరామల్‌గూడ ఆర్‌హెచ్‌ఎస్ లూప్‌ను పరిశీలించి సపరేట్ గ్రేడ్ రోడ్ వర్క్ నుంచి బైరామల్‌గూడ ఆర్‌హెచ్‌ఎస్ లూప్ పూర్తి కావడానికి, ఆస్తుల సేకరణ వేగంగా పూర్తి చేయడానికి టౌన్‌ప్లానింగ్ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. కమిషనర్ వెంట ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్‌పాటిల్, ప్రాజెక్ట్స్ సీఈ దేవానంద్, ఎస్‌ఈ రోహిణి, తదితరులు ఉన్నారు.

14 నుంచి భారత్‌గౌరవ్ రైలు 'సప్త జ్యోతిర్లింగ దర్శనయాత్ర'

హైదరాబాద్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): పశ్చిమ, ఉత్తర భారతదేశంలోని ఏడు ప్రముఖ జ్యోతిర్లింగాలను దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల భక్తుల కోసం 'సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర' భారత్ గౌరవ్‌టూరిస్టు రైలును నడుపుతున్నట్టు ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) అధికారులు తెలిపారు. ఈ నెల 14న విజయవాడ నుంచి బయలుదేరే భారత్‌గౌరవ్ రైలు 25వ తేదీ వరకు 12 రోజుల్లో యాత్ర ముగించుకుని తిరిగి గమ్యస్థానానికి చేరుకుంటుందని వివరించారు. ఈ రైలులో వెళ్లే భక్తులు ఉజ్జయినిలో మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, ద్వారకలో నాగేశ్వర్, సోమనాథ్‌లో సోమనాథుడు, పూణేలో భీమశంకర్, నాసిక్‌లో త్రయంబకేశ్వరున్ని, ఔరంగాబాద్‌లో గ్రీష్ణేశ్వరుడిని దర్శనం చేసుకునేందుకు అనువుగా ప్యాకేజీ టూర్‌ను రూపొందించినట్టు తెలిపారు. విజయవాడ నుంచి బయలుదేరనున్న భారత్ గౌరవ్ టూరిస్టు రైలు మధిర, ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్, వరంగల్, కాజీపేట, జనగాం, భువనగిరి, సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, మహారాష్ట్రలోని ధర్మాబాద్, ముద్ఖేడ్ నాందేడ్, పూర్ణ స్టేషన్‌లలో వెళ్లి వచ్చేప్పుడు ఆగుతుందని తెలిపారు. యాత్రికులకు వసతి సౌకర్యం, భోజనం ఏర్పాట్లు టూర్ ప్యాకేజీలోనే అందిస్తున్నట్టు ఐఆర్‌సీటీసీ అధికారులు పేర్కొన్నారు. యాత్రికులకు ఒకొక్కరికి కేటగిరి వారీగా 1. ఎకానమీ(ఎస్‌ఎల్) రూ.20,590, 2. స్టాండర్డ్(3 ఏసీ)రూ.33,015, 3. కంఫర్ట్ (2 ఏసీ)రూ.43,355లు చార్జీలు ఖరారు చేసినట్టు పేర్కొన్నారు.

చెస్ ఛాంపియన్ సంహితకు సన్మానం



సంహితను సన్మానిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): శ్రీలంకలో గత వారం ముగిసిన కామన్వెల్త్ చెస్ టోర్నమెంట్‌లో మూడు పతకాలు నెగ్గిన హైదరాబాద్ క్రీడాకారిణి సంహితను శాట్ చైర్మన్ శివసేనారెడ్డి సత్కరించారు. బుధవారం ఎల్బీ స్టేడియంలో చైర్మన్ కార్యాలయంలో శివసేనారెడ్డిని రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ శివప్రసాద్‌తో పాటు సంహిత మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా కామన్వెల్త్ పోటీల్లో బ్లిట్జ్‌లో స్వర్ణం, ర్యాపిడ్, క్లాసికల్‌లో సాధించిన కాంస్య పతకాలను శివసేనారెడ్డికి సంహిత చూపించింది. మహిళ గ్రాండ్‌మాస్టర్ కావాలనేది తన కల అని శివసేనారెడ్డికి సంహిత తెలిపింది. చెస్‌లో సంహిత మరింత రాణించడానికి ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని సంహితకు శివసేనారెడ్డి భరోసా ఇచ్చారు. శాట్ వీసీ ఎండీ సోనీ బాలదేవి వెంట ఉన్నారు.

ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి గుండెపోటుకు గురి కావడంతో డ్రైవర్, కండక్టర్‌లు అప్రమత్తమై ప్రాణాలు కాపాడారు. సిబ్బంది చొరవతో ప్రాణాలు నిలిచినందున యాజమాన్యం వారిని అభినందిస్తూ సన్మానం చేసింది. నిర్మల్ జిల్లా భైంసా డిపో బస్సు ఈనెల 9న భైంసా నుంచి నిర్మల్ వెళ్తోంది. ఆ సమయంలో అందులో ప్రయాణిస్తున్న 12 ఏళ్ల విద్యార్థి కిరణ్‌కు గుండెపోటు వచ్చింది. బస్సు ఆపి విద్యార్థికి ప్రాథమిక చికిత్స అందించారు. వెంటనే సమీపంలోని నర్సాపూర్ పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు చికిత్స అందించడంతో కిరణ్ ఆరోగ్యం కుదుటపడింది. సకాలంలో తీసుకురావడం వల్లే ప్రాణాలు నిలిచాయని డ్రైవర్, కండక్టర్‌లను అభినందించారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు డ్రైవర్ బి.గంగాధర్, కండక్టర్ జి.గంగాధర్‌లను హైదరాబాద్‌కు పిలిపించి బుధవారం బస్ భవన్‌లో సన్మానించారు. సమయ స్ఫూర్తితో వ్యవహరించినందుకు అభినందించారు.

పీడీఎస్‌యూ 50 వసంతాల లోగో ఆవిష్కరణ



పీడీఎస్‌యూ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా లోగో ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకట దాస్, పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ రామకృష్ణ, జాతీయ నాయకులు విజయ్‌ఖన్నా, సాంబ, రఫీ, కిరణ్‌కుమార్, అప్పారావు, సరళ తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి)

మార్కెట్లో మేకిన్ తెలంగాణ ఉత్పత్తులుండాలి

● మంత్రి శ్రీధర్ బాబు



సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఉత్పాదక రంగంలో అగ్రగామిలా నిలిపేలా 'మేక్ ఇన్ తెలంగాణ' భావనను పెంపొందించాల్సిన అవసరం ఉందని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. దేశీయ మార్కెట్లో మేకిన్ తెలంగాణ ఉత్పత్తులుండాలని, తెలంగాణ ఉత్పత్తులకు ఆదరణ ఉండేలా నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. బుధవారం నగరంలో నిర్వహించిన క్వాలిటీసర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ 38వ వార్షిక సదస్సును ప్రారంభించిన అనంతరం మంత్రి ప్రసంగించారు. పరిమాణంపైనే కాకుండా నాణ్యతకు ప్రాధాన్యతనిస్తే దేశమంతా మనవైపు చూస్తుందని అన్నారు. కృత్రిమ మేధ వినియోగంపై ఉద్యోగులు, కార్మికులు, పరిశ్రమ ప్రతినిధులకు అవగాహన కల్పిస్తామని మంత్రి వెల్లడించారు. క్యాంపస్ టు కార్పొరేట్ అనే మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించడం ప్రశంసనీయమని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. క్వాలిటీ సర్కిల్ శిక్షణ కార్యక్రమాలకు సహకరించిన ఈసీఐఎల్, ఎన్‌ఎండీసీ, ఆర్టీసీ, థర్మోపాడ్స్, థర్మోకేబుల్స్, ఉషా ఇంటర్నేషనల్, టాటా గ్రూప్, రేణుకా ప్లాస్టిక్, తోషిబా, రామ్ కో, కేసీపి సిమెంట్స్, హెచ్ఏఎల్, మిధాని, బీఈఎల్ సంస్థలకు మంత్రి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ బాలకృష్ణారావు, హన్మంతరావు తదితరులు ప్రసంగించారు. దవ్, భరత్‌కుమార్, రాజ్‌కుమార్, పగిళ్ల సతీష్, కరుణశ్రీ పాల్గొన్నారు.

కాలేజీ హాస్టళ్లకు, గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలి


● ఆర్.కృష్ణయ్య



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, గుజ్జ కృష్ణ, జిల్లపల్లి అంజి తదితరులు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 300 కాలేజీ హాస్టళ్లకు, 300 గురుకుల పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం పక్కా భవనాలు నిర్మించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు, అద్దె భవనాల్లో కనీస సదుపాయాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం చెల్లిస్తున్న రూ.770 కోట్ల అద్దెలతో పక్కా భవనాలు నిర్మించవచ్చని ఆయన సూచించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి ఆధ్వర్యంలో బీసీ సంఘాల రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను రూ.1500 నుంచి రూ.3వేలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కులగణన నెలరోజుల్లో పూర్తి చేసి స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచి ఎన్నికలు నిర్వహించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ అందరికీ విద్యతోనే అసమానతలు లేని తెలంగాణ నిర్మాణం జరుగుతుందని అన్నారు. హాస్టళ్లలో అన్ని సౌకర్యాలు కల్పించి నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ కులగణనతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. నెలరోజుల్లో కులగణన చేపట్టి నివేదిక రూపొందిస్తే బీసీలకు న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నేతలు గుజ్జ సత్యం, నీల వెంకటేష్, మల్లేష్ యాదవ్, భరత్‌కుమార్, రాజ్‌కుమార్, పగిళ్ల సతీష్, కరుణశ్రీ పాల్గొన్నారు.

బీసీల సమగ్ర కుటుంబ సర్వే జరపాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ ఈశ్వరయ్య, వద్దిరాజు రవిచంద్ర, కె.కేశవరావు, జూలూరి గౌరీశంకర్, ప్రొఫెసర్ లక్ష్మణ్ తదితరులు

పంజాగుట్ట, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): బీసీ కులాలకు సంబంధించిన సమగ్ర కుటుంబ సర్వే జరపాలని వక్తలు డిమాండ్ చేశారు. కులగణన ఉద్యమాన్ని బీఆర్ఎస్ తన భుజస్కంధాలపై వేసుకుంటే ఆ పార్టీకి పూర్వవైభవం వస్తుందన్నారు. ప్రొఫెసర్ జి.లక్ష్మణ్ రాసిన కులగణన, రిజర్వేషన్లు- శాస్త్రీయ అవగాహన పుస్తకావిష్కరణ బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, జూలూరి గౌరీశంకర్ తదితరులతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ బీసీలకు అన్ని రంగాల్లో సమ భాగస్వామ్యం ఉండాలని అన్నారు. బీసీలు చైతన్యంతో హక్కులను సాధించుకోవాలని ఆయన సూచించారు. రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ బీసీలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో అనుభవిస్తున్న బాధలు, నైరాశ్యం, కష్టాలను ప్రొఫెసర్ లక్ష్మణ్ తన పుస్తకంలో చక్కగా విశ్లేషించారన్నారు. బీసీల సమస్యల పరిష్కారానికి బీసీ బిడ్డగా పార్లమెంటులో కొట్లాడుతానని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ కె.కేశవరావు మాట్లాడుతూ తమ వాటా ఇవ్వాలని అడగనంత వరకు బీసీలు ఇదే స్థితిలో కొనసాగుతారని అన్నారు. సామాజిక ఉద్యమకారుడు రౌతు కనకయ్య అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో పుస్తక రచయిత ప్రొఫెసర్ లక్ష్మణ్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు దేవళ్ల సమ్మయ్య, ఆకుల రజిత్, సీనియర్ జర్నలిస్టు దుర్గం రవీందర్, వనమాల చంద్రశేఖర్, ఉస్మానియా అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డి.మనోహర్ పాల్గొన్నారు.

అడవుల పరిరక్షకులు ఆదివాసీలే

- అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య
- అటవీ అమరవీరులకు ఘన నివాళి



నెహ్రూపార్కు అమరుల స్మారక చిహ్నం వద్ద నివాళులర్పిస్తున్న అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య

మదీన, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు, అడవులకు అవినాభావ సంబంధం ఉందని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. అటవీ అమరుల సంస్మరణ దినం సందర్భంగా నెహ్రూ జూలాజికల్ పార్కు అమరుల స్మారక స్థూపం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరయ్య ముఖ్య అతిథిగా పాల్గొని అటవీ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభలో సీఎం రేవంత్‌రెడ్డి, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖల సందేశాలను చదివి విన్పించారు. అనంతరం పొదెం వీరయ్య మాట్లాడుతూ అడవుల పరిరక్షణ కోసం విధుల్లో మరణించిన అటవీ సిబ్బంది త్యాగాలు మరువకూడదన్నారు. అడవుల సంరక్షణ కోసం వారు చేసిన త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని అటవీ శాఖ సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలన్నారు. రాష్ట్ర అటవీ దళాల ప్రధాన సంరక్షణాధికారి ఆర్.ఎం.డోబ్రియల్ మాట్లాడుతూ 1984 నుంచి నేటి వరకు విధులు నిర్వహిస్తూ విధుల్లో ప్రాణాలు కోల్పోయిన 22 మంది సిబ్బంది త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమం ద్వారా ఈ ఏడాది 20కోట్ల మొక్కలను నాటాలనే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్(వైల్డ్ లైఫ్ చీఫ్) ఈలుసింగ్ మీరు, పీసీసీఎఫ్ సువర్ణ, రాంబాబు ఇతర అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



రెడ్‌షర్ట్ కవాతు నిర్వహిస్తున్న వలంటీర్లు

కవాడిగూడ, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విలీన దినోత్సవాన్ని సెప్టెంబర్ 17న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న మగ్దూం మొహియుద్దీన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ట్యాంక్‌బండ్ మీదుగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు రెడ్‌షర్ట్ వలంటీర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఫలితంగానే హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమయ్యిందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో విలీన దినోత్సవ వేడుకలను అక్కడి ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తున్నాయని, తెలంగాణలో మాత్రం పాలకులు ఎంఐఎంకు భయపడి అధికారికంగా నిర్వహించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఆంజయ్య నాయక్, ప్రజానాట్య మండలి అధ్యక్షులు కె.శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కాంతయ్య, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు పడాల నళిని, ఎన్.శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, సలీమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీఓ కాలనీలో రేవ్‌పార్టీ

(5వ పేజీ తరువాయి)

ఎం. కీర్తి, యశోధలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 40 గ్రాముల గంజాయి, పలు రకాల మద్యం బాటిళ్లు, 11 హుక్కా, వినియోగించే పాట్స్, ఆరు ఓసీబీ పేపర్స్ స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వీరపనేని వరుణ్ ధూల్‌పేట్ నుంచి 50 గ్రాముల గంజాయి కొని తెచ్చినట్లు తెలిసింది. ఆదిత్య అతని మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ఆ ఇంట్లో అద్దెకు ఉంటూ ఈ పార్టీ నిర్వహించినట్లు నిందితులు తెలిపారు. వారిలో ఇద్దరు సినిమాల్లో జూనియర్ ఆర్టిస్టులుగా పనిచేస్తున్నారు. కాగా, పరీక్షలో కె.ఆదిత్య, వీరపనేని వరుణ్, గొర్తి సాయి ప్రవీణ్ గంజాయి తీసుకున్నట్లు తేలడంతో వారిపై ఎన్‌డీపీఎస్ యాక్టు కింద కేసు నమోదు చేసి, మిగతా వారిపై న్యూసెన్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైళ్లు ఖాళీలేవమ్మా..!!

- దసరా, దీపావళి ప్రయాణాలకు సీట్లు, బెర్తులు ఫుల్
- ప్రధాన రైళ్లలో ఏసీ తరగతులకు 'నోరూమ్'
- స్లీపర్ క్లాస్‌లో 100కు పైనే వెయిటింగ్ లిస్ట్
- ఏపీ వెళ్లే ప్రయాణికులకు పాట్లే ● ప్రత్యేక రైళ్లపైనే ఆశలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): పండుగకు ఎప్పుడు వస్తున్నావ్ నాన్నా..?? ఏమో తెలియదు.. రైళ్లు ఖాళీలేవమ్మా... దసరా, దీపావళి పండగలు సమీపిస్తుండడంతో హైదరాబాద్ నుంచి స్వస్థలాలకు వెళ్లే ఆలోచనలో ఉన్న వారు తమ కుటుంబసభ్యులతో జరుపుతున్న సంభాషణ ఇదే. మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారి పరిస్థితి ఇది. ఆయా పండుగలకు ఇంకా చాలా రోజులు ఉన్నా.. అక్టోబరు నెలలో హైదరాబాద్ నుంచి బయలుదేరే ముఖ్యమైన రైళ్లలో బెర్తులన్నీ ఇప్పటికే నిండిపోయాయి. ఈ ఏడాది అక్టోబరు 12న దసరా పండుగ కాగా, నవంబరు 1న దీపావళి ఉంది. ఆయా పండగల సందర్భంగా నగరవాసులు పెద్ద సంఖ్యలో తమ స్వస్థలాలకు వెళుతుంటారు. అయితే, హైదరాబాద్ నుంచి విజయవాడ, విశాఖపట్నం, తిరుపతితోపాటు కోల్‌కతా, భువనేశ్వర్, గోరఖ్‌పూర్, జైపూర్, అహ్మదాబాద్ నగరాలకు వెళ్లే రైళ్లన్నీ ఇప్పటికే నిండిపోయాయి. హౌరా వైపు వెళ్లే ఈస్ట్‌కోస్ట్, ఫలక్‌నుమా వంటి రైళ్లతోపాటు వందేభారత్ రైళ్లలోనూ సీటు దొరికే పరిస్థితి లేదు. పండుగ తేదీలకు వారం రోజుల ముందు నుంచే దాదాపు అన్నిరైళ్లలో రిజర్వేషన్ 'నోరూమ్' స్టేటస్ కనిపిస్తుంది. కోణార్క్, జన్మభూమి, ఈస్ట్‌కోస్ట్, ఫలక్‌నుమా, గోదావరి, దురంతో, గరీబ్‌రథ్, విశాఖ, కృష్ణా, శబరి, నారాయణాద్రి, వెంకటాద్రి తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్లీపర్‌క్లాస్, సెకండ్‌క్లాస్ రిజర్వేషన్‌లో 100కు పైగా వెయిటింగ్ లిస్ట్ కనిపిస్తోంది. ఏసీ తరగతుల్లోనైతే రిగ్రెట్(నోరూమ్) స్టేటస్ దర్శనమిస్తోంది. దీంతో దూర ప్రాంత ప్రయాణికులు ప్రత్యేక రైళ్లపైనే ఆశలు పెట్టుకున్నారు. పండగ రద్దీ దృష్ట్యా అక్టోబరులో 400కు పైగా ప్రత్యేక రైళ్లు నడుపుతామని రైల్వే అధికారులు ఇప్పటికే ప్రకటించారు. అయితే, ప్రత్యేక రైళ్లను ఉత్తరాది రాష్ట్రాల వైపే అధికంగా కేటాయిస్తున్నారని ప్రయాణికుల నుంచి ఆరోపణలున్నాయి. చెన్నై, బెంగళూరు, తిరువనంతపురం రూట్లలోనూ ప్రత్యేక రైళ్లు నడపాలని డిమాండ్లు ఉన్నాయి.

గణనాథుడి నిమజ్జనం



జూబ్లీహిల్స్‌లోని 'ఆంధ్రజ్యోతి' ప్రధాన కార్యాలయంలో ప్రతిష్ఠించిన గణేశుడి విగ్రహాన్ని బుధవారం మల్కం చెరువులో నిమజ్జనం చేశారు. నిమజ్జనానికి తరలిస్తున్న సిబ్బందిని చిత్రంలో చూడవచ్చు.

నిమజ్జన వేడుకల్లో అల్లరిమూకలపై చర్యలు తీసుకోవాలి

● హైదరాబాద్ సీపీకి ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ

మంగళ్‌హాట్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జనం సమయంలో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ రాశారు. ఈ సందర్భంగా మంగళ్‌హాట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత నిమజ్జన సమయంలో కొంతమంది మద్యం తాగి అసభ్యకరంగా ప్రవర్తించారని, సోషల్ మీడియాలో ఆ వీడియోలు వైరల్ అయ్యాయని మళ్లీ అలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భక్తి భావంతో నిమజ్జన వేడుకల్లో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

మొరాయించిన హెచ్‌ఎండీఏ వెబ్ సైట్

● సాంకేతిక లోపం సరిచేసి పునరుద్ధరణ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగర అభివృద్ధి అథారిటీ (హెచ్‌ఎండీఏ)లో బుధవారం ఆన్‌లైన్ సేవలకు అంతరాయం కలిగింది. బుధవారం హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువులకు సంబంధించిన వివరాల పేజీ ఓపెన్ కాలేదు. చెరువుల ప్రిలిమినరీ నోటిఫికేషన్ ఆధారంగా ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ తెలుసుకోవడం కోసం చాలామంది ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల వెబ్‌పేజీపై ఒత్తిడి పెరగడం.. సరికొత్త వివరాలు పొందుపరిచే ప్రక్రియ సాగుతుండగా సాంకేతిక సమస్య తలెత్తినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్ మొరాయించింది. దీంతో అధికారులు, ఉద్యోగులు ఆన్‌లైన్ ద్వారా సేవలను అందించలేకపోయారు. కంప్యూటర్‌లను షట్‌డౌన్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. డీపీఎంఎస్‌లో భవన, లేఅవుట్ అనుమతుల, ల్యాండ్ యూజ్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ నిలిచింది. బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు పరిధిలో ఆన్‌లైన్ బుకింగ్ ప్రక్రియ నిలిచింది. అదేవిధంగా ఎల్‌ఆర్‌ఎస్ దస్త్రాలను పరిశీలించే ప్రక్రియ కూడా ఆగిపోయింది. అయితే, సాంకేతిక సమస్యపై హెచ్‌ఎండీఏ ఐటీ విభాగం అప్రమత్తమైంది. సాయంత్రానికి హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌ను తిరిగి పునరుద్ధరించారు. చెరువులకు సంబంధించిన వివరాల పేజీని కూడా అందుబాటులోకి తెచ్చింది.

పబ్లిక్ గార్డెన్ పార్కును సంరక్షించండి: హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి పబ్లిక్‌గార్డెన్‌లోని పార్కును సంరక్షించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. పబ్లిక్ గార్డెన్ పార్కు స్థలాన్ని ప్రభుత్వం, దాని ఏజెన్సీలు వివిధ అవసరాలకు వినియోగించుకుంటూ విస్తీర్ణం తగ్గిస్తున్నాయని.. నర్సరీ సహా ఇతర అవసరాలకు కేటాయించకుండా అడ్డుకోవాలని కోరుతూ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదిస్తూ నర్సరీ ఏర్పాటు వంటి ప్రణాళికలను ఉపసంహరించుకున్నామని.. ప్రభుత్వం అన్నివిధాలుగా పబ్లిక్‌గార్డెన్‌ను రక్షిస్తోందని.. హార్టికల్చర్ శాఖ దానిని నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. వాదనలు విన్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం.. పబ్లిక్ గార్డెన్‌ను రక్షించడంతోపాటు మరింత గ్రీనరీని అభివృద్ధి చేయాలని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టేసింది.

ఇబాదత్‌ఖానాలోకి అక్బరీశాఖ మహిళలకు అనుమతి

● ఇరుపక్షాల అంగీకారంతో పిటిషన్‌ను ముగించిన హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీ దారుల్‌షిఫాలోని ఆధ్యాత్మిక కేంద్రం ఇబాదత్‌ఖానాలోకి షియాముస్లిం అక్బరీశాఖకు చెందిన మహిళలను అనుమతిస్తున్నట్లు ముతవల్లీ కమిటీ పేర్కొంది. ముతవల్లీ కమిటీ ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు నిర్వహించుకోవాలని పేర్కొంది. దీనికి షియాముస్లిం అక్బరీశాఖకు సంబంధించిన అంజుమనే అల్వీ సంస్థ అంగీకారం తెలిపింది. ఇరువర్గాల పరస్పరం సంసిద్ధత వ్యక్తం చేయడంతో ఈ వివాదాన్ని ముగిస్తున్నట్లు హైకోర్టు పేర్కొంది.

భారత్‌లో స్థిరంగా పెరుగుతున్న లింఫోమా కేసులు

● డాక్టర్ గణేష్ జైషేత్వార్



మాట్లాడుతున్న డాక్టర్ గణేష్ జైషేత్వార్

అమీర్‌పేట, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): భారత్‌లో రక్త క్యాన్సర్‌లలో అత్యంత సాధారణమైన లింఫోమా కేసులు స్థిరంగా పెరుగుతున్నాయని, ఆధునిక చికిత్సా మార్గాలు చాలా అవసరమని యశోద హాస్పిటల్స్ హెమటాలజీ, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ విభాగం హెడ్ డాక్టర్ గణేష్ జైషేత్వార్ అన్నారు. వరల్డ్ లింఫోమా డేను పురస్కరించుకుని అమీర్‌పేటలోని హోటల్ గ్రీన్‌పార్క్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో డిఫ్యూజ్ లార్జ్ బి-సెల్ లింఫోమా (డీఎల్బీసీఎల్) ఏటా దాదాపు 25వేల కొత్త కేసులకు కారణమవుతుందన్నారు. ప్రాథమిక చికిత్స తర్వాత కూడా 40శాతం మంది డీఎల్బీసీఎల్ రోగులలో వ్యాధి పునరావృతం అవుతుందన్నారు. కాగా, 20 సంవత్సరాల్లో డీఎల్బీసీఎల్ ఫస్ట్‌లైన్ చికిత్స మళ్లీ అందుబాటులోకి వచ్చిందన్నారు. దీనిని ఎఫ్డీఏ అమోదించిందని, దీంతో కొత్త ఆశలు చిగురిస్తున్నాయని ఆయన తెలిపారు. అనంతరం బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ కన్సల్టెంట్ మెడికల్ అంకాలజిస్ట్, బీఎంటీ వైద్యుడు డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ పోలాటుజుమాబ్ వంటి కొత్త చికిత్సలు వ్యాధి నివారణకు ప్రత్యేకంగా రూపొందించ బడ్డాయన్నారు. కొత్తగా రోగ నిర్ధారణ చేయబడిన రోగులకు తీవ్ర ప్రమాదంలో ఉన్న వారికి కూడా ముందుగానే ఈ చికిత్స అందించాలని ఆయన పేర్కొన్నారు.

రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకం: రామ్‌జీ గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న రాంజీ గౌతమ్

పంజాగుట్ట, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ వ్యతిరేకం అని బీఎస్పీ కేంద్ర సమన్వయకర్త, రాజ్యసభ సభ్యుడు రాంజీగౌతమ్ ఆరోపించారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని బీఎస్పీ కార్యాలయంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చాక రాజ్యాంగం అమలు అయిన రోజు నుంచి బీసీ రిజర్వేషన్లు అమలు చేయలేదన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తొలగిస్తామని మాట్లాడిన తీరును రామ్‌జీ తప్పు పట్టారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రాజ్యాంగాన్ని రద్దు చేయాలనే కుట్రలు చేస్తున్నాయన్నారు. దేశంలో వెంటనే కుల గణన చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా ఎస్సీలను విడదీయాలని బీజేపీ కుట్రలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ, తెలంగాణలో పార్టీని బలోపేతం చేస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో తెలంగాణ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, ఏపీ అధ్యక్షుడు పరంజ్యోతి పాల్గొన్నారు.

ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఫౌండర్ షోమీ దాస్ కన్నుమూత



షోమిదాస్ (ఫైల్)

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత విద్యావేత్త, ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ గచ్చిబౌలి ఫౌండర్ షోమీదాస్(89) కన్నుమూశారు. షోమీదాస్ దేశంలోనే మూడు ప్రముఖ స్కూళ్లు డూన్ స్కూల్, సన్వార్, మాయో కాలేజ్ అండ్ లారెన్స్ స్కూళ్లకు హెడ్‌మాస్టర్‌గా చేసిన ఘనత సాధించారు. షోమీదాస్ 1935 ఆగస్టు 28న జన్మించారు. ది డూన్ స్కూల్, కోల్‌కతా సెంట్ జేవియర్ కాలేజ్‌లలో విద్యాభ్యాసం చేశారు.

ధనుజ కుమారి... చదివింది తొమ్మిదో తరగతే.
కానీ డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఆమె జీవితం ఇప్పుడు పాఠ్యగ్రంథం.
ఈ పారిశుధ్య కార్మికురాలు... ఒక మురికివాడతో పెనవేసుకున్న తన జీవితాన్ని అక్షరబద్ధం చేశారు.
పేదరికం, వివక్షల మధ్య నలిగిపోతున్న జనం వేదనను తన గొంతుతో చాటిచెబుతున్నారు.

ఆమె జీవితం పాఠమైంది

"తిరువనంతపురం రాజ్‌భవన్. రోజూ నా వృత్తిలో భాగంగా ఆ పక్కనుంచే వెళ్తాను. కానీ ఈ ఏడాది ఆగస్టు పదిహేనో తేదీన... మొదటిసారిగా ఆ భవనంలోకి... ప్రత్యేక అతిథిగా, కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఆహ్వానంతో అడుగుపెట్టాను. నేను, నా కుటుంబ సభ్యులు లోపలికి వెళ్ళగానే... గవర్నర్ నవ్వుతూ పలకరించారు. మా యోగక్షేమాలు తెలుసుకున్నారు. "మీరు శక్తిమంతమైన మహిళ" అంటూ నన్ను ప్రశంసించారు. సమాజంలో చాలామంది తోటి మనిషిగానైనా పరిగణించని నాకు... ఇంతకన్నా గొప్ప గౌరవం ఏముంటుంది? గవర్నర్ ఎదుట నా భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయాను. ఒక్కసారిగా నా జీవితమంతా కళ్ళముందు కదిలింది.



> అక్కడ జీవితం ప్రతిరోజూ పోరాటమే. కులం, రంగు, మతం... ఇలా ప్రతి విషయంలోనూ మేము వివక్ష ఎదుర్కొంటూనే ఉంటాం. ఇప్పుడు నాకు 48 ఏళ్ళు. నా కళ్ళముందు తిరువనంతపురం ఎంతో మారింది. కానీ చెంగల్‌చూలా మాత్రం అలాగే ఉంది. రీసెర్చ్ పేరుతో, ప్రాజెక్టుల పేరుతో మా ప్రాంతానికి ఎందరో వస్తూ పోతూ ఉంటారు. కానీ ఎలాంటి ప్రగతీ ఉండదు.

ప్రతిరోజూ పోరాటమే...

మాది తిరువనంతపురంలోని చెంగల్‌చూలా (ప్రస్తుతం రాజాజీనగర్) మురికివాడ. నిమ్నకులానికి చెందిన కుటుంబంలో పుట్టాను. తీవ్రమైన పేదరికంలో నా బాల్యం సాగింది. రెసిడెన్షియల్ స్కూళ్ళలో తొమ్మిదో తరగతి వరకూ చదివాను. ఒకసారి డైరీ గురించి క్లాసులో మా టీచర్ చెప్పారు. 'నేను కూడా రాస్తే బాగుంటుంది కదా?' అనుకున్నాను. కొన్నాళ్ళపాటు నా దినచర్యను అందుబాటులో ఉన్న కాగితాల మీద రాసుకొనేదాన్ని. వాటిని ఏం చెయ్యాలో నాకు తెలీదు. అందుకే కొన్నాళ్ళకు చింపి పారేసేదాన్ని. అయితే భావాలను కాగితం మీద పెట్టడం మాత్రం అలవాటయింది. ఇంట్లో పరిస్థితుల వల్ల చదువు ఆపేశాను. పద్నాలుగేళ్ళ వయసులో పెళ్ళయింది. నా భర్త సతీశ్ వాద్య కళాకారుడు. చెంగల్‌చూలాలోనే మా కాపురం. నా భర్తకు వచ్చే ఆదాయం చాలేది కాదు. నేను కూడా చిన్న చిన్న పనులు చేస్తూ ఉండేదాన్ని. తరువాత మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలుగా చేరాను. కూలీ నాలీ చేసుకొనేవారు ఎక్కువగా ఉండే మా మురికివాడ ఒకప్పుడు నేర కార్యకలాపాలకు పేరు పడింది. అక్కడ జీవితం ప్రతిరోజూ పోరాటమే. కులం, రంగు, మతం... ఇలా ప్రతి విషయంలోనూ మేము వివక్ష ఎదుర్కొంటూనే ఉంటాం. ఇప్పుడు నాకు 48 ఏళ్ళు. నా కళ్ళముందు తిరువనంతపురం ఎంతో మారింది. ఎన్నో ఆధునిక సౌకర్యాలు వచ్చాయి. కానీ చెంగల్‌చూలా మాత్రం అలాగే ఉంది. రీసెర్చ్ పేరుతో, ప్రాజెక్టుల పేరుతో మా ప్రాంతానికి ఎందరో వస్తూ పోతూ ఉంటారు. కానీ ఎలాంటి ప్రగతీ ఉండదు. ఇది సహజంగానే మాకు ఆగ్రహం కలిగిస్తుంది. కానీ మా ఆవేదననైనా, ఆగ్రహాన్నైనా వ్యక్తం చేసే అవకాశాలు చాలా తక్కువ. అయితే అలాంటి ఒక అవకాశం నాకు ఊహించని విధంగా దొరికింది.

చర్చ కోసం, మార్పు కోసం...

ఎప్పుడూ వార్తల్లో ఉండే చెంగల్‌చూలాలో కొన్నేళ్ళ క్రితం రైటర్స్ మీట్ జరిగింది. స్థానికులను కూడా మాట్లాడాలని ఆహ్వానించారు. నేను కూడా మా పరిస్థితుల గురించి చెప్పాను. సమావేశం పూర్తయ్యాక... రచయిత సత్యన్ నన్ను పిలిచారు. "మీ మాటల్లో కోపం ఉంది. దాన్ని అక్షరాల్లో పెడితే బాగుంటుంది. ఇక్కడి మీ జీవితానుభవాల గురించి ఒక పుస్తకం రాయండి. మిగిలిన ప్రాంతాలవారు ఈ కాలనీ గురించి చదివినప్పుడు... అది సామాజికమైన చర్చకు, తద్వారా మార్పునకు దోహదం చేస్తుంది" అని అన్నారు. "మీరు తప్పకుండా రాయాలి. ఏవైనా సలహాలు కావాలంటే ఫోన్ చెయ్యండి" అంటూ తన వివరాలు ఇచ్చారు. కొన్నాళ్ళు ఆలోచించాక... నా అనుభవాల్ని రాయడం ప్రారంభించాను. ఆ సంగతే సత్యన్ గారికి చెప్పాను. "ఒక ఎడిటర్ ఉన్నారు. మీరు ఎలా రాసినా... దాన్ని చక్కటి భాషలో మార్చి రాస్తారు" అని ఆయన సూచించారు. "వద్దు సార్! నేను చదివింది తొమ్మిదో తరగతే. నా పుస్తకంలో భాష ఆ స్థాయిలోనే ఉండాలి" అని చెప్పాను. ఆయన కూడా సరేనన్నారు. కొన్ని నెలల్లో నా పుస్తకాన్ని పూర్తి చేశాను. దానికి 'చెంగల్‌చూలయిల్ ఎంతె జీవితమ్' (చెంగల్‌చూలాలో నా జీవితం) అని పేరు పెట్టాను. నేను ఊహాశక్తి, సృజనాత్మకత ఉన్న రచయితను కాదు. సాహిత్య భాషలో రాయడం నాకు చేతకాదు. నాకు ఎదురైన సంఘటనలు, నేను ఎదుర్కొన్న కష్టాలు, పడిన వేదనలు, సంతోషకరమైన రోజులు, నేను ధరించిన దుస్తులు, తిన్న తిండి, తిరిగిన ప్రదేశాలు... ఇలా ప్రతిదీ నాకు వచ్చిన భాషలో రాశాను. ఇది సాహిత్యం కాదు. నా జీవితం... ఒక విధంగా నా చుట్టూ ఉన్న సమాజం జీవితం

అటు గుర్తింపు, ఇటు ఈసడింపులు...

2014లో సిందా పబ్లికేషన్స్ నా రచనను పుస్తక రూపంలోకి తెచ్చింది. దానికి వచ్చిన స్పందన నేను ఎన్నడూ ఊహించనిది. తద్వారా ఎందరో ప్రముఖులు నాకు పరిచయం అయ్యారు. "మీ రచన సహజంగా ఉంది. మీకు ఎదురైన సంఘటనలను నిక్కచ్చిగా వెల్లడించారు" అనే అభినందనలు... "మా గొంతు వినిపించావు" అంటూ స్థానికుల ఆత్మీయ వచనాలు... అన్నిటికన్నా సంతోషం కలిగించిన విషయమేమిటంటే "ఈ పుస్తకంలో భిన్నమైన అనుభవాలు ఉన్నాయి. ఈ తరానికి ఇది ఒక స్ఫూర్తిమంతమైన కథ..." అంటూ దాన్ని ఇటీవలే కేరళలో అతి పెద్ద విశ్వవిద్యాలయమైన 'కాలికట్ యూనివర్సిటీ' ఎంఏ సిలబస్‌లో, 'కన్నూర్ యూనివర్సిటీ' బీఏ సిలబస్‌లో చేర్చారు. సామాజిక వివక్ష గురించి విశ్వవిద్యాలయాల్లో బోధించడం చాలా మంచి విషయం. దీనివల్ల



రాబోయే తరంలోనైనా మంచి మార్పు వస్తుందని నా ఆశ. ఇప్పుడు మరో పుస్తకం రాసే పనిలో ఉన్నాను. అది కూడా చెంగల్‌చూలా గురించే. ఇక, నా వ్యక్తిగత విషయాలకు వస్తే... ప్రస్తుతం ఘన వ్యర్థాల నిర్వహణ కోసం 'హరిత కేరళం' ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసిన 'హరిత కర్మ సేన'లో శానిటరీ వర్కర్‌గా ఉంటున్నాను. రోజూ ఇంటింటికీ వెళ్ళి చెత్త సేకరించే ఆ వృత్తే అప్పుడూ ఇప్పుడూ నా జీవనాధారం. మా ఇద్దరు అబ్బాయిలు నిధీశ్, సుధీశ్ కూడా వాద్య కళాకారులే. స్థానిక మహిళల కోసం 'వింగ్స్ ఆఫ్ విమెన్' అనే సంస్థను, దానికి అనుబంధంగా ఒక గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నాను. సామాజిక కార్యక్రమాల్లో మహిళలను భాగస్వాముల్ని చేస్తున్నాను. మన సమాజంలో వివక్ష ఇంకా పాతుకొనే ఉంది. మా అబ్బాయిలు కూడా చేదు అనుభవాలు ఎన్నో ఎదుర్కొన్నారు. రచయిత్రిగా గుర్తింపు ఒకవైపు, అట్టడుగు కులానికి చెందినదానిగా ఈసడింపులు మరొకవైపు నాకు ఎదురవుతూనే ఉన్నాయి. అవి లేని సమాజం రావాలి. అందరూ హుందాగా, గౌరవంతో, తమ శ్రమకు తగిన గుర్తింపుతో బతకాలి. అదే నా కల."





ధైర్య సాహసాలు, ధిక్కార స్వభావం, గొప్ప వ్యక్తిత్వం, సడలని ఆత్మస్థైర్యం, సమసమాజం రావాలన్న బలమైన ఆకాంక్ష... ఈ గుణాలన్నిటికీ ప్రతీక చాకలి ఐలమ్మ. ఆమె జీవితం యువతరానికి స్ఫూర్తి పాఠం. ఎన్నడూ బడిముఖం కూడా ఎరుగని ఆ మహనీయురాలి పేరు... కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి అలంకారం కాబోతోంది. ఈ సందర్భంగా ఆమె మునిమనుమరాలు **చిట్యాల శ్వేతా ఐలమ్మ**ను 'నవ్య' పలకరించింది.

మాకు ఆ గుర్తింపు చాలు

"చాకలి ఐలమ్మ రక్తం పంచుకొని పుట్టినవారు మాత్రమే కాదు, అన్యాయాన్ని ధిక్కరించే వారంతా ఆ అమ్మకు వారసులే. చిట్యాల ఐలమ్మకు ఐదుగురు కొడుకులు, ఒక కూతురు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఒక కొడుకును రజాకార్లు పొట్టనపెట్టుకొన్నారు. మిగిలిన వారందరిలో.. ఆమె పెద్దకుమారుడు సోమయ్యకు చిన్న కొడుకైన రామచంద్రం ఒక్కరే తన నాయనమ్మ నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకొన్నారు. అతను ఐలమ్మ దగ్గరే పెరిగి పెద్దయ్యారు. ఆమె ఆదర్శాలను అనుసరించారు. సీపీఎం స్థానిక నాయకుడిగా, 20 ఏళ్ళు పాలకుర్తి సర్పంచ్‌గా పుట్టినగడ్డకు మంచి పనులెన్నో చేశారు. గ్రంథాలయం కట్టించారు. పేదలకు ఇళ్ళు మంజూరు చేయించడం, ఊరుకు రోడ్లు, తాగునీరు లాంటి మౌలిక సదుపాయాలు సమకూర్చడం కోసం ఎంతో కష్టపడ్డారు. నేను ఆ రామచంద్రం గారి చిన్నకొడుకు సంపత్‌కుమార్ భార్యను. చిట్యాల వారింట 2007లో అడుగుపెట్టాను. గొప్ప చరిత్ర కలిగిన కుటుంబానికి కోడలిగా వచ్చానని అంతవరకూ నాకు తెలీదు. ఒకసారి ఐలమ్మ విగ్రహావిష్కరణకు మామయ్య వెంట నేనూ వెళ్లాను. అప్పుడు ఆ వీరనారి సాగించిన ఆత్మగౌరవ పోరాటాన్ని ప్రజలంతా వేనోళ్లా కీర్తించడం విని పులకించిపోయాను. "ఈ భూమి నాది. పండించిన పంట నాది. తీసుకెళ్ళడానికి దొరెవ్వడు?" అని సివంగిలా గర్జించిన ఐలమ్మ జీవితం నన్ను కదిలించింది. ఆ స్ఫూర్తితోనే నా పేరును 'శ్వేత ఐలమ్మ'గా మార్చుకున్నాను. నా వంతు సేవ చేయాలనే సంకల్పంతో ప్రజాజీవితంలోకి వచ్చాను. ప్రతి సంవత్సరం ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడంలో నా వంతు పాత్ర పోషిస్తున్నాను.

> **ఐలమ్మపై సమగ్ర గ్రంథం**
>
> చాకలి ఐలమ్మ పోరాట పటిమను పుచ్చలపల్లి సుందరయ్య గారు 'తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం - నా అనుభవాలు' పుస్తకంలో ప్రముఖంగా ప్రస్తావించారు. భీంరెడ్డి నర్సింహారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు తదితర పెద్దలంతా వారి ఆత్మకథల్లో ఆమె వీరత్వాన్ని ఘనంగా పరిచయం చేశారు. ఇప్పటివరకు ఐలమ్మ జీవితం మీద కొన్ని రచనలు వచ్చాయి. అయితే, అవన్నీ సమగ్రంగా లేవన్నది మా మామయ్య రామచంద్రం అభిప్రాయం. ఐలమ్మ ఉద్యమ జీవితంపై సమగ్ర గ్రంథాన్ని అతి త్వరలోనే తీసుకురాబోతున్నాం.

ఇన్నాళ్ళకు గుర్తింపు దక్కింది...

కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు ప్రకటించడం... ఆ పోరాటయోధురాలికి దక్కిన ఘనమైన నివాళి. ఆమె చరిత్ర తరతరాలకు తెలిసేలా ఇలాంటిదేదైనా మంచి నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటే బావుంటుందని కుటుంబ సభ్యులమంతా చాలారోజులుగా అనుకొంటున్నాం. నిజానికి ఐలమ్మకు వారసులు ఉన్నారని సమాజానికి తెలిసిందీ, ఐలమ్మ వారసులుగా మాకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభించిందీ కూడా ఇప్పుడే. ఇంతకు ముందు కొందరు తమ రాజకీయ లబ్ధి కోసం ఐలమ్మ పేరును బాగా ఉపయోగించుకొన్నారు. ఆమె వారసులమైన మమ్మల్ని కావాలని విస్మరించారు. నాలుగేళ్ళ కిందట మంత్రిగా ఉన్న ఒక పెద్దమనిషి అయితే విగ్రహావిష్కరణ సభకు వచ్చి, మా ఊసే ఎత్తకుండా ఉపన్యాసాలిచ్చారు. మాకు కీర్తికిరీటాలు అక్కర్లేదు, కేవలం ఐలమ్మ వారసులుగా గుర్తింపు మాత్రమే ఆశించాం. అది ఇన్నాళ్ళకు దక్కినందుకు చాలా ఆనందంగా ఉంది. నన్ను తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనడం సంతోషం. దాన్ని పదవి లేదా హోదా అనుకోకుండా.. బాధ్యతగా భావించి నిర్వర్తించేందుకు ప్రయత్నిస్తాను.

ఆమెకు భయమనేది తెలియదు

ఐలమ్మ తరతరాలుగా వస్తున్న వృత్తిచేయడం ఇష్టంలేకనే నాగలి పట్టింది. కౌలు రైతుగా మారింది. ఇది మా మామయ్య చెప్పగా విన్నాను. వందకుపైగా గొర్రెలు, యాభై పశువులు, ఐదు ఎడ్ల జతలతో చాలా పెద్ద వ్యవసాయమట. స్వాభిమానానికి ప్రతీకగా తలెత్తుకు బతుకుతున్న ఐలమ్మను చూసి విస్నూరు దొరకు కడుపు మండింది. దొరలకు వ్యతిరేకంగా గొంతెత్తిందని తెలిసి, 200మంది గూండాలను పంపాడు. వారంతా ఇంటి మీద పడి గొర్రెలు, మేకలు, పశువులు.. అన్నిటినీ తోలుకెళ్లారు. అన్నం కుండలు, నీటి తొట్టెలతో సహా వస్తువులన్నిటినీ ధ్వంసం చేశారు. పచ్చిబాలింతగా ఉన్న ఆమె కూతురిపై అఘాయిత్యానికి తెగబడ్డారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భర్తను, కొడుకును ఐలమ్మ కోల్పోయింది. అయినా, ఆ యోధురాలు అడుగు వెనక్కివేయలేదు. తన పోరాటాన్ని మరింత ఉధృతం చేసింది. రోకలి బండ చేతపట్టి దొరలు, దేశ్‌ముఖ్‌ల మోచేతినీళ్ళు తాగే గూండాలను పరుగులు తీయించింది. ఆమెకు భయమనేది తెలియదు. కోర్టు విచారణకు పాలకుర్తి నుంచి హైదరాబాద్ కాలినడకన వెళ్లి వచ్చేదని తెలిసి ఆశ్చర్యం కలిగింది. పోరాట పటిమ, తెగువ, ఆత్మస్థైర్యం, ధైర్యసాహసాల్లో మనమంతా ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి.

> **అక్కడా ఐలమ్మ విగ్రహాలు...**
>
> వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాలు తెలంగాణలోనే కాదు... ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల, కర్నూలు, విజయవాడ తదితర ప్రాంతాల్లో కూడా నెలకొల్పారు. ఆమెకు దేశమంతటా అభిమానులున్నారు.
>
> ఇప్పటివరకు 290కుపైగా విగ్రహాలున్నాయి. పాలకుర్తిలో స్మారక స్థూపం, స్మారక భవనంతో పాటు 550 కిలోల కంచుతో చేసిన కాంస్య ప్రతిమ... ఇవన్నీ ఐలమ్మ వీరత్వానికి చిహ్నాలుగా మా ప్రాంత యువతను ఉత్తేజితులను చేస్తున్నాయి. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎర్రకోట ముందు చాకలి ఐలమ్మ శకటం ఊరేగించడం... అది సబ్బండ వర్గాలకు దక్కిన గౌరవం.

సాదాసీదా జీవితం...

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ముగిసిన తర్వాత ఐలమ్మ అత్యంత సాదాసీదా జీవితమే గడిపింది. ఒంట్లో ఓపిక ఉన్నంత కాలం వరినాట్లు లాంటి వ్యవసాయ పనులు చేసింది. నాట్ల పాటలు, బతుకమ్మ పాటలు చాలా బాగా పాడేదని మా మామయ్య చెబుతుంటారు. స్వాతంత్ర్య సమరయోధుల పింఛను కూడా ఆమెకు రాలేదు.

భీంరెడ్డి నర్సింహారెడ్డి, ఆరుట్ల లక్ష్మీనరసయ్య, కమలాదేవి, మల్లు స్వరాజ్యం లాంటి వాళ్ళు అప్పుడప్పుడు వస్తుండేవారట. వారిని ఆమె సొంత కొడుకులు, కూతుళ్ళలా అనుకొన్నది. వారందరూ ఆరుబయట నులకమంచం మీద కూర్చొని... పోరాటం తాలూకు జ్ఞాపకాలను గుర్తుచేసుకొనేవారు. ఐలమ్మ సాహసగాథను ఆమె ముందే 'శారదకాండ్రు' (జానపద గాయకులు) కథగా చెబుతుంటే, విని మురిసిపోయేది. దేవులపల్లి వెంకటేశ్వరరావు గారు అజ్ఞాతంలో ఉన్నసమయంలో 'జనవాణి' పత్రికను ఆమె చేతుల మీదుగా ఆవిష్కరించజేశారట. ఆనాటి కమ్యూనిస్టు యోధులందరికి ఆమె అంటే చాలా గౌరవమట. ఇవన్నీ మా రామచంద్రం మామయ్య ద్వారా విన్నాను. ఇంత గొప్ప ఇంటికి కోడలిగా వచ్చినందుకు, ఐలమ్మకు వరుసకు మునిమనుమరాలిని అయినందుకు గర్వపడుతున్నాను. సమాజం కోసం నిస్వార్థంగా పోరాడిన ఐలమ్మ కుటుంబ సభ్యురాలుగా నాకు ఈ గుర్తింపు, గౌరవం దక్కడం నా అదృష్టం. దీన్ని నిలబెట్టుకోవడమే నా ముందున్న బాధ్యత.

● కేపీ

యోగాతో మధుమేహానికి చెక్!

యోగా చేస్తే మధుమేహం వచ్చే అవకాశాలు తగ్గుతాయా? ఈ రెండింటికీ సంబంధం ఉందా? ఈ ప్రశ్నలకు ఢిల్లీలోని జీటీబీ ఆసుపత్రికి చెందిన పరిశోధకులు చేసిన అధ్యయనంలో సమాధానాలు లభించాయి. క్రమం తప్పకుండా ప్రతి రోజు 40 నిమిషాలు యోగా చేస్తే - మధుమేహం వచ్చే అవకాశాలు 40 శాతం తగ్గుతాయని అధ్యయనంలో తేలింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అంచనాల ప్రకారం- మన దేశంలో 10 కోట్ల మంది మధుమేహ వ్యాధితో (టైప్ 2) బాధపడుతున్నారు. సుమారు 13 కోట్ల మంది మధుమేహ వ్యాధికి చేరువ (ప్రీ డయాబిటిస్)లో ఉన్నారు. ఇప్పటి దాకా కేవలం జీవన శైలిని మార్చుకోవటం ద్వారా మధుమేహానికి అడ్డుకట్ట వేయవచ్చని భావించేవారు. కానీ ఈ మధ్య కాలంలో కొన్ని అధ్యయనాలలో ఇది నిజం కాదని తేలింది. "మేము చేసిన అధ్యయనంలో సుమారు 500 మంది పాల్గొన్నారు. వీరిని రెండు గ్రూపులుగా విభజించాము. ఒక గ్రూపులో వారు జీవన శైలిని మాత్రమే మార్చుకొన్నారు. మరొక గ్రూపు వారు జీవన శైలిని మార్చుకోవటంతో పాటుగా ప్రతి రోజు 40 నిమిషాలు యోగా కూడా చేశారు. యోగా చేసిన వారిలో బ్లడ్ సుగర్ విలువలు నియంత్రణలోకి వచ్చాయి" అని ఈ అధ్యయనంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ మధు వెల్లడించారు.



కౌన్సెలింగ్

రక్తహీనతకు సిద్ధ వైద్యం



డాక్టర్! మా అమ్మాయికి పదిహేనేళ్లు. రక్తహీనతతో బాధపడుతోంది. వైద్యులు సూచించిన మందులు కూడా అంతగా ఫలితాన్నివ్వలేదు. బలహీనత, నిస్సత్తువలతో బాధపడుతున్న మా అమ్మాయికి సమర్థమైన సిద్ధ మందులను సూచిస్తారా?

- ఓ సోదరి, హైదరాబాద్.

అనీమియాకు సిద్ధ వైద్యంలో అద్భుతమైన మందులున్నాయి. ఇటీవలే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిద్ధ (ఎన్ఐఎస్), ఆయుష్ మంత్రిత్వ శాఖ, తమిళనాడులోని వెలుపైలు సిద్ధ మెడికల్ కాలేజీలకు చెందిన పరిశోధకులు, నిపుణులు అన్నపెటి సెంటురమ్, భావన కటుక్కాయ, మతులై మనప్పాకు, ఉసిరి లేహ్యాలను తీసుకోవడం ద్వారా హిమోగ్లోబిన్ మోతాదు పెరుగుతుందని ప్రయోగాల ద్వారా కనిపెట్టారు. ఈ సిద్ధ మందులతో ప్యాక్‌డ్ సెల్ వాల్యూమ్, మీన్ కార్పస్క్యులర్ హిమోగ్లోబిన్‌లు కూడా పెరుగుతాయని, తద్వారా కౌమార బాలికల్లో రక్తహీనతను నివారించవచ్చని కనిపెట్టారు.

45 రోజుల వైద్యం

సాధారణంగా రక్తహీనతలో అలసట, నిస్సత్తువ, తల తిరుగుడు, తలనొప్పి, అనొరెక్సియా మొదలైన లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి. ఆకలి కూడా తగ్గిపోతుంది. ఈ లక్షణాలు కనిపించిన ఆడపిల్లలు నెలసరి సమయంలో మరింత బలహీనపడిపోతూ ఉంటారు. ఇదే పరిస్థితి మరింత తీవ్రమైతే ఎదుగుదల, పునరుత్పత్తి వ్యవస్థల మీద ప్రభావం పడుతుంది. కాబట్టి రక్తహీనతను గుర్తించిన వెంటనే సమర్థమైన జాగ్రత్తలతో సమస్యను సరిదిద్దే ప్రయత్నం చేయాలి. పైన పేర్కొన్న సిద్ధ మందులను క్రమం తప్పకుండా 45 రోజుల పాటు అందించగలిగితే కచ్చితంగా మార్పు కనిపిస్తుంది. రక్తంలో హిమోగ్లోబిన్ 11.9 మిల్లీగ్రామ్స్ పర్ డెసిలీటరు ఉండాలి. హిమోగ్లోబిన్ మోతాదు 8.0 ఎమ్‌జి/డీఎల్‌కు పడిపోతే తీవ్రమైన అనీమియాగా పరిగణించాలనీ, 8.0 నుంచి 10.9 ఎమ్‌జి/డీఎల్‌ను మధ్యస్థ అనీమియాగా పరిగణించాలనీ, 11.0 నుంచి 11.9 ఎమ్‌జి/డీఎల్‌ను స్వల్ప అనీమియాగా పరిగణించాలనీ, తాజాగా ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది. కాబట్టి రక్తపరీక్షలో అనీమియాగా తేలితే, పౌష్టికాహారంతో పాటు సిద్ధ వైద్యం సూచించే మందులను వాడుకోవడం మొదలుపెట్టాలి. 45 రోజుల్లో కచ్చితమైన ఫలితం కనిపిస్తుంది.

- డాక్టర్ మోహన్
సిద్ధ వైద్యులు, హైదరాబాద్



బాద్‌షా ఫిదా

కళాశాలలో ఉత్సవం. వందల్లో ఆహూతులు. వేదిక మీద ఆట పాట.

బ్యాక్‌గ్రౌండ్‌లో హిట్ నంబర్ 'కాలా చష్మా..' వినిపిస్తుంటే... మాస్ స్టెప్పులతో కుర్రకారు తమను తాము మరిచిపోయారు.

ఇంతలో ఓ అధ్యాపకురాలు... ఉన్నట్టుండి వేదిక ఎక్కి... మెరుపులా మెరిశారు. మరో ముగ్గురు ప్రొఫెసర్లు ఆమెకు తోడయ్యారు. విద్యార్థినులతో కలిసి కాలు కదిపి... వారిలో ఒకరయ్యారు.

ఇక చెప్పేదేముంది... ఒక్కసారిగా అక్కడున్నవారిలో ఉత్సాహం ఉరకలు వేసింది. ఆనందం అంచులకు వెళ్లింది. ఆ వీడియో ఇప్పుడు నెట్టింటిని ఊపేస్తోంది.

ఇంతకీ ఈ వేడుక ఎక్కడనేగా! కేరళ రాష్ట్రం కొచ్చిలోని 'సెయింట్ థెరెసా కాలేజీ'లో ఇటీవల ఓ ఉత్సవం జరిగింది. విద్యార్థుల్లోని కళాకారుల్ని ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ఈ షోకు రూపకర్త... భరత నాట్యం అసిస్టెంట్ ప్రొఫెసర్ అరుణిమా దేవశీష్. ఈ వీడియోలో చీర కట్టుతో కనిపించిన ఆమె... సంప్రదాయ నృత్యానికి పాశ్చాత్య హంగులు అద్ది... అదరహో అనిపించారు. దాన్ని ఎవరో వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. గంటల వ్యవధిలోనే లక్షల మంది వీక్షించారు.

విశేషమేమంటే... 'కాలా చష్మా' పాట పాడిన స్టార్ ర్యాపర్ బాద్‌షా కూడా అరుణిమా డ్యాన్స్‌కు ఫిదా అయ్యాడు. ఆమె వీడియోకు ఒక లైక్ వేసుకున్నాడు. దాంతో వీక్షకుల సంఖ్య అమాంతం పెరిగిపోయింది. ఇప్పటికి దాదాపు 1.2 కోట్లమంది వీక్షించారు. ఇన్‌స్టాలోనే కాకుండా ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాలన్నిటిలో అరుణిమా నాట్యం హాట్ ఫేవరెట్ అయింది.

'బాద్‌షా కూడా మా వీడియోను మెచ్చుకున్నాడు' అంటూ సంతోషం వ్యక్తం చేసిన ఈ ప్రొఫెసర్‌కు అసలు వీడియో సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ అయిన విషయమే తెలియదట. "నా శిష్యుల్లో ఎవరో దాన్ని పోస్ట్ చేశారు. ఒక్కసారిగా వ్యూస్ పెరిగిపోవడంతో 'నీ డ్యాన్స్ అద్భుతం' అంటూ సన్నిహితులు, బంధువుల నుంచి నాకు ఫోన్లు రావడం మొదలయ్యాయి. మంచి బీట్ ఉన్న పాట... దానికి మా కాలేజీ అమ్మాయిల స్టెప్పులు చూసి... నాకు కూడా ఉత్సాహం వచ్చేసింది. అలా స్టేజీ మీదకు వెళ్లి, వారితో కలిసి ఆడేశాను. ఇంతలా నచ్చుతుందని అస్సలు ఊహించలేదు' అంటారు అరుణిమా. ప్రొఫెషనల్ డ్యాన్సర్ కావాలన్నది ఆమె చిన్ననాటి కల. దాని కోసమే భరత నాట్యం నేర్చుకున్నారు. చివరకు ఇలా అధ్యాపకురాలిగా స్థిరపడ్డారు.

'మా విద్యార్థినుల్లోని కళాత్మక కోణాన్ని వెలికి తీయడానికి ఏటా టాలెంట్ షోలు నిర్వహిస్తాం. గత ఏడాది కూడా ఇలానే వాళ్లతో కలిసి నేను చేసిన డ్యాన్స్‌కు మంచి స్పందన వచ్చింది. ఇన్‌స్టాలో ఆ వీడియోను ముప్ఫై లక్షల మందికి పైగా చూశారు. బహుశా దాన్ని దృష్టిలో పెట్టుకొనే మళ్లీ నా వీడియోను నాకు తెలియకుండా పోస్ట్ చేసివుంటారు'



అంటూ తన సంతోషాన్ని పంచుకున్నారు అరుణిమా. అయితే షోకి ముందు రిహార్సల్స్ లాంటివి ఏవీ ఉండవట. వేదిక ఎక్కిన తరువాత సంగీతానికి అనుగుణంగా ఎవరికి వారు లయబద్ధంగా నర్తిస్తారని, అదే సహజసిద్ధంగా, చూడముచ్చటగా ఉంటుందని అంటారు ఆమె.

అందరికీ రిలేట్ అవుతుంది

'బెంచ్ లైఫ్' వెబ్ సిరీస్‌తో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు మానస శర్మ. తమిళ నటుడు వైభవ్, చరన్ పెరి, రాజేంద్ర ప్రసాద్, రితికా సింగ్, అకాంక్ష సింగ్ ప్రధాన పాత్రలు పోషించారు. నిహారిక కొణిదెల నిర్మించారు. ఈ శుక్రవారం ఓటీటీ సంస్థ 'సోనీ లైవ్'లో విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది.



నిర్మాత నిహారిక కొణిదెల మాట్లాడుతూ "ఇది కార్పోరేట్ ఉద్యోగుల కథ అయినా.. అందరికీ రిలేట్ అవుతుంది. వినోదంతో పాటు.. మంచి భావోద్వేగాలు ఇందులో ఉంటాయి. అద్భుతమైన కంటెంట్ ఉన్న ఈ వెబ్ సిరీస్ తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అని చెప్పారు. దర్శకురాలు మానస శర్మ మాట్లాడుతూ "నేను జాబ్ చేస్తున్నప్పుడు ఎదురైన అనుభవాలు.. లైఫ్‌లో చూసిన అనేక సంఘటనలను స్ఫూర్తిగా తీసుకొని తెరకెక్కించిన వెబ్ సిరీస్ ఇది. ప్రతీ పాత్రకూ ఓ కథ ఉంటుంది. ఇందులోని నటీనటులు పంచే వినోదం చాలా కాలం గుర్తుంటుంది" అని చెప్పారు. నటుడు చరణ్ పెరి మాట్లాడుతూ "స్నేహ మాధుర్యాన్ని.. అభిరుచులను సరికొత్తగా ఆవిష్కరించే సిరీస్ ఇది" అని అన్నారు.

సికందర్ సెట్స్‌లోకి కాజల్?



బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్, తమిళ డైరెక్టర్ ఏ.ఆర్.మురుగదాస్ కలయికలో తెరకెక్కుతోన్న చిత్రం 'సికందర్'. సత్యరాజ్, ప్రతీక్ బబ్బర్ కీలక పాత్రలు పోషిస్తుండగా.. రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. దాదాపు రూ.400 కోట్ల బడ్జెట్‌తో సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. అయితే, ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో నటించడానికి కాజల్ అగర్వాల్ సెట్స్‌లోకి అడుగుపెట్టినట్లు టాక్. ఈ చిత్రాన్ని ఈద్ కానుకగా 2025లో విడుదల చేయనున్నారు. కాగా, బాలీవుడ్‌లో కాజల్ ఇంతకుముందు అజయ్ దేవ్‌గణ్ నటించిన 'సింగమ్', అక్షయ్‌కుమార్ నటించిన 'స్పెషల్ 26' చిత్రాల్లో నటించారు.



భారీ వర్షాలు, వరదలతో ఇబ్బంది పడుతున్న ప్రజలను ఆదుకోవడానికి రెండు తెలుగు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్‌కు కలిపి హీరో సాయిదుర్గ తేజ్ రూ. 20 లక్షలు విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. బుధవారం ఏపీ మంత్రి నారా లోకేశ్‌కు రూ. పది లక్షల చెక్కును విజయవాడలో అందించారు సాయిదుర్గ తేజ్. అలాగే అమ్మ అనాథాశ్రమానికి రూ రెండు లక్షలు, ఇతర సేవా సంస్థలకు రూ. మూడు లక్షలు విరాళంగా అందించారు

సాహసనారి సంయుక్త



నిఖిల్ కథానాయకుడిగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'స్వయంభూ'. పీరియాడిక్ వార్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో నిఖిల్‌కు జోడీగా నభానటేష్, సంయుక్త నటిస్తున్నారు. బుధవారం సంయుక్త పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. యుద్ధ భూమిలో విల్లును ఎక్కుపెడుతున్న యోధురాలిగా ఆమె లుక్ అలరించింది. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. అలాగే శర్వానంద్ సరసన సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం (శర్వా 37-వర్కింగ్ టైటిల్) నుంచి ఆమె పాత్రను పరిచయం చేస్తూ ప్రత్యేక లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రంలో దియా అనే పాత్రలో ఆమె కనిపించనున్నారు. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలోనూ సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్నారు. మహేశ్ చందు నిర్మాత. సమీరా అనే పాత్రలో సంయుక్త నటిస్తున్నారు. ఆమె పుట్టిన రోజు సందర్భంగా యూనిట్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది.

నా పాత్ర ఎమోషనల్‌గా ఉంటుంది



అభిరామి

'ఈ సినిమాలో బ్యాంక్ ఉద్యోగిని పాత్ర పోషించాను. అమ్మ, నాన్న ఇద్దరూ బ్యాంకు ఉద్యోగులే కావడంతో నాకు పర్సనల్‌గా ఈ పాత్ర కనెక్ట్ అయింది. సింగిల్ మదర్. స్ట్రాంగ్ ప్రిన్సిపల్స్ ఉన్న పాత్ర. కథ, పాత్ర నచ్చి వెంటనే ఒప్పుకొన్నా' అని చెప్పారు నటి అభిరామి. రాజ్ తరుణ్ హీరోగా రూపొందిన 'భలే ఉన్నాడే' చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషించారు. శుక్రవారం ఈ సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో అభిరామి మాట్లాడుతూ 'తల్లి, కొడుకు అనుబంధం ఈ సినిమాకు సోల్. నా పాత్ర ఎమోషనల్‌గా ఉంటుంది. ఇంతకుముందు కొన్ని సినిమాల్లో నటించి అమెరికా వెళ్లిపోయా. పెళ్లి చేసుకుని కొన్నాళ్ల అక్కడే ఉన్నా. రీ ఎంట్రీలో నేను తెలుగులో మొదట ఒప్పుకొన్నది 'భలే ఉన్నాడే' చిత్రాన్నే.' అని చెప్పారు అభిరామి.

విడాకుల విషయం నాకు తెలియదు



ఆర్తి రవి

తనకు తెలియకుండా, తన సమ్మతి లేకుండా తన భర్త విడాకుల ప్రకటన చేశారంటూ ఆర్తి రవి బుధవారం ప్రకటన విడుదల చేయడంతో తమిళ హీరో జయం రవి విడాకుల వ్యవహారం సరికొత్త మలుపు తిరిగింది. ఈ విషయంపై ఆమె విడుదల చేసిన ప్రకటనలో.. 'మా వైవాహిక జీవితం గురించి మీడియా, సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు చూసి ఆందోళనకు గురయ్యాను. 18 ఏళ్ళుగా పరస్పర విశ్వాసం, గౌరవంతో కుటుంబ జీవితాన్ని గడుపుతున్నాం. ఈ విడాకుల ప్రకటన వల్ల మా గౌరవ మర్యాదలతో పాటు వ్యక్తిత్వాన్ని కోల్పోయినట్టుగా భావిస్తున్నాను. నా భర్తతో మాట్లాడాలని, కలవాలని ఎన్నోసార్లు ప్రయత్నం చేశాను. కానీ, నాకు అలాంటి అవకాశం దక్కలేదు. నేను, నా పిల్లలు ఇబ్బంది పడుతున్నాం. వైవాహిక బంధం నుంచి వైదొలగాలనే ఈ నిర్ణయం పూర్తిగా ఆయన సొంతంగా తీసుకున్నది. దీనిపై బహిరంగంగా వ్యాఖ్యానించదలచుకోలేదు. అయితే, నా వ్యక్తిత్వానికి కళంకం కలిగించేలా బహిరంగంగా జరుగుతున్న ప్రచార దాడులను సహించలేకపోతున్నాను. ఈ అసత్య ప్రచారాన్ని తిరస్కరించడం నా తొలి కర్తవ్యం' అని ఆర్తి రవి పేర్కొన్నారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)



మెరుపుల వాన

శ్రీనువైట్ల దర్శకత్వంలో గోపీచంద్, కావ్య థాపర్ జంటగా నటిస్తున్న చిత్రం 'విశ్వం'. టీ.జీ.విశ్వప్రసాద్, వేణుదొణెపూడి నిర్మిస్తున్నారు. దసరా కానుకగా అక్టోబర్ 11న చిత్రం విడుదలవుతోంది. బుధవారం ఈ చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ 'మొరాకన్ మగువ'ను మేకర్స్ విడుదల చేశారు. 'చురచుర చూపుల నైనా.. కొరకొర మెరుపుల వాన' అంటూ సాగే ఈ గీతాన్ని రాకేందు మౌళి రచించగా..పృథ్వీ చంద్ర, సాహితీ చాగంటి ఆలపించారు. చేతన్ భరద్వాజ్ సంగీతం అందించారు.

మలైకా ఇంట విషాదం



బాలీవుడ్ నటి మలైకా అరోరా ఇంట్లో విషాద ఘటన జరిగింది. మలైకా సవతి తండ్రి అనిల్ మెహతా ముంబైలో ఆరు అంతస్థుల భవంతి నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. ఆయనను ఆస్పత్రిలో చేర్పించారు. కానీ అప్పటికే ఆయన చనిపోయారని వైద్యులు తెలిపారు. అయితే అనిల్ మెహతాది ఆత్మహత్య కాదా అనే విషయం అధికారికంగా తెలియాల్సి ఉంది.

అరుదైన చిత్రం



దర్శకుడు కోదండరామిరెడ్డితో ఉన్న ఈ చిన్నారులెవరు?

మెగాస్టార్ చిరంజీవి, విజయశాంతి జంటగా నటిస్తున్న 'పసివాడి ప్రాణం' చిత్రం పాటల చిత్రీకరణ కశ్మీర్‌లో జరుగుతోంది. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో అల్లు అరవింద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ షూటింగ్‌కు ఇద్దరు చిన్నారులు కూడా వచ్చారు. ముద్దుగా, బొద్దుగా ఉన్న ఆ చిన్నారులను చూసి కోదండరామిరెడ్డి ముచ్చట పడ్డారు. అందులో ఒకరిని తన ఒళ్లోకి తీసుకుని ఆయన ముద్దులాడారు. మరొకతను ఆయన్ని ఆనుకుని నిలబడ్డాడు. ఇంతకీ ఈ చిన్నారులెవరో తెలుసా? కోదండరామిరెడ్డి ఒళ్లో ఉన్న బుడతడు మెగాస్టార్ తనయుడు రామ్‌చరణ్, ఆయన పక్కనున్నది అల్లు అరవింద్ కుమారుడు అర్జున్. నిజంగా ఇది అరుదైన దృశ్యమే కదూ!

ఇన్ ప్రోగ్రెస్



ధ్రువ వాయు హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన 'కళింగ' చిత్రం శుక్రవారం విడుదల కానుంది. దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్ ఈ సినిమాను నిర్మించారు. మంగళవారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు

కొత్త కాన్సెప్ట్‌తో కళింగ

బీజేపీ నేత రఘునందన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ధ్రువ వాయు మాట్లాడుతూ 'మా సినిమా టీజర్, ట్రైలర్ చూసి ఇది 'కాంతారా, విరూపాక్ష, మంగళవారం' చిత్రాల తరహాలో ఉంటుందా అని అడుగుతున్నారు. ఇదొక కొత్త కాన్సెప్ట్‌తో తీసిన సినిమా. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది' అన్నారు.. ధ్రువ వాయు డెడికేషన్, ఫ్యాషన్ వల్లే ఈ రోజు ఇక్కడ ఉన్నామని నిర్మాత దీప్తి చెప్పారు. సినిమా బాగా వచ్చిందని మరో నిర్మాత పృథ్వీ యాదవ్ చెప్పారు.

ప్రేమకథ




ముఖేశ్ గౌడ, ప్రియాంక శర్మ నటిస్తున్న ప్రేమ కథా చిత్రం 'గీతా శంకరం' షూటింగ్ బెంగళూరులో జరుగుతోంది. రుద్ర దర్శకత్వంలో కె.దేవానంద్ నిర్మిస్తున్నారు. 'ఎమోషనల్ డ్రామాతో రూపుదిద్దుకుంటున్న ప్రేమ కథాచిత్రమిది. పాటలన్నీ రికార్డ్ చేశాం. త్వరలో లిరికల్ వీడియో విడుదల చేస్తాం' అని ఆయన చెప్పారు. కొత్తదనం కలిగిన చిత్రమిదని దర్శకుడు రుద్ర చెప్పారు.

బిజినెస్

హైదరాబాద్ ● గురువారం 12 సెప్టెంబరు 2024

రూ.1.5 లక్షల కోట్లతో 5 సెమీకండక్టర్ ప్రాజెక్టులు

నాలుగు నెలల్లో సెమీకాన్ 2.0 పాలసీ.. కేంద్ర మంత్రి వైష్ణవ్



సెమీకాన్‌ను సందర్శించిన ప్రధాని

న్యూఢిల్లీ: దేశంలో సెమీ కండక్టర్ల పరిశ్రమ అభివద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలిస్తున్నాయి. ఇందుకోసం ప్రకటించిన 'సెమీకాన్ 1.0' పాలసీ కింద ఇప్పటి వరకు రూ.1.5 లక్షల కోట్ల పెట్టుబడులతో ఐదు సెమీ కండక్టర్ ప్లాంట్ల ఏర్పాటును కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఇందులో రెండు ప్లాంట్ల ఏర్పాటు ఇప్పటికే ప్రారంభమైనట్టు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఢిల్లీలో జరుగుతున్న సెమీకాన్ ఇండియా, 2024 సదస్సులో ఆయన ఈ విషయం వెల్లడించారు. ఇప్పటికే 3-4 రాష్ట్రాలు సెమీ కండక్టర్ ప్లాంట్ల ఏర్పాటు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు తెలిపారు. త్వరలో ఉత్తరప్రదేశ్ కూడా ఈ జాబితాలో చేరనుందన్నారు.

నాలుగు నెలల్లో సెమీకాన్ 2.0 పాలసీ

దేశంలో సెమీకండక్టర్ల కంపెనీల ఏర్పాటు కోసం ప్రకటించిన సెమీకాన్ 1.0 పాలసీ గడువు ఇప్పటికే పూర్తయిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. మూడు లేదా నాలుగు నెలల్లో కొత్త సెమీకాన్ 2.0 పాలసీ తీసుకువస్తామన్నారు. ఈ పాలసీ ద్వారా దేశంలో సెమీకండక్టర్ల తయారీకి దోహదం చేసే కీలక లోహాలు, రసాయనాలు, గ్యాస్‌ల ఉత్పత్తికి కూడా చర్యలు తీసుకుంటామన్నారు. సెమీకండక్టర్ల వినియోగ కంపెనీలు కూడా దేశంలోనే సెమీకండక్టర్ల సమగ్ర సదుపాయాలు ఏర్పాటు కావాలని కోరుతున్నట్టు చెప్పారు. సెమీకండక్టర్ల తయారీలో 250 ప్రత్యేక రసాయనాలు, గ్యాస్‌లు వినియోగిస్తారనే విషయాన్ని వైష్ణవ్ గుర్తు చేశారు. అత్యంత స్వచ్ఛంగా ఉండే ఈ కీలక రసాయనాలు, గ్యాస్‌ల ఉత్పత్తి ప్రక్రియ అత్యంత క్లిష్టమైందన్నారు.

2030 నాటికి 50,000 కోట్ల డాలర్ల మార్కెట్

అంతకు ముందు ఇదే సదస్సులో ప్రసంగించిన ప్రధాని మోదీ, ప్రస్తుతం 15,000 కోట్ల డాలర్లుగా (సుమారు రూ.12.60 లక్షల కోట్లు) ఉన్న భారత ఎలక్ట్రానిక్స్ మార్కెట్, 2030 నాటికి 50,000 కోట్ల డాలర్ల స్థాయికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకోవాలని కోరారు. అప్పటికి ఈ పరిశ్రమకు అవసరమైన సెమీకండక్టర్ల నుంచి సమస్త విడి భాగాలు భారత్‌లోనే తయారు కావాలన్నారు. యుద్ధాలు, కొవిడ్ వంటి ఉత్పాతాలు ఎదురైనపుడు కీలక ఎలక్ట్రానిక్స్ పరికరాల సరఫరాకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడకూడదనుకుంటే, భారత సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఆయన తైవాన్, అమెరికా, ఇజ్రాయల్ కంపెనీలను కోరారు. స్మార్ట్‌ఫోన్లు మొదలుకుని విద్యుత్ కార్ల వరకు వినియోగించే సెమీకండక్టర్ల వ్యవస్థ మొత్తం భారత్‌లోనే తయారు కావాలని ప్రధాని కోరారు.

భారత్ బయోటెక్ నుంచి 'ఏవీ0328' వ్యాక్సిన్

హైదరాబాద్: భారత్ బయోటెక్ కంపెనీ మరో సరికొత్త వ్యాక్సిన్ తయారీకి సిద్ధమైంది. యాంటీ బ్యాక్టీరియల్ వ్యాక్సిన్ 'ఏవీ0328' అభివృద్ధి, వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి కోసం అమెరికన్ కంపెనీ అలోపెక్స్‌ఇంక్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ వ్యాక్సిన్‌ను మన దేశంతో పాటు నిరుపేద, దిగువ మధ్యాదాయ దేశాల్లో మార్కెట్ చేస్తుంది. ఇందుకు అలోపెక్స్ కంపెనీకి కొంత మొత్తంలో ఏకకాల ఫీజు చెల్లిస్తుంది. దీంతో పాటు అమ్మకాలపై రాయల్టీ, అమ్మకాలు నిర్దీత స్థాయికి చేరినపుడల్లా ప్రత్యేక చెల్లింపులు చేస్తుంది. 'వ్యాక్సినేషన్ ద్వారా యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌ను తగ్గించే పరిష్కారాలను అభివృద్ధి చేయడం మా లక్ష్యం. ఇందుకోసమే 'ఏవీ0328' వ్యాక్సిన్ కోసం అలోపెక్స్ కంపెనీతో చేతులు కలిపాం. ఇందుకు చాలా గర్వంగా ఉంది' అని భారత్ బయోటెక్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా ఒక ప్రకటనలో తెలిపారు.

బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఇష్యూ సూపర్ హిట్

ఇష్యూ సైజు రూ.6,560 కోట్లు, దాఖలైన బిడ్లు రూ.3 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓకు ఇన్వెస్టర్లు బ్రహ్మరథం పట్టారు. బుధవారంతో ముగిసిన ఈ రూ.6,560 కోట్ల ఐపీఓకు ఏకంగా రూ.3 లక్షల కోట్లకు పైగా విలువైన సబ్‌స్క్రిప్షన్ లభించింది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా కంపెనీ 72,75,75,756 షేర్లను అమ్మకానికి పెట్టగా.. అందుకు 63.60 రెట్ల (4,627 కోట్ల 48 లక్షల 43 వేల 832) షేర్ల కొనుగోలుకు బిడ్లు వచ్చాయని ఎన్ఎస్ఈ డేటా వెల్లడించింది. అర్హులైన సంస్థాగత కొనుగోలుదారుల (క్యూఐబీ) కోసం కేటాయించిన షేర్లకుగాను ఏకంగా 209.36 రెట్ల బిడ్లు దాఖలు కాగా.. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల విభాగ షేర్లకు 41.50 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. రిటైల్ ఇన్వెస్టర్ల కోసం కేటాయించిన షేర్లకు మాత్రం 7.02 రెట్ల బిడ్లు వచ్చాయి. కాగా వాహన విడిభాగాల తయారీ సంస్థ క్రాస్ లిమిటెడ్ ఐపీఓకు సైతం నాటికి 16.81 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. టోలిన్స్ టైర్స్ ఇష్యూకు కూడా 23.87 రెట్ల బిడ్లు వచ్చాయి.

లాభాల స్వీకారంతో మార్కెట్ డౌన్

చైనా ఆర్థిక మందగమన ఆందోళనలతోపాటు అమెరికా ధరల గణాంకాల విడుదల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో ట్రేడింగ్ ట్రెండ్ బలహీనంగా ఉండటంతో దేశీయ మార్కెట్లోనూ ఇన్వెస్టర్లు అమ్మకాలకు పాల్పడ్డారు. టాటా మోటార్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ అండ్ టీ షేర్లలో భారీగా లాభాలు స్వీకరించడంతో ఈక్విటీ సూచీలు ఇంట్రాడే లాభాలను కోల్పోయి నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 398.13 పాయింట్లు క్షీణించి 81,523.16 వద్దకు జారుకుంది. నిఫ్టీ 122.65 పాయింట్ల నష్టంతో 24,918.45 వద్ద క్లోజైంది. దాంతో సూచీ మళ్లీ 25,000 కీలక స్థాయిని కోల్పోయింది. టాటా మోటార్స్ షేరు ఏకంగా 5.74 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది.

ఎంజీ కొత్త కారు విండ్సర్

ప్రారంభ ధర రూ.9.99 లక్షలు



న్యూఢిల్లీ: జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్.. 'విండ్సర్ ఈవీ' పేరుతో సరికొత్త ఎలక్ట్రిక్ కారును బుధవారం మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఇది హ్యాచ్‌బాక్, మల్టీ యుటిలిటీ వెహికిల్ (ఎంయూవీ) ఫీచర్లతో కూడిన తొలి ఎలక్ట్రిక్ 'క్రాసోవర్ యుటిలిటీ వెహికిల్' (ఈ-సీయూవీ) అని కంపెనీ తెలిపింది. మొత్తం మూడు వేరియంట్లలో (ఎక్సైట్, ఎక్స్‌క్లూజివ్, ఎస్సెన్స్) లభించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.9.99 లక్షలు. అయితే, ఇది బ్యాటరీ రహిత ధర. వాహన ఇండస్ట్రీలో తొలిసారిగా కంపెనీ ఈ కారు బ్యాటరీని అద్దెకు (బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్) ఇస్తోంది. ఈ బ్యాటరీ ప్యాక్‌కు కిలోమీటరుకు రూ.3.5 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఎంజీ యాప్ ఈ-హబ్ ద్వారా ఏడాదిపాటు పబ్లిక్ చార్జర్ల వద్ద ఉచితంగా చార్జింగ్ చేసుకునే సౌకర్యం కల్పిస్తోంది. అంతేకాదు, కారు మొదటి యజమానికి జీవితకాలం బ్యాటరీ వారంటీని అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. మూడేళ్ల లేదా 45,000 కి.మీ తర్వాత 60 శాతం బైబ్యాక్ సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. విండ్సర్ ప్రీ-బుకింగ్‌లు తక్షణమే ప్రారంభయ్యాయి. ఈనెల 25 నుంచి టెస్ట్ డ్రైవ్ కోసం ఈ వాహనాన్ని షోరూముల్లో అందుబాటులో ఉంచనున్నారు. వచ్చే నెల 3 నుంచి అధికారిక బుకింగ్ ప్రారంభం కానుంది. దసరా నుంచి డెలివరీని ప్రారంభించే అవకాశం ఉంది. 38 కిలోవాట్ లిథియం అయాన్ బ్యాటరీతో కూడిన ఈ కారు పూర్తి చార్జింగ్‌తో 331 కి.మీ వరకు ప్రయాణించగలదని కంపెనీ వెల్లడించింది. ఏదైనా డీసీ ఫాస్ట్ చార్జర్‌తో 40 నిమిషాల్లో బ్యాటరీని పూర్తిగా చార్జ్ చేయవచ్చు.

కారు ప్రధాన ఫీచర్లు

- 2,700 ఎంఎం వీల్‌బేస్, 1,850 ఎంఎం విడ్త్, 1,677 ఎంఎం ఎత్తు
- 15.6 అంగుళాల గ్రాండ్ వ్యూ టచ్‌స్క్రీన్ విత్ వైర్‌లెస్ కనెక్టివిటీ
- 135 డిగ్రీస్ రిక్లైనింగ్ ఏరో లాంజ్ సీట్స్, ఆటోమెటిక్ క్లైమేట్ కంట్రోల్
- ఇన్ఫినిటీ వ్యూ పనోరమిక్ గ్లాస్ రూఫ్, 604 లీటర్ల బూట్ స్పేస్
- 360 డిగ్రీస్ కెమెరా, యాంబియెంట్ లైటింగ్, 4 ఎయిర్ బ్యాగ్‌లు
- ఫుల్లీ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, ఫ్లష్ ఫిట్టింగ్ డోర్ హ్యాండిల్స్

నాణ్యతతోనే ఉత్పత్తులకు మనుగడ

పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సరైన నాణ్యతా ప్రమాణాలు ఉన్నపుడే ఏ ఉత్పత్తి అయినా మార్కెట్‌లో మనగలుగుతుందని తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి డీ శ్రీధర్ బాబు అన్నారు. క్వాలిటీ కౌన్సిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూఐసీ), హైదరాబాద్ చాప్టర్ 38వ వార్షిక కన్వెన్షన్‌ను ప్రారంభిస్తూ ఆయన ఈ విషయం చెప్పారు. ఉత్పత్తి దశ నుంచే సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించేందుకు వీలుగా కంపెనీలు ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కోరారు. మహాత్మా గాంధీ చెప్పినట్టు కంపెనీలకు 'వినియోగదారుడే రాజు' అన్నారు. తాను కొనే ఉత్పత్తి సరైన నాణ్యతా ప్రమాణాలతో ఉన్నపుడే వినియోగదారుడు సంతృప్తి పడతాడనే విషయాన్ని కంపెనీలు గుర్తుంచుకోవాలన్నారు.

సంగం డెయిరీ లాభం రూ.12 కోట్లు



పొన్నూరుటౌన్ (చేబ్రోలు): సంగం డెయిరీ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1877 కోట్ల టర్నోవర్ సాధించినట్లు కంపెనీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. బుధవారం సంగం డెయిరీ పాలకవర్గ సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రైతులకు బోనస్ చెల్లించిన తర్వాత డెయిరీ లాభం రూ.12 కోట్లని చెప్పారు. రానున్న రోజుల్లో అనంతపురం సహా ఐదు చోట్ల బల్క్ మిల్క్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇటీవలే తెలంగాణలో ప్లాంట్‌ను లాంచనంగా ప్రారంభించామని త్వరలోనే తెలంగాణలో కార్యకలాపాలు ప్రారంభించనునట్లు చెప్పారు. వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు విరాళంగా ఇవ్వాలని కూడా తీర్మానించినట్లు చెప్పారు. వరదలో నష్టపోయిన సంగం పాల ఉత్పత్తిదారులకు 70 మెట్రిక్ టన్నుల పశు దాణాని ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు.



'పెట్ ఫుడ్స్'లోకి గ్రోవెల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అక్వా ఫీడ్, అక్వా హెల్త్‌కేర్, సీఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో ఉన్న గ్రోవెల్ గ్రూపు 'కార్నివెల్' పేరుతో పెంపుడు జంతువుల ఆహార (పెట్ ఫుడ్) రంగంలోకి ప్రవేశించింది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్‌లోని సింగరాయపాలెం వద్ద ఉన్న తన అక్వా ఫీడ్ ప్లాంట్ దగ్గరే రూ.100 కోట్ల పెట్టుబడితో ప్రత్యేక ప్లాంటు ఏర్పాటు చేసింది. పెంపుడు కుక్కలు, పిల్లుల కోసం ప్రస్తుతం ఆరు రకాల పెట్ ఫుడ్స్‌ను మార్కెట్‌లో విడుదల చేసినట్టు గ్రోవెల్ పెట్ న్యూట్రిషన్ బిజినెస్ హెడ్ జేఎస్ రామకృష్ణ చెప్పారు. 2028 నాటికి ఈ మార్కెట్‌లో కనీసం ఎనిమిది శాతం వాటా సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ప్రధాన పెట్ ఫుడ్ బ్రాండ్లతో పోలిస్తే తమ పెట్ ఫుడ్స్ ధర 50 శాతం తక్కువగా ఉంటుందన్నారు. ప్రజల ఆహార అలవాట్లను దృష్టిలో ఉంచుకుని తమ కంపెనీ పెట్ ఫుడ్స్‌ని కూడా వెజ్, నాన్-వెజ్ వేరియంట్లలో మార్కెట్‌లో విడుదల చేసినట్టు రామకృష్ణ తెలిపారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,250 ▲	67,150 ▲	91,500 ▲
ముంబై	71,990 ▲	65,950 ▲	83,400 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

12వ తేదీ

హైదరాబాద్	495	విజయవాడ	530
వరంగల్	497	గోదావరి	525
చిత్తూరు	553	విశాఖపట్నం	535

దజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	118
వరంగల్	107	గుంటూరు	120
కరీంనగర్	107	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	116
కర్నూలు	107	నెల్లూరు	116
విశాఖపట్నం	104	అనంతపురం	116
గోదావరి	118		

స్పోర్ట్స్

మూడోరోజూ టాస్ పడలేదు

అఫ్ఘాన్, కివీస్ టెస్టు మ్యాచ్ రద్దయ్యే చాన్స్

గ్రేటర్ నొయిడా: అఫ్ఘానిస్థాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య టెస్టు మ్యాచ్ రద్దయ్యే అవకాశముందా? అంటే.. పరిణామాలు చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. మూడో రోజు కూడా ఆట మొదలవలేదు. మంగళవారం రాత్రి వర్షం పడడంతో మూడో రోజైన బుధవారం కూడా కనీసం టాస్ పడకుండానే ఆట రద్దయింది. బుధవారం వర్షం లేకున్నా, మ్యాచ్‌కు వేదికైన గ్రేటర్ నొయిడా పిచ్ ఇంకా తడిగానే ఉంది. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం సోమవారమే మ్యాచ్ ప్రారంభమవ్వాలి. అయితే, వారం రోజుల క్రితం ఇక్కడ కురిసిన భారీ వర్షాల కారణంగా అవుట్‌ఫీల్డ్ మొత్తం చిత్తడిగా మారింది. నీరు బయటకు వెళ్లేందుకు ఈ మైదానంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడమే ఇందుకు కారణం. దీంతో తొలి రెండు రోజులు కనీసం టాస్ కూడా వేయకుండానే ఆట రద్దయింది. వరుసగా మూడోరోజు కూడా అదే పరిస్థితి తలెత్తింది. మరో రెండురోజులు నొయిడాలో భారీ వర్షాలు పడే చాన్సుండడంతో టెస్టు మ్యాచ్ మొదలవడంపై సందేహాలు నెలకొన్నాయి. దాదాపు మ్యాచ్ రద్దయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



రాజ్‌కుమార్


రాజ్‌కుమార్ హ్యాట్రిక్

సెమీస్‌లో భారత్

మలేసియాపై భారీ విజయం

ఆసియా చాంపియన్స్ ట్రోఫీ

హులున్‌బూయిర్ (చైనా): డిఫెండింగ్ చాంపియన్ భారత్ ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో జోరు కొనసాగిస్తూ సెమీఫైనల్‌కు దూసుకుపోయింది. యువ స్ట్రయికర్ రాజ్‌కుమార్ హ్యాట్రిక్‌తో అదరగొట్టడంతో..బుధవారం జరిగిన మ్యాచ్‌లో మనోళ్లు 8-1తో మలేసియాను చిత్తు చేశారు. రాజ్‌కుమార్ (3, 25, 33 నిమిషాలు)తోపాటు అరైజీత్ సింగ్ (6, 39ని.), జుగ్‌రాజ్ సింగ్ (7వ), హర్మన్‌ప్రీత్ సింగ్ (22వ), ఉత్తమ్ సింగ్ (40వ) గోల్స్ సాధించారు. మలేసియా తరఫున ఏకైక గోల్‌ను అఖీముల్లా (34వ) చేశాడు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం అందుకున్న భారత్ తొమ్మిది పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. మొత్తం ఆరు జట్లు రౌండ్ రాబిన్ లీగ్‌లో తలపడుతున్నాయి. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు ఈనెల 16న జరిగే సెమీస్‌లో ఢీకొంటాయి. 17న ఫైనల్ జరుగుతుంది. గత మ్యాచ్‌ల్లో చైనా, జపాన్‌పై గెలుపొందిన భారత్..గురువారం కొరియాతో, శనివారం పాకిస్థాన్‌తో ఆడుతుంది.



కాసుల సునామీ

రూ.11,637 కోట్లు

వన్డే వరల్డ్ కప్‌తో ఆదాయం

న్యూఢిల్లీ: గత ఏడాది వన్డే వరల్డ్ కప్‌ను భారత్ విజయవంతంగా నిర్వహించింది. నిరుడు అక్టోబరు ఐదు నుంచి నవంబరు 19 వరకు దేశంలోని 10 కేంద్రాలలో జరిగిన ఈ మెగా టోర్నీకి రికార్డు స్థాయిలో 12.50 లక్షల మంది హాజరయ్యారు. టోర్నీ ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు దండిగా ఆదాయం లభించింది. ఏకంగా రూ. 11,637 కోట్లు భారత ఆర్థిక వ్యవస్థకు సమకూరినట్టు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుధవారం వెల్లడించింది. ఈమేరకు మెగా టోర్నమెంట్‌కు సంబంధించిన సమగ్ర ఆర్థిక నివేదికను వెలువరించింది. టోర్నమెంట్ నిర్వహణకు బీసీసీఐ, ఐసీసీ పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించాయి. ముఖ్యంగా..మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన వేదికల క్రికెట్ సంఘాలు మైదానాలలో ఆధునిక వసతుల కల్పనకు భారీగా ఖర్చు చేశాయి. స్టేడియాల ఆధునీకీకరణ వల్ల దేశంలోని ఎన్నో పరిశ్రమలకు నేరుగా లబ్ధి చేకూరింది. 'ఐసీసీ 2023 పురుషుల వన్డే ప్రపంచ కప్ క్రికెట్ ఆర్థిక సత్తా ఎలాంటిదో తెలియజేసింది. ఈ టోర్నీ వేలాది ఉద్యోగాలను సృష్టించింది. భారత్‌ను పర్యాటక స్వర్గధామంగా నిరూపించింది. ఐసీసీ ఈవెంట్లు క్రికెట్ ఫ్యాన్స్‌ను అలరించడమేకాదు ఆతిథ్య దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఊతంగా నిలుస్తాయని స్పష్టమైంది' అని ఐసీసీ సీఈవో జెఫ్ అలర్డైస్ పేర్కొన్నారు. వన్డే వరల్డ్ కప్‌వల్ల ప్రధానంగా లాభపడింది పర్యాటక రంగం. ఈ ఒక్క రంగమే ఏకంగా రూ. 7200 కోట్లకుపైగా ఆర్జించింది. వసతి, రవాణా, ఆహార పానీయాల రంగాల ద్వారా రూ. 4,300 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. టోర్నీకి హాజరైన 12.50 లక్షల మందిలో 75 శాతం మంది తొలిసారి వన్డే ప్రపంచ కప్‌నకు తరలి రావడం గమనార్హం. ఇది 50 ఓవర్ల ఫార్మాట్‌కు పెరుగుతున్న ఆదరణగా ఐసీసీ పేర్కొంది. టోర్నమెంట్‌కు వీక్షణకు విచ్చేసిన అంతర్జాతీయ ప్రయాణికుల్లో అధికులు దేశంలోని పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. వీరివల్ల ఆర్థిక వ్యవస్థకు రూ. 2,300 కోట్ల అదనపు ఆదాయం లభించింది. ఇక..టోర్నమెంట్ 48 వేల మందికి ఫుల్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు కల్పించింది.

అదంతా ఫొటో షో!

- ఉష రాజకీయం
- ఐవోఏ 'చీప్' ట్రిక్స్
- దుయ్యబట్టిన ఫొగట్



న్యూఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) అధ్యక్షురాలు పీటీ ఉషపై రెజ్లర్ వినేశ్ ఫొగట్ మండిపడింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఉష రాజకీయాలు చేసిందని ఆరోపణలు చేసింది. ఆమె తనకు అండగా నిలవలేదని.. కేవలం ఫొటోకు ఫోజులిచ్చిందని విమర్శించింది. ఇటీవలే జరిగిన ఒలింపిక్స్ రెజ్లింగ్ 50 కిలోల విభాగంలో ఫొగట్ ఫైనల్ చేరినా.. 100 గ్రాములు అధిక బరువు ఉందనే కారణంతో ఆమెపై అనర్హత వేటు పడిన సంగతి తెలిసిందే. తనకు కనీసం రజతమైనా ఇవ్వాలని వినేశ్ చేసిన అప్పీలును క్రీడా మధ్యవర్తిత్వ కోర్టు (కాస్) కొట్టేసింది. అయితే, బరువు తగ్గే ప్రక్రియలో ఆమె నీరసించడంతో క్రీడాగ్రామంలో ఆసుపత్రిలో చేర్చారు. ఫొగట్‌ను ఉష పరామర్శించగా.. ఆ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే, రాజకీయాల్లో భాగంగానే ఉష ఆ ఫొటోను పోస్టు చేసిందని ఓ ఇంటర్వ్యూలో వినేశ్ దుయ్యబట్టింది. 'ఆసుపత్రిలో బెడ్‌పై ఉన్నప్పుడు ఉష నన్ను పరామర్శించింది. అప్పుడు ఒక ఫొటో తీసుకొన్నారు. రాజకీయాల్లో మూసిన తలుపుల వెనుక ఎన్నో జరుగుతాయి. పారిస్‌లో కూడా జరిగింది అలాంటిదే. అందుకే నా హృదయం ముక్కలైంది. నా రిటైర్మెంట్ నిర్ణయాన్ని పునః సమీక్షించుకోవాలంటూ ఎంతో మంది కోరారు. కానీ, నేనెందుకు కొనసాగాలి? రాజకీయాలనేవి ప్రతిచోటా ఉన్నాయ'ని వినేశ్ ఆవేదన వ్యక్తం చేసింది. అసలు ఫొటో తీసుకున్నట్టే తనకు తెలియదని తెలిపింది. 'నాకు మద్దతుగా ఉన్నామనే విధంగా షో చేసేందుకు వచ్చి ఫొటో దిగారు. అందుకు నా అనుమతి కూడా తీసుకోలేదు. సోషల్ మీడియాలో మాత్రం ఎంతో ప్రచారం చేసుకొన్నారు. వాళ్లు చేసిందంతా షో తప్ప ఏమీలేద'ని ఆమె ఘాటుగా విమర్శించింది. హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో జులానా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున వినేశ్ బుధవారం నామినేషన్ దాఖలు చేసింది.

వ్రితికి స్వర్ణం, సంపత్‌కు కాంస్యం



వ్రితి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సీనియర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో తెలుగు రాష్ట్రాల స్విమ్మర్లు వ్రితి అగర్వాల్ స్వర్ణం, సంపత్‌కుమార్ యాదవ్ కాంస్య పతకాలు కొల్లగొట్టారు. మంగళూరులో బుధవారం జరిగిన మహిళల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన వ్రితి 17 నిమిషాల 45.63 సెకన్లలో రేసు ముగించి విజేతగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంపత్ 800 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో 8 నిమిషాల 28.35 సెకన్లలో రేసు ముగించి మూడో స్థానంలో నిలిచాడు.

అథ్లెటిక్స్‌లో వినోద్‌కు రజతం




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దక్షిణ ఆసియా జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ (శాఫ్)లో వరంగల్ అథ్లెట్ బానోతు వినోద్ కుమార్ రజత పతకం సాధించాడు. చెన్నైలో బుధవారం ముగిసిన 800 మీటర్ల పరుగును వినోద్ 1 నిమిషం 50.07 సెకన్లలో పూర్తి చేసి రెండోస్థానంలో నిలిచాడు. వినోద్ స్వస్థలం వర్ధన్నపేట మండలంలోని ఏనుగల్లు.

దృష్టంతా రింకూ, అయ్యర్‌పైనే

- దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ నేటినుంచి

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి) : దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ మ్యాచ్‌లు గురువారం నుంచి పూర్తిగా అనంతపురంలో జరగనున్నాయి. ఇండియా-ఏతో ఇండియా-డి, మరో మ్యాచ్‌లో ఇండియా-బితో ఇండియా-సి ఆడనున్నాయి. తొలి రౌండ్‌లో స్టార్ ఆటగాళ్లతో కళకళలాడినా.. బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్ నేపథ్యంలో టీమిండియాకు ఎంపికైన వారిని ఆయా జట్లు రిలీజ్ చేశాయి. దీంతో జాతీయ జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన రింకూ సింగ్ లాంటి ప్లేయర్లు టోర్నీకి ప్రత్యేక ఆకర్షణగా మారారు. గిల్ కూడా వెళ్లిపోవడంతో ఆ స్థానంలో మయాంక్ అగర్వాల్ ఇండియా-ఎ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇండియా-డి కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, రజత్ పటీదార్, పేసర్ నవ్‌దీప్ సైనీ, కేఎస్ భరత్‌లు అదిరే ప్రదర్శనతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించడానికి ఇదో సువర్ణావకాశం.



'బుచ్చిబాబు' విజేత హైదరాబాద్

- ఏడేళ్ల తర్వాత ట్రోఫీ కైవసం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): బుచ్చిబాబు ఇన్విటేషన్ ఆలిండియా క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ఏడేళ్ల తర్వాత విజేతగా నిలిచింది. తమిళనాడులోని దిండిగల్‌లో బుధవారం ముగిసిన ఫైనల్లో చత్తీస్‌గఢ్‌పై హైదరాబాద్ 243 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ బ్యాటర్లు రోహిత్ రాయుడు సెంచరీ (155)తో, అభిరథ్ (85 పరుగులు), రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ రాహుల్ సింగ్ (68 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ 8, అనికేత్ రెడ్డి 6 వికెట్లు తీసి హైదరాబాద్ గెలుపులో కీలకపాత్ర పోషించారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు రోహిత్‌కు లభించింది. అంతకుముందు హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 417, చత్తీస్‌గఢ్ 181కు, రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 281, చత్తీస్‌గఢ్ 274కు ఆలౌటయ్యాయి.

ముంబైతో రోహిత్ ప్రయాణం ముగిసినట్టే!



న్యూఢిల్లీ: ఐపీఎల్ మెగా వేలానికి సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో రోహిత్ శర్మ భవితవ్యం గురించిన చర్చే ఎక్కువగా జరుగుతోంది. గత సీజన్‌లో ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా హిట్‌మ్యాన్‌ను తప్పించి హార్దిక్ పాండ్యాకు జట్టు పగ్గాలప్పగించారు. అప్పటి నుంచి రోహిత్ ఫ్రాంచైజీ మారతాడనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో శర్మ జట్టు మారడం దాదాపుగా ఖాయమని భారత మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా ఓ యూట్యూబ్ చానెల్‌కు చెప్పాడు. 'ముంబై మాత్రం అతడిని అట్టిపెట్టుకోదని అనుకొంటున్నా. శర్మ కూడా వీడాలనే అభిప్రాయంతో ఉన్నాడు. అయితే, అతడు వేలానికి రాకుండా.. మరో ఫ్రాంచైజీకి ట్రేడ్ చేసే అవకాశం ఉంద'ని చోప్రా తెలిపాడు. ముంబైతో అతడి సుదీర్ఘ ప్రయాణం ముగిసిందనైతే చెప్పగలనన్నాడు. సూర్యకుమార్ కూడా ఎంఐను వీడతాడనే ఊహాగానాలు వినవస్తున్నాయి. కానీ, కెరీర్‌లో ఈ దశలో సూర్య ముంబైను వీడతాడని తానైతే భావించడం లేదని చోప్రా చెప్పాడు. ఫ్రాంచైజీ కూడా అలాంటి ఆలోచనతో ఉన్నట్టు తనకు సమాచారం లేదన్నాడు.

భారత జట్ల శుభారంభం

మొరాకో, జమైకాపై గెలుపు

చెస్ ఒలింపియాడ్

బుడాపెస్ట్: చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల జట్టు శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మొదటి రౌండ్‌లో మనోళ్లు 4-0తో మొరాకోను చిత్తు చేశారు. ఈ విజయంలో భారత్‌కు రెండు పాయింట్లు లభించాయి. నల్లపావులతో ఆడిన అర్జున్ ఇరిగేసి 40 ఎత్తుల్లో జాక్వెస్ ఎల్బిలాపై గెలుపొందాడు. నల్లపావులతోనే బరిలో దిగిన పెంటేల హరికృష్ణ 45 ఎత్తుల్లో అనాస్ మొయాద్‌ని ఓడించాడు. ఇక ప్రజ్ఞానంద-మహ్మద్ తిసిర్‌పై, విదిత్ గుజ్‌రాతీ-మెహ్దీపై నెగ్గడంతో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. మహిళల విభాగంలో భారత్ 3.5-0.5తో జమైకాపై గెలిచింది.

కూల్చివేతలను హీరోయిజం అనుకుంటున్న సీఎం

- నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలా?: ఈటల
- కూల్చివేతలతో నిరుపేదలకే అన్యాయం: డీకే అరుణ
- బాధిత పేదలకు ప్రత్యామ్నాయం చూపించాలి: రఘునందన్



నల్లగొండ/జహీరాబాద్/కొత్తగూడెం, సెప్టెంబరు 11: "హైదరాబాద్‌లో 'హైడ్రా' చేపడుతున్న కూల్చివేతల తీరు సరికాదు. అక్రమ నిర్మాణాలంటూ.. కట్టడాలను కూల్చివేయిస్తుండడాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హీరోయిజం అనుకుంటున్నారు. ఉరి శిక్ష పడ్డ వ్యక్తిని ఉరి వేసే ముందు చివరి కోరిక ఏమైనా ఉందా? అని అడుగుతారు. కట్టడాల కూల్చివేతలకు ముందు ప్రభుత్వం కనీసం నోటీసులు కూడా ఇవ్వడం లేదు" అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. నల్లగొండ ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల వల్ల గ్రామాల్లో ప్రజలు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. చెరువుల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టారంటూ హైడ్రా పేరిట చేపడుతున్న కూల్చివేతలతో నిరుపేదలకే అన్యాయం జరుగుతోందని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోఆమె మాట్లాడుతూ.. హైడ్రా.. ఓ డ్రామాలా తయారైందని విమర్శించారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరిట పేద ప్రజల ఇళ్లను కూలగొట్టడం, ఆస్తి నష్టం చేయడం సమంజసం కాదని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. కూల్చివేతల వల్ల బాధితులవుతున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నయం చూపించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోండి

- హైకోర్టు తీర్పును అమలు చేయండి
- అసెంబ్లీ కార్యదర్శికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పార్టీ మారిన ఎమ్మెల్యేలపై హైకోర్టు తీర్పుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ కార్యదర్శిని బుధవారం కోరింది. ఇందుకు సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, పాడి కౌశిక్ రెడ్డి అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులకు ఓ పిటిషన్ సమర్పించారు. అనంతరం వారు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై నాలుగువారాల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కాలయాపన లేకుండా అమలు చేయాలని కార్యదర్శిని కోరామని తెలిపారు.

సాయుధ పోరాటంలో బీజేపీ పాత్రే లేదు:వీహెచ్

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విమోచన దినోత్సవానికి అమిత్ షా వస్తున్నట్లుగా బీజేపీ చెబుతోందని, వాస్తవానికి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో బీజేపీ పాత్రే లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హన్మంతరావు అన్నారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అని, దేవుడి పేరుతో తాము రాజకీయాలు చేయబోమని అన్నారు. మహిళా వర్శిటీకి చాకలి అయిలమ్మ పేరు పెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయం.. మంచి నిర్ణయమన్నారు. 1948లో నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో 8 మంది స్కూలు విద్యార్థులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించినందుకు అప్పటి పాలకులు వారిని కాల్చి చంపారని, ఆ అమరుల స్మారక నిర్మాణానికి సెప్టెంబరు 17న పునాది వేయనున్నామని చెప్పారు. మహిళా వర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం పట్ల కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇలాంటి మంచి నిర్ణయాలకు ఆస్కారముంటుందని కితాబునిచ్చారు.

విదేశీ గడ్డపై దేశాన్ని కించపరుస్తారా?

- దేశ వ్యతిరేక శక్తులతో రాహుల్ భేటీ అవుతున్నారు: లక్ష్మణ్

అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారతదేశాన్ని కించపరిచేలా మాట్లాడటం సిగ్గుచేటు అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. భారతదేశం పట్ల, ప్రజాస్వామ్యం పట్ల, ప్రజలను అవమానించేలా విమర్శలు చేయడం ఆయనకు పరిపాటిగా మారిందని విమర్శించారు. భారత వ్యతిరేక శక్తులతో రాహుల్ సమావేశం అవుతున్నారన్నారు. అణువణువునా భారతదేశాన్ని వ్యతిరేకిస్తూ, అవకాశం దొరికినప్పుడల్లా విషం చిమ్ముతున్న అమెరికా శాసనసభ్యురాలు, పాకిస్తాన్ మద్దతుదారు అయిన ఇల్హాన్ ఒమర్‌తో రాహుల్ సమావేశం అవ్వడాన్ని తప్పుపట్టారు. పరిస్థితులు అనుకూలిస్తే దేశంలో రిజర్వేషన్లను రద్దు చేస్తామని రాహుల్ వ్యాఖ్యానించడాన్ని ఖండించారు. రిజర్వేషన్ల విషయంలో రాహుల్ అసలు రంగు, కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందన్నారు.

అనర్హులను గుర్తించడంలో సహకరించండి

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సీఈవో సుదర్శన్‌రెడ్డి

కొత్త ఓటర్ల నమోదు, ఇప్పటికే నమోదైన వారిలో అనర్హులను గుర్తించి, నిర్దిష్టమైన ఓటరు జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలో కొత్తగా ఓటరు నమోదు, జాబితా పరిశీలనపై రాజకీయపార్టీల ప్రతినిధులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయించేందుకు బూత్‌లెవల్ అధికారులతోపాటు ఆయా పార్టీలకు చెందిన బూత్‌లెవల్ అసిస్టెంట్లు ఇంటింటి ప్రచారంలో పాల్గొనాలని సూచించారు. బీఎల్‌వోలకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని, ఓటరు జాబితా క్రమబద్ధీకరణకు చొరవచూపాలని కోరారు.

సాయుధ పోరాట వీరులకు రెడ్ సెల్యూట్

- వీరులను స్మరించుకుంటూ నగరంలో సీపీఐ ర్యాలీ

హైదరాబాద్, సెప్టెంబరు 11: తెలంగాణ విలీన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సాయుధ పోరాట యోధులను స్మరించుకుంటూ సీపీఐ పార్టీ హైదరాబాద్‌లో రెడ్ సెల్యూట్ ర్యాలీని నిర్వహించింది. ట్యాంక్‌బండ్ నుంచి లిబర్టీ వరకు ఈ ర్యాలీ సాగింది. పార్టీ శ్రేణులు ఎర్ర చొక్కాలు ధరించి ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఫలితమే భారతదేశంలో హైదరాబాద్ సంస్థాన విలీనమని గుర్తుచేశారు. అంతటి మహత్తర పోరాటం జరిగినా నేటికీ పాలకులు అధికారికంగా విలీన దినోత్సవాన్ని నిర్వహించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ సాయుధ పోరాటంలో 4వేల మంది కమ్యూనిస్టులు వీర మరణం పొందారన్నారు. అది హిందూ, ముస్లింల పోరాటం కాదని, 90 శాతం మంది మట్టి మనుషులు బందూకులుపట్టి నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడిన మహోన్నత ఉద్యమమని పేర్కొన్నారు. పోరాట చరిత్రను వక్రీకరించడం దుర్మార్గమని చాడ వెంకటరెడ్డి తెలిపారు.

మంత్రి కోమటిరెడ్డికి భౌమాకోన్ ఎక్స్‌పో ఇండియా ఆహ్వానం

అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఎక్విప్‌మెంట్ మ్యాన్‌ఫ్యాక్చరర్స్‌తో కలిసి మెస్సే మ్యూంచెన్ ఇండియా సంస్థ డిసెంబరు 11 నుంచి 14 వరకు గ్రేటర్ నోయిడాలో నిర్వహిస్తున్న ప్రతిష్మాత్మక భౌమాకోన్ ఎక్స్‌పో ఇండియాకు హాజరు కావాలని కోరుతూ నిర్వాహకులు బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

కులగణనపై హైకోర్టు తీర్పును అమలుచేయాలి

- జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

పంజాగుట్ట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను నిర్ధారించిన తర్వాతనే స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కులగణనను ప్రారంభించడానికి రోడ్ మ్యాప్ ప్రకటించాలని, సీఎం రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలను నిర్వహిస్తామని స్పష్టంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. త్వరలోనే దేశవ్యాప్తంగా కులగణన జరిగే అవకాశం ఉందన్నారు. హైకోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయాలని లేదంటే తాము చేస్తున్న పోరాటాన్ని ఆపేది లేదన్నారు. ఈ నెల 25న వేలాది మందితో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

కోచింగ్ కేంద్రాలపై సర్కార్ నియంత్రణ!

ఫీజుల నిర్ధారణపై కమిటీ

- 1600 పాఠశాలల్లో టీచర్ల బదిలీ
- అప్పర్ ప్రైమరీ స్కూళ్ల విలీనం
- డిగ్రీలో ఉద్యోగాలిచ్చే కోర్సులు
- పాలిటెక్నిక్ కాలేజీలు ఇంజనీరింగ్ కాలేజీలుగా అప్ గ్రేడ్
- క్యాబినెట్ సబ్‌కమిటీలో దుద్దిళ్ల





హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోచింగ్ కేంద్రాలను నియంత్రించాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా అభ్యర్థుల భద్రత, ఫీజుల వసూలు వంటి విషయాల్లో ఒక చట్టపరమైన విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను పరిశీలిస్తున్నారు. విద్యారంగ సంస్కరణలపై సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో సబ్ కమిటీ సభ్యురాలు మంత్రి సీతక్క, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ లింబాద్రి, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ శ్రుతి ఓఝా, విద్యాశాఖ స్పెషల్ సెక్రటరి హరిత, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్లు, నీట్, ఎంసెట్ వంటి ప్రవేశ పరీక్షలకు శిక్షణనిచ్చే సంస్థలపై కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను రాష్ట్రంలో కూడా అమలు చేస్తామని వెల్లడించారు. కోచింగ్ సెంటర్లపై నియంత్రణ లేకపోవడం వల్ల అభ్యర్థుల భద్రత, ఫీజుల భారం వంటి అంశాలపై ఎటువంటి చర్యలు తీసుకోలేకపోతున్నట్లు తెలిపారు. కోచింగ్ సెంటర్ల నియంత్రణపై కేంద్రం గైడ్ లైన్స్ ను అమలు చేసి వీటిని కట్టడి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ప్రైవేటు స్కూళ్లు, ఇంటర్మీడియట్ కళాశాల ఫీజుల నిర్ధారణపై నియంత్రణ కమిటీ ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్లను వేర్వేరుగా నడపడం వల్ల మానవ వనరులు వృథా అవుతున్నాయని, ఈ రెండింటిని విలీనం చేసే అంశంపై అధ్యయనం చేసి నివేదిక అందించాలని విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంను ఆదేశించారు. విద్యార్థులు లేని 1600 పాఠశాలల్లోని ఉపాధ్యాయులను ఇతర స్కూళ్లకు బదిలీ చేయాలని సూచించారు. డిగ్రీ కళాశాలల్లో బీఏ కోర్సుల పాఠ్య ప్రణాళికలో మార్పులు చేసి విద్యార్థులను ఉద్యోగాలకు సంసిద్ధం చేసేలా శిక్షణ ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోని 9 పాలిటెక్నిక్ కాలేజీలను ఇంజనీరింగ్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసే పనులను వేగవంతం చేయాలని సూచించారు. మాసబ్ ట్యాంక్, రామంతాపూర్, వరంగల్, నిజామాబాద్, మహబూబ్ నగర్, నల్గొండ, కొత్తగూడెం, సికింద్రాబాద్, కులీకుతుబ్ షా పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజనీరింగ్ కాలేజీలను ప్రారంభిస్తామని తెలిపారు. విద్యాప్రమాణాల్లో రాష్ట్రం 34వ స్థానంలో ఉండటం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. రెండేళ్లలో ఈ దుస్థితి నుంచి బయటపడాలని విద్యాశాఖ ఉన్నతాధికారులకు సూచించారు. డిగ్రీ కాలేజీల్లోని పబ్లిక్ పాలసీ విద్యార్థులను ఏడాది పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల వద్ద ఇంటర్నీలుగా పని చేసే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. దీని వల్ల వారికి ప్రభుత్వ పాలనపై అవగాహన కలుగుతుందని తెలిపారు. విద్యా వ్యవస్థలో కృత్రిమ మేధను వినియోగించాలని కోరారు. పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులు చదివే విద్యార్థులకు పరిశ్రమల్లో ఆన్ హ్యాండ్ శిక్షణనిస్తే వారికి వెంటనే ఉద్యోగాలు దొరుకుతాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల వినూత్న ఆలోచనలు, సృజనను బయటకు తెచ్చేలా ప్రతి కళాశాల డిజిటల్ మ్యాగజైన్‌లను నడపాలని సూచించారు. బీకాం, బీబీఏ, ఎంబీఏ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ సంస్థల్లో శిక్షణ ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. ట్రిపుల్ ఐటీల్లో బయో సైన్సెస్, ఫార్మా కోర్సులను వచ్చే ఏడాది నుంచే ప్రవేశపెట్టేలా పాఠ్యాంశాలు రూపొందించాలని ఆదేశించారు.

విద్యార్థులకు అవగాహన కల్పించాలి: మంత్రి సీతక్క

విద్యార్థులను సమాజం కోసం ఆలోచించేలా తీర్చిదిద్దాలని మంత్రి సీతక్క సూచించారు. మహిళలపై అరాచకాలకు పాల్పడితే ఎలాంటి శిక్షలుంటాయో పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ఆదేశించారు. 5-6 తరగతుల టెక్స్ బుక్‌లలో ఈ అంశాలను పాఠాలుగా చేర్చాలని తెలిపారు.

హైటెన్షన్ చార్జీల హేతుబద్ధీకరణ

- 11 కేవీతో సమానంగా.. 33, 132 కేవీ చార్జీల సవరణ
- నిర్ణయించిన డిస్కమ్‌లు
- వారం రోజుల్లో ఏఆర్ఆర్ దాఖలు

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హైటెన్షన్(హెచ్‌టీ) చార్జీలను హేతుబద్ధీకరించాలని డిస్కమ్‌లు నిర్ణయించాయి. వీకల్లోతు నష్టాల్లో ఉన్న డిస్కమ్‌లు.. చార్జీల పెంపుపై దృష్టి సారించాయి. ఈ మేరకు వారం రోజుల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక ఆదాయ అవసరాలు(ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనలను తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి(టీజీఈఆర్సీ)లో దాఖలు చేయనున్నాయి. ఈ పెంపు ప్రభావం గృహ వినియోగదారులకు వర్తించబోదని తెలుస్తోంది. ప్రస్తుతం హెచ్‌టీ వినియోగదారులు 11కేవీ కేటగిరీలో యూనిట్‌కు రూ.7.65, 33కేవీ కేటగిరీలో యూనిట్‌కు రూ.7.15, 123కేవీ వర్గంలో రూ.6.65 చొప్పున చెల్లిస్తున్నారు. ఇప్పుడు డిస్కమ్‌లు 33కేవీకి సమానంగా మిగతా రెండు కేటగిరీలకు కూడా యూనిట్‌కు రూ.7.65 చొప్పున వసూలు చేయడానికి ప్రతిపాదనలను సిద్ధం చేశాయి. డిమాండ్ లేని సమయంలో విద్యుత్తు వినియోగాన్ని ప్రోత్సహించేలా వెసులుబాటు కల్పిస్తున్న 'టైమ్ ఆఫ్ డే టారిఫ్'లోనూ హేతుబద్ధీకరణతో మార్పులు చేయాలని డిస్కమ్‌లు నిర్ణయించాయి. ప్రస్తుతం 42 రకాల హెచ్‌టీ వినియోగదారులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నిజానికి డిస్కమ్‌లు గడిచిన పదేళ్లలో రూ.64,227 కోట్ల మేర నష్టాలను మూటగట్టుకున్నాయి. నెలకు సగటున రూ.1000 కోట్ల మేర లోటును ఎదుర్కొంటున్నాయి. గత ప్రభుత్వం సర్దుబాటు చెల్లింపుల హామీని నిలుపుకోలేదని తెలుస్తోంది. హెచ్‌టీ టారిఫ్ హేతుబద్ధీకరణతో నష్టాల నుంచి తాత్కాలిక ఊరట లభిస్తుందని డిస్కమ్‌లు భావిస్తున్నాయి.

ప్రవాసీ భారతీయ బీమా పథకాన్ని సహజ మరణాలకూ వర్తింపజేయాలి

- ప్రవాసీ బీజేపీ నాయకుల డిమాండ్

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): విదేశాల్లో పని చేస్తున్న ప్రవాస భారతీయులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రవాసీ భారతీయ బీమా యోజన పథకం కింద సహజ మరణాలను కూడా చేర్చాలని తెలంగాణ ప్రవాసీయుల ప్రతినిధి బృందం కోరింది. ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లో ప్రమాదవశాత్తు మరణిస్తున్న ప్రవాసీయుల కోసం అమలు చేస్తున్న ప్రవాసీ భారతీయ బీమా యోజన పథకం కింద రూ.10 లక్షల పరిహారం చెల్లిస్తున్నా.. దీనివల్ల ఎవరికీ పెద్దగా ప్రయోజనం చేకూరడం లేదని బహ్రెయిన్‌లోని తెలంగాణ ప్రవాసీ ప్రముఖుడు, ప్రవాసీ బీజేపీ నాయకుడు గవ్వలపల్లి వెంకటస్వామి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కోరింది. ఈ మేరకు అంకాపూర్ రాజరెడ్డి (బహ్రెయిన్), పండరీ (సౌదీ)లతో పాటు గల్ఫ్ నుంచి తిరిగి వెళ్లిన వీరేంద్ర కుమార్, రాజేశ్వర్‌లు ఇటీవల కేంద్రమంత్రితో సమావేశమై వినతిపత్రం సమర్పించారు. ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డితో కూడా సమావేశమై ఇదే అంశాన్ని ప్రస్తావించింది.

ఆ పదిమందికి సిగ్గుంటే
రాజీనామా చేయాలి

- లేదంటే చీర, గాజులు పంపిస్తా.. వేసుకొని తిరగండి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయమని, హైకోర్టు తీర్పు నేపథ్యంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు తప్పదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ పార్టీ ఫిరాయించిన ఆ పదిమంది ఎమ్మెల్యేలకు సిగ్గు, శరం ఉంటే.. స్పీకర్ నిర్ణయానికి ముందే రాజీనామా చేయాలన్నారు. లేదంటే ఆ పదిమందికి చీరలు, గాజులు కొరియర్ చేస్తా.. వేసుకొని తిరగండి అంటూ ఎద్దేవా చేశారు. బిగ్ ఛీటర్ అయిన దానం నాగేందర్ మాజీ ఎమ్మెల్యేగా మిగిలిపోతారని, పొద్దున కేసీఆర్ దగ్గర బ్యాగులు తీసుకువెళ్లి సాయంత్రం కాంగ్రెస్‌లో చేరిన మోసగాడు కడియం శ్రీహరి అని, ఆయనకు స్టేషన్‌ఘన్‌పూర్‌లో డిపాజిట్ కూడా దక్కదన్నారు. గత పదేళ్లలో ఒక్క ఎమ్మెల్యేకూ కేసీఆర్ వ్యక్తిగతంగా పార్టీ కండువా కప్పలేదని, అలా కప్పినట్లుగా చూపితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. కాంగ్రెస్ నేతలు చెబుతున్నట్లుగా అరికెపూడి గాంధీ మా పార్టీ సభ్యుడే అయితే తెలంగాణ భవన్‌కు రావాలని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఫిరాయింపులు షురు చేసిందే కేసీఆర్

- చీర, గాజులు ఆయనకు పంపు
- కాంగ్రెస్ మహిళా నేతల ఫైర్

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యేల ఫిరాయింపులు మొదలు పెట్టిందే కేసీఆర్ అని.. చీర, గాజులు ఆయనకు పంపాలని కౌశిక్‌రెడ్డికి మహిళా కార్పొరేషన్.. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్ పర్సన్లు శోభారాణి, కాల్వ సుజాత, అధికార ప్రతినిధులు భవానీరెడ్డి, సంధ్యారెడ్డి సూచించారు. ఇతర పార్టీల నాయకుల చేరికతోనే టీఆర్ఎస్ పార్టీ పుట్టిందని, కేసీఆర్ రాజకీయ పుట్టుక ఎక్కడుందో చూసుకోవాలని అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పాడి కౌశిక్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకుని విచారణకు పిలవాలని మహిళా కమిషన్‌ను కోరారు. మహిళల్ని అగౌరవపరిస్తే ఆయనకు చెప్పుదెబ్బలు తప్పవన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి.. మెంటల్ కౌశిక్‌గా మారి తలతిక్కగా మాట్లాడుతున్నారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే మట్టా రాగమయి ధ్వజమెత్తారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. పదేళ్లపాటు ఫిరాయింపులను ప్రోత్సహించిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు ఏం పంపుతావని ప్రశ్నించారు. మహిళల్ని అవమానించిన కౌశిక్‌రెడ్డిపై తక్షణమే కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని.. ఆయనపై చర్యలు తీసుకోవాలని శాసనసభ స్పీకర్‌ను ఆమె కోరారు.



రేవంత్ తీరుతో పెట్టుబడులు రావట్లేదు

- హామీలు నెరవేర్చలేక హైడ్రా పేరిట డ్రామాలు
- ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది: హరీశ్

నర్సాపూర్, సెప్టెంబరు 11: పది నెలల కాంగ్రెస్ పాలనలో ఏ వర్గానికీ న్యాయం జరగలేదని, నమ్మి ఓట్లేసిన ప్రజలందర్నీ ఆ పార్టీ మోసం చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు దుయ్యబట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 41 లక్షల మంది రైతులకు రుణ మాఫీ చేయాల్సి ఉండగా, కేవలం 21 లక్షల మందికే వర్తింపజేసి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మెదక్ జిల్లాలోని నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతు భరోసాను ఎగ్గొట్టిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. పంటల బీమా అమలు చేయకపోవడంతో వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు అతీగతీ లేకుండా పోయిందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించడం వల్లే ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. పది నెలలుగా పంచాయతీలకు పైసా కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. హామీలు నెరవేర్చడం చేతకాక హైడ్రా పేరిట డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ సర్కారు తీరు వల్ల రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా దెబ్బతిందని, హైదరాబాద్ ఇమేజ్ తగ్గడంతో పెట్టుబడులూ రావట్లేదని ఆరోపించారు. ప్రజల ఉసురు పోసుకోవడం తప్ప, ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. కేంద్రం నుంచి ఉపాధిహామీ పథకం కింద రూ.400 కోట్లు వస్తే.. ఆ నిధులనూ గ్రామాలకు ఇవ్వకుండా మళ్లించారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ కూడా రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. పక్క రాష్ట్రమైన ఏపీకి ప్యాకేజీలు ఇస్తూ.. తెలంగాణకు గుండు సున్నా ఇచ్చిందని విమర్శించారు. కాగా, ఓ పసికందును కుక్కలు పీక్కుతున్నాయన్న వార్త.. తన మనసును కలిచివేసిందని, రాష్ట్రంలో ఇంత హృదయవిదారక ఘటనలు జరుగుతున్నా కాంగ్రెస్ సర్కారు మొద్దు నిద్ర వీడటం లేదని 'ఎక్స్' వేదికగా హరీశ్ ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ ఏడాది 60వేలకుపైగా కుక్కకాట్లు నమోదయ్యాయని విమర్శించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో యాంటీ రేబీస్ ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలని కోరారు. కుక్క కాటుకు ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలపై హైకోర్టు తీవ్రంగా స్పందించి మందలించినా తగిన చర్యలు చేపట్టడంలో సర్కారు విఫలమైందని దుయ్యబట్టారు. కాగా, రాష్ట్రంలో మరో నాలుగు మెడికల్ కాలేజీలకు జాతీయ మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇవ్వడంపై హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో 5 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉంటే.. కేసీఆర్ కృషి వల్ల వాటి సంఖ్య ఏకంగా 34కు చేరడం గర్వకారణమన్నారు.

2025 మార్చి నాటికి 'యాదాద్రి'లో పూర్తిస్థాయి విద్యుదుత్పత్తి

- భూనిర్వాసితులకు ఉద్యోగాలిస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిలతో కలసి వైటీపీఎస్ సందర్శన, సమీక్ష


యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో పనులను పరిశీలిస్తున్న భట్టి, ఉత్తమ్, కోమటిరెడ్డి

దామరచర్ల, సెప్టెంబరు 11: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం శివారులోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)లో 2025 మార్చి చివరి నాటికి పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తిని ప్రారంభిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలసి భట్టి.. బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3.10 గంటలకు వైటీపీఎస్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అనంతరం వారు వైటీపీఎస్‌ను సందర్శించి.. అధికారులతో పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమలో యూనిట్-2 ఆయిల్ సింక్రనైజేషన్ పనులు స్విచ్చాన్ చేసి భట్టి ప్రారంభించారు. అనంతరం అక్కడ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2021 చివరి నాటికి 5 యూనిట్ల ద్వారా 4 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి చేయాల్సి ఉండగా గత ప్రభుత్వ చిత్తశుద్ధి లోపంతో ఆలస్యమైందని, ఫలితంగా ప్రభుత్వంపై పరిశ్రమపై అదనపు భారం పడిందన్నారు. డిసెంబరు చివరి నాటికి 3 యూనిట్ల ద్వారా 2,400 మెగావాట్ల విద్యుదుత్పత్తిని, వచ్చే ఏడాది మార్చి 31 నాటికి మరో 2 యూనిట్ల ద్వారా 1,600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుదుత్పత్తిని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేసి యూనిట్ విద్యుత్తును రూ.6.35కు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జాతీయ హరిత ట్రిబ్యునల్ క్లియరెన్స్‌ను తీసుకునేందుకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి ప్రజల నుంచి ఆమోదం తీసుకోవడంతో అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. పరిశ్రమ కోసం భూములు ఇచ్చిన తమకు ఉపాధి కల్పిస్తామని గత ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయలేదని మంత్రుల ఎదుట భూనిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. భట్టి స్పందిస్తూ.. భూములను త్యాగం చేసిన భూనిర్వాసితులకు మూడు నెలల్లో ఉద్యోగం కల్పించి వారికి ఆదుకుంటామని హామీనిచ్చారు. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌తో పాటు పులిచింతల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన నిర్వాసితుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి ఉత్తమ్ చెప్పారు. పరిశ్రమ ఏర్పాటుకు భూములిచ్చిన వారి జాబితాను రూపొందించి పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

ఐఎంజీకి భూ కేటాయింపు కేసులో..
సీబీఐ దర్యాప్తునకు నో
హైకోర్టులో విజయసాయికి చుక్కెదురు!

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. 20 ఏళ్ల కిందట.. 2004లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఐఎంజీ భారత్ అకాడమీస్‌కు చేసిన భూకేటాయింపు, ఎంవోయూ, సేల్‌డీడ్ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ విజయసాయిరెడ్డి తదితరులు దాఖలు చేసిన మూడు ప్రజాహిత వ్యాజ్యాలను కోర్టు బుధవారం కొట్టివేసింది. ఇదే అంశంపై గతంలో ఏపీ మాజీ సీఎం జగన్ తల్లి వైఎస్ విజయలక్ష్మి, దివంగత కాంగ్రెస్ నేత పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి గతంలో దాఖలు చేసిన పిటిషన్లను ట్రయల్ కోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా కొట్టేశాయని గుర్తుచేసింది. ఆ తీర్పులు శిరోధార్యమని స్పష్టం చేసింది. తాజా వ్యాజ్యాల్లోనూ.. పిటిషనర్లు తీవ్ర ఆలస్యం, అలక్ష్యం చేశారని, ఏళ్ల తరబడి ఎలాంటి చర్యలూ తీసుకోలేదని.. పాత అంశంపై తాజా వివాదాన్ని కొనసాగించడానికి అనుమతించబోమని తేల్చిచెప్పింది. ఈ వ్యాజ్యాలపై ఆర్టికల్ 226 కింద తమకున్న అసాధారణ, విచక్షణాధికారాన్ని వినియోగించాల్సిన అవసరం లేదని వివరించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో.. అప్పటి టీడీపీ ప్రభుత్వం ఐఎంజీ భారత్ అకాడమీస్‌కు చేసిన 850 ఎకరాల భూకేటాయింపు, ఎంవోయూపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని కోరుతూ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, జర్నలిస్టు ఏబీకే ప్రసాద్, న్యాయవాది టి.శ్రీరంగారావు 2012లో వేర్వేరు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం తాజాగా తుది విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ వ్యాజ్యాల్లో ఎలాంటి మెరిట్ లేదని పేర్కొంటూ వాటిని కొట్టివేసింది.


శేరిలింగంపల్లి నియోజకవర్గ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్

బీజేపీకి అధికారమిచ్చుంటే
కేసీఆర్‌కు 'అంకుశమే'

- రామిరెడ్డిని గుంజుకుపోయినట్టుగా జైల్లో పెట్టేవాళ్లం
- మాజీ సీఎం కుటుంబాన్ని ఖైదు చేయడం రేవంత్ వల్ల కావట్లే
- వరదలతో జనం అల్లాడుతున్నా కేసీఆర్ బయటికి రారేం ?
- రాహుల్ గాంధీకి దేశంలో ఉండే అర్హత లేదు: : బండి సంజయ్

హైదరాబాద్ సిటీ, రాయదుర్గం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో పెట్టడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సాధ్యం కావడం లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. రాష్ట్ర ప్రజలు బీజేపీకి అధికారం ఇచ్చి ఉంటే.. అంకుశం సినిమాలో రామిరెడ్డిని గుంజుకుపోయినట్టుగానే కేసీఆర్ కుటుంబాన్ని గుంజుకుపోయి జైల్లో పెట్టేవాళ్లమంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గచ్చిబౌలిలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం జరిగిన శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న బండి సంజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పెద్దలతో మాట్లాడుకున్నారని, అందువల్లే రేవంత్ రెడ్డి కేసీఆర్ కుటుంబం జోలికి వెళ్లడం లేదని ఆరోపించారు. విదేశాల్లో భారతదేశంపై తీవ్ర విమర్శలు చేస్తోన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఈ దేశంలో ఉండే అర్హత లేదని పేర్కొన్నారు. 'మిస్టర్ రాహుల్ గాంధీ... క్విట్ ఇండియా' అని నినదించారు. వరదలతో జనం అల్లాడుతుంటే కేసీఆర్ ప్రజల్లోకి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ప్రజలు కేసీఆర్‌కు 'నో ఎంట్రీ బోర్డు' పెట్టేశారని రీఎంట్రీ కలే అని ఎద్దేవా చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో చెయ్యి గుర్తుకు ఓట్లేస్తే అది నేడు భస్మాసుర హస్తమైందని ప్రజలు బాధపడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అతి తక్కువ కాలంలో అత్యధిక ప్రజా వ్యతిరేక మూటకట్టుకున్న పార్టీ కాంగ్రెస్ అన్నారు. హామీల నుంచి ప్రజలను పక్కదారి పట్టించేందుకే రుణమాఫీ సర్వే, హైడ్రా అంటూ ప్రభుత్వం నాటకాలు ఆడుతుందని మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ప్రజలను మోసగిస్తున్నాయని ఆరోపించారు.

ప్రతి పేద విద్యార్థికీ కార్పొరేట్ స్థాయి విద్య: భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి పేద విద్యార్థికీ కార్పొరేట్ స్థాయిలో అత్యున్నత విద్యను అందించాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సమీకృత గురుకులాలను, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తోందని తెలిపారు. బుధవారం సచివాలయంలో గురుకులాలు, స్కిల్ యూనివర్సిటీ భవన నమూనాలను పరిశీలించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక సమీకృత గురుకుల పాఠశాలను నిర్మిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఆ భవనాలకు సంబంధించి స్థలాల సేకరణ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని ఆయన అధికారులను ఆరా తీశారు. ఈ గురుకులాల ద్వారా రాష్ట్రంలోని దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలకి చెందిన ప్రతి పేద విద్యార్థికీ అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందిస్తామన్నారు.



గోదావరి కరకట్ట వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

గోదావరి వరద రాకుండా కరకట్ట విస్తరణ

» ముందస్తు చర్యలతో ముంపును అడ్డుకున్నాం: తుమ్మల

భద్రాచలం, సెప్టెంబరు 11: ఈ సారి గోదావరి వరద తుది ప్రమాద హెచ్చరికకు చేరువగా వచ్చినా ముందస్తు చర్యలతో ఎటువంటి ప్రాణ నష్టం లేకుండా సమర్థవంతంగా ఎదుర్కొన్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గోదావరి వరదల నేపథ్యంలో బుధవారం భద్రాచలంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వరద సహాయక చర్యలు, తదితర అంశాలపై మంత్రి తుమ్మల సమీక్షించారు భద్రాచలం వద్ద గోదావరి తుది ప్రమాద హెచ్చరిక దాటినా భద్రాచలం నుంచి వాజేడు వరకు రాకపోకలకు అంతరాయం లేకుండా అవసరమైన చోట రోడ్డు ఎత్తు పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో గోదావరి వరద గండం లేకుండా శాశ్వత ప్రాతిపదికన కరకట్ట వద్ద స్లూయిస్‌ల సామర్థ్యం పెంచాలని సూచించారు.

ప్రజలకు ఉపయోగపడేలా హెల్త్ కార్డులు

» సమీక్షలో మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పౌరుల హెల్త్ ప్రొఫైల్, ఆరోగ్య కార్డులు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని, ప్రాథమిక సమాచారంతోనే వాటిని తయారుచేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. హెల్త్ కార్డుల తయారీ, ఆరోగ్య కార్డుల పంపిణీపై బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. సకాలంలో మెరుగైన వైద్యం అందించేందుకు హెల్త్ ప్రొఫైల్‌లో ఉన్న సమాచారం సాయపడాలన్నారు. ఒకేసారి ప్రజలందరికీ రక్త పరీక్షలు చేయడం సాధ్యం కాదని, తొలుత ప్రాథమిక సమాచారంతో ఆరోగ్య కార్డులు తయారు చేయాలన్నారు. వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని కమిషనర్ కర్ణన్‌కు సూచించారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆ జీవోలు

రాజకీయ లబ్ధి కోసం ఎన్నికలకు ముందు జీవోలు విడుదల చేసినంత మాత్రాన మెడికల్ కాలేజీలకు అనుమతులు రావని మంత్రి దామోదర రాజనర్సింహ విమర్శించారు. బుధవారం హరీశ్‌రావు 'ఎక్స్'లో పెట్టిన పోస్టుకు అదే వేదికగా మంత్రి కౌంటర్ ఇచ్చారు. గత సర్కారు హయాంలో మెడికల్ కాలేజీల్లో కనీసం ఒక్క ప్రొఫెసర్‌ను కూడా నియమించలేదని విమర్శించారు. కాలేజీలకు భవనాలు ఏర్పాటు చేయలేదని, అవసరమైన ఎక్విప్‌మెంట్ కొనలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అవసరమైన నిధులు కేటాయించి, వంద బెడ్ల దవాఖానాలను 220 పడకల ఆస్పత్రులుగా మార్చామన్నారు. ఇప్పటికైనా రాజకీయాల కోసం అబద్ధాలు చెప్పడం మానేయాలని హరీశ్‌రావుకు హితవు పలికారు.

మండలిలో ప్రతిపక్ష నేతగా మధుసూదనాచారి

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసన మండలిలో ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ)గా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి నియమితులయ్యారు. ఈ మేరకు మండలి చైర్మన్ ఆయనను ఎల్ఓపీగా గుర్తిస్తూ ప్రకటన చేశారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను శాసనసభ కార్యదర్శి డా.వి.నర్సింహాచార్యులు బుధవారం జారీ చేశారు.

ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో కేంద్ర బృందం పర్యటన

» పంటల నష్టం, వరద నష్టం పరిశీలన

ఖమ్మం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతిప్రతినిధి)/మరిపెడ/డోర్నకల్: ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో వరద బాధిత ప్రాంతాలను బుధవారం కేంద్ర బృందం సందర్శించింది. వర్షాలు, వరదలకు నష్టపోయిన బాధితులను పరామర్శించింది. బృందం సభ్యులు కల్నల్ కేపీ సింగ్, మహేష్ కుమార్, శాంతినాథ్ శివప్ప, ఎస్‌కే కుశ్వాహా, టి. నియాల్‌ఖాన్సన్, శ్రీ శివనాథన్‌రెడ్డి.. ఖమ్మం జిల్లాలో భారీ వర్షాల వల్ల, మున్నేరు, పాలేరు వరదల కారణంగా జరిగిన ఆస్తి, పంటల నష్టాన్ని పరిశీలించారు. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో పర్యటించారు. కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పంట నష్టం వివరాలను కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం పొలాల్లో వేసిన ఇసుక మేటలను పరిశీలించిన బృంద సభ్యులు.. రైతులతో మాట్లాడారు. వరదల కారణంగా సర్వం కోల్పోయామని ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితులు కోరారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడలో నష్టపోయిన పంటపొలాలను, జలదిగ్బంధమైన ఇళ్లను కేంద్ర బృంద సభ్యులు బుధవారం రాత్రి పరిశీలించారు. భారీ వరదలతో తన ఇల్లు, పొలం మునిగిపోయాయని, పశువులు, మేకలు, గొర్రెలు, విద్యుత్ మోటారు సైతం కొట్టుకుపోయాయని ఉల్లేపల్లి రైతు బంటు ఎల్లయ్య అధికారుల ముందు గోడును వెళ్లబోసుకున్నాడు. సీతారాంతండాలో ఇస్లావత్ మంగీలాల్-కవిత దంపతులతో మాట్లాడి ఆ కుటుంబానికి జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. అబ్బాయిపాలెం, గాలివారిగూడెం, పురుషోత్తమయగూడెంతో పాటు.. డోర్నకల్ మండలం ముల్కలపల్లిలోని ఎస్సీ కాలనీని సభ్యులు సందర్శించి, బాధితులతో మాట్లాడారు. తమకు ఎత్తయిన ప్రదేశంలో ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని బాధితులు ఈ సందర్భంగా మొర పెట్టుకున్నారు. కాగా, కేంద్ర బృందం గురువారం ఖమ్మంలోని మున్నేరు పరిసర ప్రాంతాల్లో పర్యటించనుంది.



ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. కోటి విరాళం అందజేసిన లలితా జ్యువెల్లర్స్ అధినేత కిరణ్.

ఢిల్లీలో సీఎం రేవంత్

» వరద సాయం కోసం నేడు షాతో భేటీ

న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఢిల్లీకి చేరుకున్నారు. గురువారం ఆయన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలవనున్నారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టానికి సంబంధించి అంచనాల నివేదికను అమిషాకు సమర్పించి కేంద్ర సాయం కోరనున్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి.. ఇతర కేంద్ర మంత్రులను కూడా కలిసి రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని కోరనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా నియమితుడైన మహేశ్‌కుమార్ గౌడ్ కూడా బుధవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు. గురువారం సీఎంతో కలిసి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తోపాటు అగ్రనేత సోనియాగాంధీని మహేశ్‌కుమార్ గౌడ్ కలుసుకోనున్నారు. తనను పీసీసీ చీఫ్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలపనున్నారు. కాగా, కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై 4వారాల్లో నిర్ణయం తీసుకోవాలన్న హైకోర్టు తీర్పు అంశాన్ని అధిష్ఠానం దృష్టికి సీఎం రేవంత్ తీసుకెళ్లే అవకాశాలున్నాయి. మరోవైపు బుధవారం ఉదయం ఢిల్లీకి చేరుకున్న మంత్రి పొన్నం ట్రిబ్కో చైర్మన్ చంద్రపాల్‌సింగ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

తెలంగాణ సీఎంతో.. ఏపీ డిప్యూటీ సీఎం

వరద సాయానికి రూ.కోటి విరాళం ఇచ్చిన పవన్‌కల్యాణ్

హైదరాబాద్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలుసుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టానికి తన వంతు సాయంగా రూ.కోటి విరాళం ప్రకటించిన పవన్‌కల్యాణ్.. ఈ మేరకు రేవంత్‌ను ఆయన నివాసంలో కలిసిన రూ.కోటి చెక్కును అందజేశారు. మరోవైపు తెలంగాణ పోలీసు శాఖ ముఖ్యమంత్రి సహాయ నిధికి తమ వంతు సాయంగా రూ.11,06,83,571 అందజేసింది. ఈ మేరకు చెక్కును సీఎం రేవంత్ రెడ్డికి బుధవారం డీజీపీ జితేందర్, ఇతర ఉన్నతాధికారులు అందజేశారు. కాగా, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్.. తన ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇచ్చారు. సచివాలయంలో సీఎం ఓఎస్డీకి ఈ మేరకు చెక్కును అందజేశారు.

చెరువును చెరబడితే.. చెరసాలే!

(మొదటిపేజీ తరువాయి)

రాజబహదూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ రాష్ట్ర పోలీస్ శిక్షణా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)ల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారి నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, "హైడ్రాపై కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ను కొంతమంది ఆక్రమించుకుని విలాసవంతమైన విల్లాలు, ఫాంహౌస్‌లు నిర్మించుకున్నారు. వాటికి డ్రైనేజీ వ్యవస్థ లేదు. డ్రైనేజీ నీళ్లను గండిపేటలో కలిపారు. అలాంటి నీళ్లను ప్రజలు తాగడానికి ఇస్తే ముఖ్యమంత్రిగా నేను విఫలమైనట్లు కాదా? ఒక్కసారి ఆలోచించండి!" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కొందరు కోర్టులకు వెళ్లి తాత్కాలికంగా స్టే తెచ్చుకుంటున్నారని, అలాంటివారి విషయంలో న్యాయస్థానంలో పోరాడి స్టే వెకేట్ చేయిస్తామని చెప్పారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉన్న నిర్మాణాలను రెగ్యులరైజ్ చేసే ప్రసక్తే లేదన్నారు. "మూసీ కలుషితమయింది. ఆ కాలుష్యం నల్లగొండ వరకు చేరుతోంది. అక్కడ పంటలు విషమయం అవుతున్నాయని, మూసీని ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుతున్నారు. అందుకే మూసీ ప్రక్షాళనకు చర్యలు చేపట్టాం. మూసీ నాలాల్లో ఉన్న శాశ్వత నివాసదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందిస్తాం. మూసీ పరివాహక ప్రాంతంలో నివాసాలు ఏర్పరచుకున్న 11వేల మందికీ పునరావాసం కల్పిస్తాం" అని అన్నారు.

నేరగాళ్ల వెన్నులో వణుకు పుట్టాలి..

గంజాయి, డ్రగ్స్ సరఫరాదారులు, సైబర్ నేరగాళ్లకు, ఆక్రమణదారులకు వెన్నులో వణుకు పుట్టేలా పోలీసులు వ్యవహరించాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. "నేరగాళ్లను పట్టుకుని అడ్డుకుని అడ్డు తొలగించే బాధ్యత మనందరిది. పోలీస్ అంటే ఉద్యోగం కాదు.. భావోద్వేగం. ప్రజలకు మేమున్నామనే భరోసా కల్పించాలి. క్రిమినల్స్‌తో ఫ్రెండ్లీ పోలీసింగ్ కాకుండా.. బాధలతో, కష్టాలతో, కన్నీళ్లతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండాలి. కాస్మెటిక్ పోలీసింగ్‌తో సమస్యలు పరిష్కారం కావు. కాంక్రీట్ పోలీసింగ్ చేసి శాంతిభద్రతలను కాపాడాలి. శాంతిభద్రతలు అదుపులో ఉన్నప్పుడే పెట్టుబడులు వస్తాయి. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. శిక్షణ పూర్తిచేసుకున్న ఎస్సైల సామర్థ్యంపై నాకు నమ్మకం ఏర్పడింది. రాష్ట్ర ప్రజలు మన కుటుంబ సభ్యులు. వారు ఏ ఇబ్బంది ఎదుర్కొన్నా వైఫల్యం మనదే అవుతుంది" అని సీఎం అన్నారు. రాష్ట్రంలోని పోలీస్ సిబ్బంది పిల్లలకు సైనిక్ స్కూల్ తరహాలో ప్రత్యేకంగా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తామని చెప్పారు. గ్రేహౌండ్స్ భూముల్లో 50 ఎకరాల్లో, వరంగల్‌లో మరో పాఠశాల నిర్మిస్తామని ప్రకటించారు. హోంగార్డు నుంచి డీజీపీ వరకు ప్రతి ఒక్కరి పిల్లలు అందులో చదువుకోవచ్చన్నారు. రాబోయే రెండేళ్లలో పోలీస్ స్కూల్ అందుబాటులోకి వస్తుందన్నారు.



సీఎం సహాయ నిధికి పోలీస్ శాఖ తరపున రూ. 11.06 కోట్ల చెక్‌ను అందజేస్తున్న డీజీపీ జితేందర్, ఇతర అధికారులు

నాడు జిరాక్స్ సెంటర్లలో ప్రశ్నపత్రాలు..

యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని సీఎం రేవంత్ చెప్పారు. ఒకప్పుడు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నపత్రాలు జిరాక్స్ సెంటర్లలోనూ, ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా అమ్ముకునేవారని ఆరోపించారు. పరీక్షలు రాసిన లక్షలాది మంది నిరుద్యోగులు ఆందోళనకు గురయ్యారని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను సంపూర్ణంగా ప్రక్షాళన చేశామన్నారు. "నాడు నోటిఫికేషన్లు ఇవ్వాలని కదం తొక్కిన నిరుద్యోగులు.. ఇప్పుడు మన ప్రభుత్వం వెనువెంటనే ఇస్తున్న నోటిఫికేషన్లను కొంతకాలం వాయిదా వేయాలని కోరారు. అన్ని పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడంతో గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేశాం. కులవృత్తులు, చేతి వృత్తుల్ని బలోపేతం చేస్తూ.. వారిని ఆదుకుంటున్నాం. ఎనిమిది నెలల్లోనే.. సరిగ్గా 27 రోజుల్లో రూ.18వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేశాం" అని సీఎం అన్నారు. పరేడ్ కమాండర్‌గా వ్యవహరించిన పల్లి భాగ్యశ్రీని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. కాగా, పోలీస్ వ్యవస్థలో ఎస్సైలు వెన్నుముక లాంటివారని డీజీపీ జితేందర్ అన్నారు. కొత్తగా విధుల్లో చేరుతున్నవారు ప్రజల నమ్మకాన్ని చూరగొనేవిధంగా పనిచేయాలని సూచించారు. ఎస్సైల శిక్షణ, అకాడమీ పనితీరును అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ వివరించారు. మొత్తం 547మంది శిక్షణ పూర్తిచేసుకోగా.. వీరిలో 145 మంది మహిళలు ఉన్నారు. శిక్షణ సమయంలో ఆయా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి సీఎం చేతుల మీదుగా కప్‌లు, ట్రోఫీలు అందజేశారు. అకాడమీ ఆవరణలో కొత్తగా నిర్మించిన క్రీడా భవన్‌ను సీఎం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, సీపీ సీవీ ఆనంద్, ఐజీ రమేష్‌తో సీఎం రేవంత్ కొద్దిసేపు బ్యాడ్మింటన్ ఆడారు.

నా భర్త కల నెరవేర్చా: భాగ్యశ్రీ



భద్రాద్రి జిల్లా సారపాకకు చెందిన పల్లి భాగ్యశ్రీ ఎస్సై శిక్షణలో 'టాపర్ ఆఫ్ ది బ్యాచ్'గా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. తన భర్తకు పోలీస్ ఉద్యోగమంటే ఇష్టమని, ఆయన కల నెరవేర్చేందుకు తాను ఈ ఉద్యోగం సాధించానని అన్నారు. జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూనే ఎస్సై శిక్షణకు సిద్ధమయ్యానని తెలిపారు.

సెప్టెంబరు 17న తెలంగాణ

ప్రజా పాలనా దినోత్సవం

» కొత్తగా నామకరణం చేసిన సర్కారు

హైదరాబాద్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నిజాం చెర నుంచి తెలంగాణ విముక్తి పొంది, అఖండ భారత్‌లో విలీనమైన సెప్టెంబరు 17వ తేదీని 'తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం'గా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కొత్తగా నామకరణం చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఈ ఉత్సవాన్ని రాజధాని హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం చేయకుండా.. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 17న హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపింది. మిగిలిన 32 జిల్లాల్లో ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. జిల్లా కేంద్రాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే బాధ్యతను మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్లకు డిజిగ్నేట్ చేసింది. తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. వాస్తవానికి ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచీ సెప్టెంబరు 17ను అధికారికంగా నిర్వహించాలన్న డిమాండ్‌ను వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు చేస్తున్నాయి. ప్రధాన పార్టీలు ఆయా పార్టీల కార్యాలయాల్లో వేర్వేరు పేర్లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ విలీన దినోత్సవంగా నిర్వహిస్తుండగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సెప్టెంబరు 17ను అధికారికంగా నిర్వహించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు రాలేదు. కానీ, గత ఎన్నికలకు ముందు మాత్రం సెప్టెంబరు 17ను జాతీయ సమైక్యతా దినోత్సవంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. మరోవైపు కేంద్రంలోని బీజేపీ దీనిని తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రకటించి నిర్వహించింది. గత ఏడాది రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. సెప్టెంబరు 17ను ఏ పేరుతో నిర్వహిస్తారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దానికి తెరదించుతూ.. తెలంగాణ ప్రజాపాలనా దినోత్సవంగా నిర్వహించనున్నట్లు సర్కారు స్పష్టత ఇచ్చింది.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ఎన్‌డీఎస్ఏ నివేదిక కోసం ఢిల్లీకి ఉత్తమ్

» నాలుగో వారంలో పర్యటన

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ఏ) నివేదిక కోసం ఢిల్లీకి వెళ్లాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్ణయించారు. వాస్తవానికి ఈనెల 17వ తేదీన పర్యటన ఖరారవ్వగా ఆ రోజు నుంచి 20వ తేదీ దాకా ఢిల్లీలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఆధ్వర్యంలో 8వ ఇండియా వాటర్ వీక్ జరగనుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి శాఖతో పాటు ఎన్‌డీఎస్ఏ అధికారులు పాల్గొనే అవకాశం ఉండటంతో నాలుగో వారంలో ఢిల్లీకి వెళ్లడానికి మంత్రి సిద్ధమవుతున్నారు. తుమ్మిడిహెట్టికి దిగువన ఒక రబ్బర్ డ్యామ్, వార్ధా ప్రాజెక్టులో మరో బ్యారేజీ కట్టి, అక్కడి నుంచి గ్రావిటీతో సుందిళ్లకు నీటిని తరలించాలని ప్రభుత్వం యోచిస్తోంది. లింక్-1లో అన్నారం, మేడిగడ్డను వదిలేసి.. మిగతా కాంపోనెంట్లన్నీ యథాతథంగా వినియోగించుకోనుంది. ఈ నిర్ణయాల అమలు కోసం ఎన్‌డీఎస్ఏ నివేదికను ప్రామాణికంగా చేసుకుంది. దీనికోసం ఎన్‌డీఎస్ఏ చైర్మన్‌తో భేటీ కావాలని ఉత్తమ్ నిర్ణయించారు.

సమ్మక్క బ్యారేజీకి ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ తీసుకోండి

» మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సమ్మక్కసాగర్(తుపాకులగూడెం) బ్యారేజీకి ఛత్తీస్‌గఢ్ నుంచి నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) తీసుకోవాలని, ఈ మేరకు సంప్రదింపుల ప్రక్రియను చేపట్టాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ వస్తే తప్పా సమ్మక్క సాగర్‌కు కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) అనుమతులు ఇచ్చే అవకాశాల్లేనందునా, ఆ పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఆ ప్రాజెక్టు డీపీఆర్‌పై సీడబ్ల్యూసీ లేవనెత్తిన అనుమానాలన్నీ తీర్చాలన్నారు. ఈ ఏడాది కొత్తగా 6 లక్షల ఎకరాలకు సాగునీరును అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నందునా.. ఆయా ప్రాజెక్టుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణను వేగిరం చేయాలన్నారు. ఆనకట్టలు, కాలువలపై 1800 మంది లష్కర్ల అవసరం ఉందని, దీనికోసం అవసరమైన కసరత్తును చేపట్టాలని ఆదేశించారు.

ధరణి స్థానంలో.. భూమాత

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కరించేందుకు రెవెన్యూ శాఖ తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ పలు సిఫారసులు చేసింది. ఈ ఏడాది అక్టోబరుతో ప్రైవేటు ఏజెన్సీ గడువు ముగియనుండటంతో పోర్టల్ నిర్వహణ బాధ్యతను ప్రభుత్వ ఏజెన్సీలు పర్యవేక్షించేలా ఇప్పటికే సర్కారు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఎన్ఐసీ ద్వారా ధరణి పోర్టల్ నిర్వహణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. 2020 ఆర్వోఆర్ అమల్లోకి వచ్చాక రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ కుప్పకూలిపోయిందని, గ్రామ స్థాయిలో రెవెన్యూ రికార్డుల పర్యవేక్షణ, బాధ్యులు లేకపోవడం వల్ల పలు సమస్యలు తలెత్తినట్లు కమిటీ అభిప్రాయ పడింది. కొత్త ఆర్వోఆర్ చట్టం 2024ను తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో ఆ మేరకు రెవెన్యూ వ్యవస్థను క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ పలు సిఫారసులు చేసింది.

స్వల్పకాలిక సిఫారసులు

ధరణి పోర్టల్ మార్చి దాని స్థానంలో భూమాత; ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలను కొత్త ఏజెన్సీలకు అప్పగింత; ధరణిలో అనధికారిక కార్యక్రమాలు జరిగితే మూడో పార్టీ ద్వారా తనిఖీ; భూ సమస్యల పరిష్కారం, చట్టంలో మార్పులకు కొత్త రెవెన్యూ చట్టం; భూ పరిపాలనా సంస్కరణల కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు;

మధ్యకాలిక సిఫారసులు

ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు స్వీకరించే సదుపాయం; ఆన్‌లైన్, మొబైల్, కంప్యూటర్ ద్వారా దరఖాస్తులు దాఖలు చేసేలా నిబంధనలు; ఈసేవ కేంద్రాలను సందర్శించకుండానే బయోమెట్రిక్ ప్రామాణికం కోసం ఆధార్‌తో అనుసంధానం; భూ ఫిర్యాదులను స్వీకరణకు గ్రామ స్థాయిలో కొత్త కార్యక్రమం; ఇప్పటికే ఉన్న బహుళ మాడ్యూల్‌ల స్థానంలో ఒకే ఫిర్యాదు మాడ్యూల్; గ్రామీణాభివృద్ధి శాఖలో గతంలో కొనసాగిన కమ్యూనిటీ పారాలీగల్ కార్యక్రమం పునరుద్ధరణ; గ్రామీణ యువత సహకారంతో భూరికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన, భూ సమస్యలు ఉంటే గుర్తింపు, గుర్తించిన సమస్యలను గ్రామ రెవెన్యూ కోర్టుల పరిష్కారం; తహసీల్దార్ కార్యాలయాల దగ్గర భూ సహాయ కేంద్రాల ఏర్పాటు; ఇప్పుడున్న ఆర్వోఆర్, ఇతర భూరికార్డులు పరిశీలించి తాత్కాలిక భూదార్ కార్డుల జారీ; భూవివాదాల పరిష్కార చట్టం; రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిర్దిష్ట సమయంలో భూ సమస్యలు పరిష్కారం జరిగేలా ప్రత్యేక విధానం; ఇప్పుడున్న అనేక భూచట్టాలను మదింపు చేసి ఒకేఒక భూచట్టం; నిషేధిత ఆస్తుల జాబితాను అప్‌డేట్, జాబితాలో తప్పులుంటే సవరణలు, 1958కి ముందు అసైన్డ్ భూములు నిషేధిత జాబితా నుంచి తొలగింపు; పెండింగులో ఉన్న సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు; ల్యాండ్ లైసెన్స్ కల్టివేటెడ్ యాక్ట్-2011ను అమలు; కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు; భూ పరిపాలనను చూసేందుకు గ్రామస్థాయిలో ఒక వ్యక్తి; ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, సీలింగ్, దేవాదాయ, వక్ఫ్, ఇనాం భూములపై పకడ్బందీ జాబితా; పార్ట్-బీలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి పట్టాదారు పాసుపుస్తకాల జారీ.

దీర్ఘకాలిక సిఫారసులు

భూ పరిపాలన అధ్యయనం; ఖాస్రా, చేసాలా పహాణి వంటి అన్ని రకాల రికార్డులను దశలవారీగా డిజిటలైజ్ చేయడం; రీ సర్వే చేపట్టి శాశ్వత ప్రాతిపదికన భూధార్ కార్డులు; రెవెన్యూ అధికారుల్లో నైపుణ్యాల పెంపునకు ల్యాండ్ అకాడమీ; సీసీఎల్ఏ, జిల్లా కలెక్టరేట్లు, ఐటీడీఏ కార్యాలయాల ఆవరణల్లో లీగల్ సెల్; ల్యాండ్ పాలసీ, ల్యాండ్ వినియోగంపైనా పాలసీ; కోనేరు రంగారావు కమిటీ సిఫారసులు.. అటవీ హక్కుల చట్టం అమల్లోకి తీసుకురావడం; టైటిల్ గ్యారెంటీ అమలు చేసేలా కార్యచరణ.

వరద నష్టం 10 వేల కోట్లు!

» శాఖల వారీ అంచనాల తయారీ

» రేపు కేంద్ర బృందంతో పరిహారంపై ఉన్నత స్థాయి భేటీ

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరద నష్టం రూ.10,300 కోట్లు ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక అంచనాకు వచ్చింది. ఈ మేరకు శాఖల వారీగా జరిగిన నష్టాన్ని అంచనా వేస్తూ రూపొందించిన 300 పేజీల నివేదికను బుధవారం విపత్తుల నిర్వహణ విభాగం సంయుక్త కార్యదర్శి హరీశ్.. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. ఇప్పటికే రాష్ట్రంలో కేంద్ర బృందాలు పర్యటిస్తున్న నేపథ్యంలో వరద నష్టంపై శాఖల వారీగా తయారు చేసిన నివేదికపై శుక్రవారం కేంద్ర బృందంతో జరిగే ఉన్నత స్థాయి సమావేశంలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందాలు పర్యటించాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగే సమావేశంలో కేంద్రం నుంచి రూ.10,300 కోట్ల పరిహారం కావాలని, ఆ మేరకు శాఖల వారీగా రూపొందించిన నష్ట వివరాలను కేంద్ర బృందానికి అందించనున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు.. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల వాటిల్లిన నష్టం వివరాలను కేంద్ర బృందానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వివరించారు. కల్నల్ కేపీ సింగ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కేంద్ర బృందం బుధవారం సచివాలయంలో సీఎస్‌తో సమావేశమైంది. వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలతో అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం అప్రమత్తం చేసి, ప్రాణ నష్టం లేకుండా చూసిందని సీఎస్ ఆ బృందానికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలను అందించడానికి వీలుగా మార్గదర్శకాలను ఉదారంగా రూపొందించాలని కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఎన్‌డీఆర్ఎఫ్‌తో సమానంగా సహాయక చర్యలు చేపట్టడానికి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక విపత్తు నిర్వహణ బృందాలను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. ఈ ప్రత్యేక బృందాలకు శిక్షణ, ఇతర లాజిస్టిక్స్ ఏర్పాట్లలో ఎన్‌డీఆర్ఎఫ్ మద్దతు కావాలని సీఎస్ కోరారు. భారీ వర్షాలు, వరదల సమయంలో వైమానిక రెస్క్యూ ఆపరేషన్స్‌ను నిర్వహించాల్సి ఉంటుందని, దీనికి కేంద్ర సహకారం కావాలని అడిగారు. ఏటూరునాగారం అటవీ ప్రాంతంలో 332 హెక్టార్ల విస్తీర్ణంలో భారీ చెట్లు కూలాయని, ఇలాంటి పర్యావరణ సమస్యకు కారణాలేమిటో తెలుసుకోవాలని కేంద్ర బృందం సీఎస్‌కు సూచించింది. వివిధ శాఖల ఉన్నతాధికారులు వరద నష్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర బృందాలకు వివరించారు.

హైదరాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణే లక్ష్యం!

» ఆర్ఆర్ఆర్ వరకు లింకు రోడ్ల విస్తరణ

» 4 జిల్లాల్లో రైల్వే బ్రిడ్జిల నిర్మాణాలకు రూ.5 వేల కోట్లు: మల్‌రెడ్డి రాంరెడ్డి

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 11: హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్‌ను నియంత్రించడమే తమ లక్ష్యమని రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి చెప్పారు. రాష్ట్ర జనాభా నాలుగు కోట్లు కాగా.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే రెండు కోట్ల మంది నివసిస్తున్నారని తెలిపారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా పెరిగిపోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోందన్నారు. బుధవారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంరెడ్డి మాట్లాడారు. నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించాలంటే ఇన్నర్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు, అలాగే రీజనల్ రింగ్ రోడ్డు వరకు ఉన్న పాత లింకు రోడ్లను విస్తరించడమే మార్గమని తెలిపారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి హైదరాబాద్ రోడ్ కార్పొరేషన్ ద్వారా ఇప్పటికే రూ.1500 కోట్ల పనులకు టెండర్లు వేసినట్లు చెప్పారు. మరో వెయ్యి కోట్లయినా సరే హైదరాబాద్‌తో పాటు నగరాన్ని ఆనుకొని ఉన్న ప్రాంతం మొత్తానికి బ్రహ్మాండంగా రోడ్డు కనెక్టివిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. హయత్‌నగర్ నుంచి కోహెడలోని పండ్ల మార్కెట్ వరకు నాలుగు వరసల రోడ్డు నిర్మిస్తామన్నారు. రాష్ట్రంలో రైల్వే వంతెనల నిర్మాణం కోసం రూ.5 వేల కోట్లు మంజూరైనట్లు రాంరెడ్డి చెప్పారు. ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో 54 రైల్వే అండర్ బ్రిడ్జిల పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

నేనొస్తే.. అందర్నీ లోపలేస్తా

- టీడీపీ ప్రభుత్వం ఎల్లకాలం ఉండదు
- ఆ పార్టీ నాయకులందరికీ ఇదేగతి: జగన్



గుంటూరు, సెప్టెంబరు 11: మూడేళ్ల క్రితం జరిగిన టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో సంబంధం లేనివారిని అరెస్టు చేస్తున్నారని, టీడీపీ తప్పుడు సంప్రదాయానికి బీజం వేస్తోందని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వం ఎల్లకాలం ఉండదని, రేపు తాము అధికారంలోకి వస్తే ఈ నాయకులందరికీ కూడా ఇదే గతి పడుతుందని, జైల్లో ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు. కొంతమంది పోలీసులు కూడా ఈ కేసులో సాక్షాలు, ఆధారాలు సృష్టించి సంబంధం లేని వారిని నిందితులుగా చేర్చారని ఆరోపించారు. గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న వైసీపీ నేతలు మాజీ ఎంపీ నందిగం సురేశ్, అవుతు శ్రీనివాస్ రెడ్డిని జగన్ పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... రాసిచ్చిన స్క్రిప్టును చదువుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. విజయవాడ ముంపునకు గురై 60 మంది మృతిచెందారని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముందు జాగ్రత్త లేకపోవడం, ఆయన నిర్లక్ష్యం, అజాగ్రత్త కారణం కాదా అని ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన చంద్రబాబుపై ఎందుకు కేసు పెట్టకూడదన్నారు. ప్రభుత్వ తప్పుల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు మూడేళ్ల క్రితం జరిగిన టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనను చంద్రబాబు ఇప్పుడు బయటకు తీశారని ఆరోపించారు.

కోర్టు ముందు హాజరవ్వాల్సిందే!

స్వీయ పూచీకత్తు సమర్పించాల్సిందే

ఎన్‌వోసీపై జగన్‌కు ఏపీ హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాస్‌పోర్టు జారీకి అవసరమైన నిరభ్యంతరం పత్రం (ఎన్‌వోసీ) పొందేందుకు ప్రత్యేక కోర్టు ముందు హాజరవ్వాలని.. రూ.20 వేల స్వీయ పూచీకత్తు సమర్పించాల్సిందేనని ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ఆ రాష్ట్ర హైకోర్టు తేల్చిచెప్పింది. పాస్‌పోర్టును ఏడాది పాటే పునరుద్ధరిస్తామని, తమ ముందు హాజరై రూ.20వేల పూచీకత్తు సమర్పించాలని విజయవాడ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు విధించిన షరతులను పాక్షికంగా సవరించింది. ఐదేళ్లపాటు పాస్‌పోర్టు రెన్యువల్‌కు వీలుగా ఎన్‌వోసీ జారీ చేయాలని సదరు కోర్టును ఆదేశించింది. రూ.20 వేల బాండ్‌తో పూచీకత్తు సమర్పించాలని ప్రత్యేక కోర్టు విధించిన షరతు కఠినమైనదేమీ కాదని పేర్కొంది. 'రాజ్యాంగం నిర్దేశించిన చట్టబద్ధమైన పాలనకు లోబడి దేశ పరిపాలన ఉంటుందని, న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలకు అందరూ బద్ధులై ఉండాల్సిందేనని ప్రజాజీవితంలో ఉన్న పిటిషనర్ (జగన్)కు బాగా తెలుసు. విజయవాడ ప్రత్యేక కోర్టులో 2018 నుంచీ పరువునష్టం కేసు ఉందని ఆయనకు తెలుసు. ఆయన సహనిందితుడు కేసు విచారణలో పాల్గొంటున్నారని కూడా తెలుసు. ఈ నేపథ్యంలో ఆ కేసు విచారణలో సాధ్యమైనంత త్వరగా పాల్గొంటారని ఆశిస్తాం. అయితే అలా జరుగలేదు. ప్రస్తుతం జగన్ తరఫున ప్రత్యేక కోర్టులో న్యాయవాది వకాలత్ వేసి పాస్‌పోర్ట్ జారీకి అవసరమైన ఎన్‌వోసీ కోసం పిటిషన్ వేశారు. అవసరం కాబట్టే ఆయన న్యాయవిచారణ ప్రక్రియలో పాల్గొన్నారని గుర్తించాలి. కోర్టుకు హాజరైతే భద్రత కల్పన విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయని జగన్ చెబుతున్నారు. రాజకీయ ప్రముఖుల కేసులను విచారిస్తున్న ప్రత్యేక కోర్టు వద్ద ఇలాంటివి సర్వసాధారణం. కోర్టు ఉత్తర్వులు సాఫీగా అమలయ్యేందుకు వీలుగా రాష్ట్రప్రభుత్వం తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలి' అని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఎన్‌వోసీ జారీకి కోర్టు ముందు హాజరై.. రూ.20 వేల స్వీయ పూచీకత్తు సమర్పించడం సహా ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ బుధవారం తీర్పు ఇచ్చారు.

డీఎస్సీ అభ్యర్థులకు టెట్ వివరాల ఎడిట్ ఆప్షన్

హైదరాబాద్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): టెట్‌కు సంబంధించిన వివరాలను సవరించుకునేందుకు గాను డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. ఈ మేరకు బుధవారం విద్యాశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నేడు, రేపు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఇప్పటికే డీఎస్సీ పరీక్షలను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇటీవలే తుది 'కీ'ని విడుదల చేయగా... ఫలితాలను ప్రకటించాల్సి ఉంది. ఈ ఫలితాలను వెల్లడించాలంటే అభ్యర్థులకు సంబంధించిన టెట్ మార్కుల వెయిటేజీని డీఎస్సీ మార్కుల్లో కలపాల్సి ఉంటుంది. అయితే, అభ్యర్థులు సమర్పించిన టెట్ మార్కులు, ఇతర వివరాలు సరిగ్గా లేవని అధికారుల పరిశీలనలో తేలింది. ఈ సమస్యలను పరిష్కరించడం కోసం గురు, శుక్ర వారాల్లో టెట్ వివరాలను ఎడిట్ చేసి, సరైన సమాచారాన్ని పొందుపరచడానికి వీలుగా ఈ అవకాశం కల్పించారు.

వైద్య విద్యార్థినిపై రోగి దాడి

(మొదటి పేజీ తరువాయి)

చెందిన ఐ.ప్రకాశ్(60) రోజుకూలీ. కల్లు, మద్యానికి బానిసయ్యాడు. బుధవారం పూటుగా తాగి.. పిచ్చిపిచ్చిగా ప్రవర్తించటంతో మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో అతణ్ని గాంధీ ఆస్పత్రికి తీసుకొచ్చి, అత్యవసర విభాగానికి తరలించారు. ఈ సమయంలో.. ప్రకాశ్ తన భార్య పక్కనే నిలబడ్డ వైద్యవిద్యార్థిని చేయిపట్టుకున్నాడు. ఆమె యాప్రాన్‌ను లాగాడు. ఆమెను బయటకు ఈడ్చుకెళ్లేందుకు ప్రయత్నించాడు. బాధితురాలు కేకలు వేయడంతో.. తోటి వైద్యులు, సిబ్బంది నిందితుడి నుంచి బాధితురాలిని విడిపించారు. ఈ దృశ్యాలు ఆస్పత్రిలోని సీసీకెమెరాలో రికార్డ్ అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మద్యం మత్తులో మతిస్థిమితం కోల్పోయి ఇలా దాడికి పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించారు.

కఠిన చర్యలు తీసుకోండి: జూడాలు

ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని జూనియర్ వైద్యుల సంఘం గాంధీ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ వంశీ కృష్ణ డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్లు ఈ మేరకు సూపరింటెండెంట్‌ను కలిసి, వినతిపత్రం సమర్పించారు.

అసలు దొంగలు దొరకరు.. కొసరు దొంగలతో కేసులు క్లోజ్

పోలీసులకు సవాల్‌గా మారిన సైబర్ నేరాలు

- కేసుల ఛేదనకు 4-5 రాష్ట్రాలు తిరగాల్సిన స్థితి
- నెలల తరబడి వెతికినా ఫలితాలు లభించక.. తలలు పట్టుకుంటున్న సైబర్ క్రైమ్ బృందాలు!



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో కాల్ సెంటర్.. హరియాణాలో తీసుకున్న సిమ్‌కార్డులు.. ముంబైలోనో, లఖ్‌నవూలోనో బ్యాంకు ఖాతాలు.. హైదరాబాద్‌లో బురిడీలు.. కాజేసిన సొమ్ము గుజరాత్‌లో ఉపసంహరణ.. ..ఇదీ సైబర్ కేటుగాళ్ల దోపిడీ తీరు! పోలీసులకు దొరక్కుండా ఉండటానికి, దర్యాప్తు క్రమంలో పోలీసులకు చుక్కలు చూపించడానికి సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేస్తున్నారు. దాంతో ఒక్కో కేసునూ ఛేదించడానికి సైబర్ క్రైమ్ పోలీస్ బృందాలు సుమారు 4, 5 రాష్ట్రాల్లోని పలు నగరాలు తిరిగి విచారణ చేయాల్సి వస్తోంది. ఇంతా కష్టపడి పడినా.. అసలు దొంగలు దొరకరు.. కేవలం కొసరు దొంగలనే అరెస్టు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదాహరణకు.. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి సైబర్ నేరగాళ్ల మాయలో పడ్డాడు. "మీ బ్యాంకు ఖాతా కేవైసీ అప్‌డేట్ చేయకుంటే బ్లాక్ అవుతుంది" అంటూ నేరగాళ్లు ఆయన వాట్సాప్ నంబర్‌కు ఒక ఆ లింక్‌ను పంపారు. దాన్ని క్లిక్ చేసిన బాధితుడు అందులో వివరాలు అప్‌లోడ్ చేశాడు. అంతే.. వెంటనే ఆయన ఖా తాలో ఉన్న సుమారు రూ. 10 లక్షల సొమ్మును సైబర్ నేరగాళ్లు తమ ఖాతాల్లోకి వేసేసుకున్నారు. బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరించగా.. బాధితుని ఖాతాలోని డబ్బు కొల్లగొట్టిన క్రిమినల్స్ ఆ డబ్బును అరగంట వ్యవధిలోనే నాలుగైదు రాష్ట్రాల్లో వివిధ నగరాల్లోని బ్యాంకు ఖాతాలకు మళ్లించి.. గుజరాత్, మధ్యప్రదేశ్, గుర్గావ్ తదితర ప్రాంతాల నుంచి విత్‌డ్రా చేసినట్లు గుర్తించారు. అంటే.. ఇప్పుడా కేసు దర్యాప్తు చేయాలంటే ఆయా రాష్ట్రాల్లోని నగరాలన్నింటికీ వెళ్లాల్సిందే!

దుబాయ్ నుంచి దందా..

స్టాక్ మార్కెట్లో, ఆన్‌లైన్ గేమింగ్‌లో పెట్టుబడులు పెడితే.. 30% లాభాలు వస్తాయని నమ్మించి నగర యువతిని బురిడీ కొట్టించిన సైబర్ కేటుగాళ్లు.. ఇటీవల 3.16 కోట్లు కొల్లగొట్టారు. ఈ కేసులో ఇటీవలే మహారాష్ట్రకు చెందిన సైబర్ ముఠాను సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. దర్యాప్తులో భాగంగా.. దేశంలోని అన్ని నగరాలు తిరిగి టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించి వారిని పట్టుకోవడానికి మన పోలీసులకు సుమారు 3 నెలలు పట్టింది. తీరా పట్టుకున్నాక.. ప్రధాన నిందితులు దుబాయ్, హాంకాంగ్‌లో ఉండి ఇక్కడ ఈ దందా నడిపిస్తున్నట్టు దర్యాప్తులో తేలింది. ఇలా కొల్లగొట్టిన డబ్బును వారు హవాలా మార్గంలో చెప్పిన చోటుకు చేర్చడానికి ప్రత్యేక ముఠాను కూడా ఏర్పాటు చేసుకున్నారని తెలిసింది. దుబాయ్‌లో ఉంటున్న ప్రధాన నిందితులు ఇప్పటికీ పోలీసులకు చిక్కలేదు.

అద్దెకు బ్యాంకు ఖాతాలు

ఇటీవల ఒక కేసు దర్యాప్తులో భాగంగా.. ముంబైకి చెందిన మహ్మద్ షోయబ్ బబ్లూఖాన్ అనే నేరగాణ్ని పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద 37 చెక్‌బుక్‌లు, 38 డెబిట్ కార్డులు, 11 పాస్ బుక్‌లు, నకిలీ కంపెనీల రబ్బరు స్టాంపులు, 12 సిమ్‌కార్డులు, ఒక ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. అతణ్ని విచారించగా.. తన పేరిట, తనకు తెలిసిన వారిపేరిట, కంపెనీల పేరిట నకిలీ పత్రాలు సృష్టించి, బ్యాంకుల్లోని కిందిస్థాయి సిబ్బందిని మ్యానేజ్ చేసి బ్యాంకు ఖాతాలు సృష్టించి, వాటిని సైబర్ నేరగాళ్లకు అద్దెకు ఇస్తున్నట్లు తెలిపాడు. ఒక్కో ఖాతాకూ నెలకు రూ.లక్ష అద్దె తీసుకుంటున్న కేటుగాడు.. ఆ ఖాతాకు సంబంధించిన ఏటీఎం కార్డు, పాస్‌బుక్ అన్నింటినీ సైబర్ నేరగాళ్లకు ఇచ్చేవాడు. ఇలాంటి అద్దె ఖాతాలు వినియోగించడం వల్ల అసలైన సైబర్ నేరగాళ్లు పోలీసులకు చిక్కకుండా ఉంటున్నారు. కొన్ని సందర్భాల్లో.. చదువుకోని అమాయకులను మాయ చేసి వారి పేరిట ఖాతాలు తెరుస్తున్నారు. సాంకేతిక సాక్ష్యాల ఆధారంగా పోలీసులు వారి వద్దకు వెళ్లినా.. నిరక్షరాస్యులు కాబట్టి వారికి ఆ ఖాతా గురించి గానీ, దాని ద్వారా జరిగే ఆర్థిక లావాదేవీల గురించి గానీ తెలియదు. ఒక కేసు దర్యాప్తు పూర్తిచేసేలోపే.. పెద్దసంఖ్యలో కొత్త కేసులు నమోదవుతుండడంతో ఏం చేయాలో తోచక పోలీసులు తలపట్టుకుంటున్నారు. ఏటా వేల కేసులు నమోదవుతుంటే.. పదుల సంఖ్యలో కూడా కేసులు ఛేదించలేకపోతున్నారు.

కోర్టు విచారణకు.. వర్చువల్‌గా హాజరైన కవిత

- ఈ నెల 25కు వాయిదా
- కోర్టులో 4వ అనుబంధ చార్జ్‌షీట్
- అందులో శరత్‌రెడ్డి పాత్రపై వివరాలు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో విచారణకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ కేసులో కవితతోపాటు మరో నలుగురిపై అభియోగాలు మోపుతూ సీబీఐ అనుబంధ చార్జిషీట్ దాఖలు చేయగా, బుధవారం ఆ కేసు విచారణకు వచ్చింది. సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా విచారణ చేపట్టారు. కవితతోపాటు మిగిలిన నిందితులు వర్చువల్ పద్ధతిలో విచారణకు హాజరయ్యారు. తొలుత సీబీఐ తరఫు న్యాయవాదులు వాదనలను వినిపిస్తూ.. ప్రతివాదులకు అందించిన చార్జ్‌షీట్‌లో స్పష్టత లేని ప్రతులను.. బుధవారం అందజేస్తున్నట్లు తెలిపారు. కవిత తరఫు న్యాయవాది జోక్యం చేసుకుంటూ.. సీబీఐ చార్జ్‌షీట్ కాపీల్లో పలు పేజీలు తెలుగులో ఉన్నాయని.. వాటిని పూర్తి స్థాయిలో ఇంగ్లిష్‌లోకి అనువదించేలా ఆదేశాలివ్వాలని కోర్టును కోరారు. వాదనలను విన్న ప్రత్యేక న్యాయమూర్తి.. ప్రతివాదులు అడిగిన కాపీలను తెలుగు నుంచి ఆంగ్లంలోకి అనువదించి ఇవ్వాలని సీబీఐని ఆదేశించారు. తదుపరి విచారణను 25కు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు.

అనుబంధ చార్జ్‌షీట్‌లో శరత్‌రెడ్డి

సీబీఐ బుధవారం దాఖలు చేసిన 4వ అనుబంధ చార్జ్‌షీట్‌లో.. ఈ కుంభకోణంలో అరబిందో ఫార్మా డైరెక్టర్ పి.శరత్ చంద్రారెడ్డి పాత్రను వివరించారు. కాగా.. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కవితకు బినామీగా దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తోన్న హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త అరుణ్ రామచంద్ర పిళ్లైకి బెయిల్ మంజూరైంది. మనీలాండరింగ్ కేసులో బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ ఏకసభ్య ధర్మాసనం పిళ్లైకి బెయిల్ మంజూరు చేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● గురువారం 12 సెప్టెంబరు 2024



ఎన్‌జీ రంగా వర్సిటీలో
ఎన్‌ఆర్‌ఐ కోటా

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ఎన్‌ఆర్‌ఐ/ఎన్‌ఆర్‌ఐ స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించింది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేసే వీలుంది.

విభాగాలు

- అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కమ్యూనిటీ సైన్స్(హోమ్ సైన్స్)

స్పెషలైజేషన్‌లు

అగ్రికల్చర్: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, ప్లాంట్ పాథాలజీ, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రో బయాలజీ, సాయిల్ సైన్స్, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, ఎంటమాలజీ, ఆగ్రోనమీ, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్.

అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ: సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్, ప్రాసెస్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్, ఫామ్ మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ.

కమ్యూనిటీ సైన్స్(హోమ్ సైన్స్): ఫుడ్ అండ్ న్యూట్రిషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కన్జూమర్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్.

క్యాంపస్‌లు

- బాపట్ల, తిరుపతి, నైరా, మహానంది అగ్రికల్చరల్ కాలేజీలు
- గుంటూరులోని ఏపీజీసీ
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- లామ్‌లోని అడ్వాన్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్

సీట్ల వివరాలు

- పీజీ ప్రోగ్రామ్‌లో 53 సీట్లు ఉన్నాయి. కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగాలకు ఒక్కోదానిలో రొటేషనల్ బేసిస్ మీద 6 సీట్లు నిర్దేశించారు. అగ్రికల్చర్ విభాగానికి 41 సీట్లు కేటాయించారు.
- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో 14 సీట్లు ఉన్నాయి. కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగాలకు ఒక్కో. దానిలో రొటేషనల్ బేసిస్ మీద ఒక సీటు నిర్దేశించారు. అగ్రికల్చర్ విభాగానికి 12 సీట్లు కేటాయించారు.

అర్హత

- పీజీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి.
- పీహెచ్‌డీలో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో కనీసం 60 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి.
- అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **దరఖాస్తు:** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి పీజీ, డిగ్రీ, ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్‌ఆర్‌ఐ వీసా-పాస్‌పోర్ట్- ఆదాయం ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్‌ఆర్‌ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లామ్, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

మౌలానా ఆజాద్ వర్సిటీలో
స్పాట్ అడ్మిషన్స్

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ- సెంట్రల్ యూనివర్సిటీ)- పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో సీట్లు ఉన్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా అడ్మిషన్ పోర్టల్‌లో అప్లయ్ చేసుకోవాలి. తరవాత హైదరాబాద్ క్యాంపస్‌లోని సంబంధిత డిపార్ట్‌మెంట్‌లో రిపోర్ట్ చేయాలి. ఇప్పటికే దరఖాస్తు చేసుకొని సీటు పొందలేని అభ్యర్థులు మరల అప్లయ్ చేయనవసరం లేదు.

ప్రోగ్రామ్‌లు-సీట్లు

- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఉర్దూ - 27
- సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ ఇన్ టర్కిష్ - 10
- సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ ఇన్ అరబిక్ - 12
- సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ ఇన్ ఫ్రెంచ్ - 18
- సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ ఇన్ రష్యన్ - 26
- సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ ఇన్ తెలుగు - 15
- డిప్లొమా ఇన్ ఫ్రెంచ్ - 27
- డిప్లొమా ఇన్ అరబిక్ - 16
- డిప్లొమా ఇన్ పాష్తో - 26
- పీజీ డిప్లొమా ఇన్ ప్రొఫెషనల్ అరబిక్ - 18
- పీజీ డిప్లొమా ఇన్ ఫంక్షనల్ హిందీ - 17

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **అభ్యర్థులు క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాల్సిన తేదీ:** సెప్టెంబరు 17
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** సెప్టెంబరు 19
- **అడ్మిషన్ ఫీజు చెల్లింపు:** సెప్టెంబరు 20 నుంచి 22 వరకు
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 23 నుంచి
- **వెబ్‌సైట్:** www.manuu.edu.in

శ్రీ చిత్ర తిరునల్ ఇన్‌స్టిట్యూట్‌లో
అకడమిక్ ప్రోగ్రామ్‌లు



త్రివేండ్రంలోని శ్రీ చిత్ర తిరునల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ(ఎస్‌సీటీఐఎంఎస్‌టీ)- డిప్లొమా, పీజీ డిప్లొమా, అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆపరేషన్ థియేటర్ అండ్ అనెస్థీషియా టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: ఆపరేషన్ థియేటర్‌కు డిప్లొమా(ఎలక్ట్రానిక్స్/బయోమెడికల్ ఇంజనీరింగ్ /ఇన్‌స్ట్రుమెంటేషన్); ఇమేజింగ్ టెక్నాలజీకి రెండేళ్ల సీఆర్‌ఏ/డీఆర్‌టీ కోర్సు పూర్తిచేసి ఉండాలి.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. కార్డియాక్ ల్యాబొరేటరీ టెక్నాలజీ, న్యూరో టెక్నాలజీ, మెడికల్ రికార్డ్స్ సైన్స్, క్లినికల్ పెర్ఫ్యూజన్, బ్లడ్ బ్యాంకింగ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బయలాజికల్ సైన్సెస్, బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ ప్రధాన సబ్జెక్టులుగా బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు ప్రోగ్రామ్ ప్రారంభం నాటికి 25 ఏళ్లు మించకూడదు.

అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో ఫిజియోథెరపీ ఇన్ న్యూరోలాజికల్ సైన్సెస్, ఫిజియోథెరపీ ఇన్ కార్డియోవాస్కులర్ సైన్సెస్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: నాలుగేళ్ల వ్యవధి గల బ్యాచిలర్ డిగ్రీ ఇన్ ఫిజియోథెరపీ(బీపీటీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఫిజియోథెరపీలో ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.

పీహెచ్‌డీ: ఏడాదికి రెండుసార్లు ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా అయిదేళ్లలో పూర్తిచేయాలి. నిబంధనల ప్రకారం ఎంపిక చేసినవారికి ఫెలోషిప్ అందిస్తారు. హెల్త్ సైన్సెస్ విభాగంలో పార్ట్ టైం ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు కనీసం వెయ్యి పదాలతో రీసెర్చ్ ప్రపోజల్, కనీసం 300 పదాలతో స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ అప్‌లోడ్ చేయాలి.

స్పెషలైజేషన్‌లు: ఫిజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్/బయో మెడికల్ సైన్సెస్, బయో ఇంజనీరింగ్, బయోమెటీరియల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మెడికల్ సైన్సెస్, హెల్త్ సైన్సెస్.

అర్హత: ఫిజికల్ సైన్సెస్‌కి పీజీ(ఫిజిక్స్ విభాగాలు); కెమికల్ సైన్సెస్‌కి పీజీ(కెమిస్ట్రీ విభాగాలు); బయలాజికల్ సైన్సెస్/బయో మెడికల్ సైన్సెస్‌కి పీజీ(ఫిజియాలజీ/బయోకెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/జువాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్/ప్లాంట్ సైన్సెస్/డెంటిస్ట్రీ/వెటర్నరీ సైన్స్); బయోఇంజనీరింగ్‌కి పీజీ(పాలిమర్ ఇంజనీరింగ్/మెటీరియల్ సైన్స్/బయోమెడికల్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ); బయోమెటీరియల్ సైన్స్ అండ్ టెక్నాలజీకి పీజీ(ఫిజిక్స్/ కెమిస్ట్రీ/పాలిమర్ కెమిస్ట్రీ/పాలిమర్ సైన్స్/మెటీరియల్ సైన్స్/బయోటెక్నాలజీ/వెటర్నరీ సైన్స్)/ఎంఫిల్(బయోమెడికల్ టెక్నాలజీ); హెల్త్ సైన్సెస్‌కి పీజీ(మోడరన్ మెడిసిన్/పబ్లిక్ హెల్త్/డెంటిస్ట్రీ/నర్సింగ్/వెటర్నరీ సైన్స్/డెమోగ్రఫీ/ఎకనామిక్స్/సోషియాలజీ/సోషల్ వర్క్/పొలిటికల్ సైన్స్/ బిజినెస్ మేనేజ్‌మెంట్/పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్/స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. మెడికల్ సైన్సెస్‌కి మాత్రం ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు ఏడాది వ్యవధి గల రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి. స్టేట్ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి. ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** పీహెచ్‌డీకి రూ.1500 (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1200); మిగిలిన ప్రోగ్రామ్‌లకు రూ.800(ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.640)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **ఎంట్రెన్స్ టెస్ట్‌లు, ఇంటర్వ్యూలు:** నవంబరు 14 నుంచి 16 వరకు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** 2025 జనవరి 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.sctimst.ac.in

రైల్వేలో గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులు

ఖాళీలు 11558

రైల్వే మంత్రిత్వశాఖ పరిధిలోని రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్‌ఆర్‌బీ) కింద పేర్కొన్న గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టుల భర్తీకి సంబంధించిన నాన్-టెక్నికల్ పాపులర్ కేటగిరీ(ఎన్‌టీపీసీ) నోటిఫికేషన్‌ని విడుదల చేసింది.

ఆర్‌ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, గోరఖ్‌పూర్, జమ్ము అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం.

గ్రాడ్యుయేట్ పోస్టులు

1. కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్: **1,736 పోస్టులు**
2. స్టేషన్ మాస్టర్: **994 పోస్టులు**
3. గూడ్స్ రైలు మేనేజర్: **3,144 పోస్టులు**
4. జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్: **1,507 పోస్టులు**
5. సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: **732 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత

వయోపరిమితి: 2025 జనవరి 01 నాటికి 18 నుంచి 36 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ప్రారంభ వేతనం: నెలకు రూ.29,200 నుంచి రూ.35,400 వరకు చెల్లిస్తారు.

అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులు

1. కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్: **2,022 పోస్టులు**
2. అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్: **361 పోస్టులు**
3. జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: **990 పోస్టులు**
4. ట్రైన్స్ క్లర్క్: **72 పోస్టులు**

వయోపరిమితి: 2025 జనవరి 1 నాటికి 18 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి.ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ప్రారంభ వేతనం: నెలకు రూ.19,900 నుంచి రూ.21,700 వరకు.

అర్హత: 12వ తరగతి ఉత్తీర్ణత.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(టైర్-1, టైర్-2), స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.



దరఖాస్తు రుసుము: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ కేటగిరీ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, ఈఎస్ఎం, ఈబీసీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు రూ.250.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: సెప్టెంబరు 14

చివరి తేదీ: అక్టోబరు 13

వెబ్‌సైట్: www.rrbapply.gov.in/#/auth/landing

న్యూ ఇండియా అస్యూరెన్స్‌లో ఆఫీసర్ ఖాళీలు

ఖాళీలు 170

ముంబయిలోని న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఎన్‌ఐఏసీఎల్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్

1. జనరలిస్ట్: **120 పోస్టులు**
2. అకౌంట్స్: **50 పోస్టులు**

అర్హత: జనరలిస్ట్ కేటగిరీకి ఏదైనా డిగ్రీ/పీజీ, అకౌంట్స్ కేటగిరీకి చార్టర్డ్ అకౌంటెంట్(ఐసీఏఐ)/కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్, ఏదైనా డిగ్రీ/పీజీ లేదా ఎంబీఏ ఫైనాన్స్/పీజీడీఎం ఫైనాన్స్/ఎంకాం ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 1 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

పే స్కేల్: నెలకు రూ.50,925 నుంచి రూ.96,765 వరకు చెల్లిస్తారు.

ఎంపిక ప్రక్రియ: ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 29

వెబ్‌సైట్: https://www.newindia.co.in/portal/


చిట్టిఫ్



అత్యాశ ఫలం

ఒక ఊరిలో గోవిందుడనే యువకుడు ఉండేవాడు. అతను తన దగ్గర ఉన్న ఆవులను సమీపంలో ఉన్న కొండ ప్రాంతానికి తీసుకువెళ్లి, మేపుకుని సాయంత్రానికల్లా తిరిగి తీసుకొచ్చేవాడు. తన పశువులు ఎక్కడైనా తప్పిపోతాయేమో అన్న భయంతో అతను వాటి మెడలో చిన్న చిన్న గంటలను కట్టాడు. ఆ గంటలు చేసే శబ్దాలను బట్టి తన ఆవులు ఎక్కడ ఉన్నదీ తెలుసుకునేలా ఆ ఏర్పాటు చేసుకున్నాడు. వాటిలో అతనికి చాలా ఇష్టమైన మేలు జాతి ఆవు ఒకటి ఉంది. దాని మెడలో అన్నిటికంటే ఖరీదైన గంట కట్టాడు, తన వద్ద ఉన్న ఒక గంట మోగించగానే ఆ ఆవు తన పిలుపు విని దగ్గరకు వచ్చేది. ఆవు వచ్చే అలికిడిని దాని మెడలోని గంట ద్వారా గుర్తు పట్టేవాడు గోవిందు. ఒక రోజు పశువులు మేత మేస్తూ ఉండగా, దూరం నుండి ఆ మేలుజాతి ఆవును చూసిన పక్కఊరి వ్యక్తి ఆ ఆవును ఎలాగైనా దొంగిలించాలి అనుకున్నాడు గోవిందు గంటల జాగ్రత్తను బాగా గమనించిన అతను గోవిందు దగ్గరికి వెళ్లి, నీ గంట చాలా బాగుంది ఆ గంటను నాకు అమ్ముతావా నీకు డబ్బు ఇస్తాను అన్నాడు గోవిందు డబ్బుకు ఆశపడి 'ఇతనెవరో ఉత్త వెర్రి బాగుల వాడి లాగా ఉన్నాడు. ఉత్త గంట కొంటాను అంటున్నాడు' అని మనసులో అనుకుని, సరే అని ఎక్కువ డబ్బు తీసుకుని, ఆ గంటను అమ్మేసాడు. ఆ మర్నాడు మేతకు వెళ్లిన ఆవులన్నీ తిరిగి వచ్చాయి కానీ గోవిందుకు ఇష్టమైన మేలుజాతి ఆవు మాత్రం రాలేదు ఇన్నాళ్లు గంట సాయంతో అది ఎక్కడ ఉందో కనిపెట్టేవాడు ఇపుడు ఆ గంట కూడా అమ్మేసాడు కాబట్టి, మరేమీ చేయలేక బాధ పడుతూ కూర్చున్నాడు. అప్పటికీ అతనికి గంట కొన్న వ్యక్తే తనావును తీసుకెళ్లి ఉంటాడన్న ఆలోచన రాలేదు, కేవలం గంట కొంటాననీ అడిగినపుడే అతని పన్నాగం గమనించాలి కానీ తన అత్యాశ వల్ల ఆ అవకాశం లేకుండా చేసుకున్నాడు గోవిందు.

10 తేడాలను కనిపెట్టండి



సరైన నీడను గుర్తించండి



ఏవి ఎన్ని?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 407

	7	2			6			
	9		5			1		
3		5		9				2
9		3		6				7
	4						5	
7				1		4		9
8				5		7		1
		9			1		3	
			8			9	2	

సుడోకు - 406 సమాధానం

8	4	1	5	2	6	7	3	9
2	9	5	4	3	7	1	8	6
7	6	3	9	8	1	4	5	2
9	2	7	8	4	5	3	6	1
5	8	4	1	6	3	2	9	7
1	3	6	2	7	9	5	4	8
6	7	2	3	9	4	8	1	5
4	5	8	6	1	2	9	7	3
3	1	9	7	5	8	6	2	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.